రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

మేము గెలిచాం

రేప్ కేసులో ఆప్ ఎమ్మెల్యే అరెస్టు 05

అక్రమ వలసదారులకు ప్రవేశం లేదు : కేంద్రం

సంపుటి 28, సంచిక: 74 | బుధవారం | 3-09-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## తక్షణ వరద సాయం రూ.200 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఆయా జిల్లాల్లో ప్రధాన రహదారులు, భవనాలు, చెరువులు, కుంటలు ధ్వంసమయ్యాయి. దీంతో వరద సాయం కింద పలు జిల్లాలకు తక్షణ సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను మంజూరు చేసింది. భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం జరిగిన ఏడు జిల్లాలకు గాను రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన 26 జిల్లాలకు గాను రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రెవెన్యూ (డిఎం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కెబి ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరుచేశారు. ఈ నిధులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 5 రోజుల్లో పంట నష్టం సర్వే పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రలో భారీ వర్షాలు, వరదల కారణంగా చోటు చేసుకున్న పంట నష్టం సర్వేను 5 రోజుల్లో పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, వారి పంటల రక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పునరుద్ఘాటించారు.వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుతానికి తరువాయి 2లో



## వైఎస్ ప్రారంభించారు... మేం పూర్తిచేస్తాం




- గోదావరిపై తుమ్మిడిహట్టి నిర్మిస్తాం
- ఎస్ఎల్‌బిసి పూర్తిచేసి నల్లగొండ ప్రజల రుణం తీర్చుకుంటాం
- రాహుల్‌ను ప్రధానిని చేయాలనే వైఎస్ కోరికను తీరుస్తాం
- రైతులకు ఉచిత విద్యుత్‌పై దివంగత ముఖ్యమంత్రిది చెరగని ముద్ర
- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు రద్దుచేసే ధైర్యం ఎవరికీ లేదు
- కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా సమస్య
- వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.నాగేశ్వరరావు, సి. పద్మకు పురస్కారాలు ప్రదానం

ప్రజాపక్షం/ హైదరాబాద్

"గోదావరి జలాలు చేవెళ్ల నుంచి ప్రాణహిత వరకు తరలించాలని అప్పటి సిఎం వైఎస్ఆర్ ఆలోచన చేశారు. గోదావరిపై తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ కాంగ్రెస్ ప్రభుత్వమే కడతుంది. ఫ్లోరైడ్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటిని అధిగమించడానికి రూ.2 వేల కోట్లతో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును చేపట్టారు. అది పూర్తయితే నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు వచ్చేది. ఎస్ఎల్‌బిసి పూర్తి చేసి నల్గొండ ప్రజల రుణం తీర్చుకుంటాం. ఈ దేశానికి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని వైఎస్ఆర్ అనేవారు. ఆయన కోరిక తీర్చే బాధ్యతను నేను, షర్మిల, కెవిపి సహా మేమంతా తీసుకుంటాం. ప్రజల సహకారం కూడా కావాలి" అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన 'వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం హాజరైయ్యారు. సేంద్రీయ వ్యవసాయంలో విశిష్ట కృషి చేస్తున్న డాక్టర్ సుభాష్ పాలేకర్ , వివిధ రంగాలలో విశేష కృషి చేసిన డాక్టర్ సి.నాగేశ్వరరావు, సి.పద్మకు వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డును అందించారు. సభలో తరువాయి 2లో

## బిఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్



- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నందున కెసిఆర్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటన
- గత మూడు నెలలుగా పార్టీకి ఎంతో నష్టం చేశారని ఆరోపణ
- ఎమ్మెల్సీపై వేటు నిర్ణయం హర్షణీయమన్న పలువురు నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను బిఆర్ఎస్ సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బిఆర్ఎస్ వెల్లడించింది."పార్టీ ఎంఎల్‌సి కె.కవిత ఇటీవల కాలంలో ప్రవర్తిస్తున్న తీరు తెన్నులు,ఆమె కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, బిఆర్ఎస్‌కు నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నందున కవితను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ, పార్టీ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ రావు నిర్ణయం తీసుకున్నారు"అని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్,టి.రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హరీశ్ రావు, సంతోష్ వల్లనే కెసిఆర్‌కు అవినీతి మరక అంటిందని కవిత ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన బిఆర్ఎస్, కవిత నుంచి వివరణ కూడా తీసుకోకుండానే ఆమెపైన సస్పెన్షన్ వేటు వేసింది. అయితే గత కొంత కాలంగా ఆమె చేసిన వ్యాఖ్యాలపై బిఆర్ఎస్ అధికారికంగా ఎక్కడా పెద్దగా స్పందించ లేదు. ఇటీవల మాజీ మంత్రి జి.జగదీష్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేయగా, ఆయన కూడా ప్రతి స్పందించారు. ఆ తర్వాత ఆమెను బిఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న బొగ్గు కార్మిక సంఘం గౌరవ అధ్యక్ష పదవినుంచి తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే దీనిపైన కవిత బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మీడియా తరువాయి 2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు



- ఈనెల 8న విధివిధానాలు ఖరారు
- టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం
- నెలకు రూ.700 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్
- సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు
- ఉద్యోగుల జెఎసికి కేబినేట్ సబ్ కమిటీ హామీ


ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న 'నగదు రహిత చికిత్స' నిమిత్తం హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, ఈనెల 8న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో ప్రత్యేక భేటీ ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస రావు తెలిపారు. అధికారుల కమిటీతో చర్చించి విధి విధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రభుత్వం కచ్చితమైన తరువాయి 12లో

## కాళేశ్వరంపై సిబిఐ దర్యాప్తుకు మార్గం సుగమం

- అవకతవకలపై దర్యాప్తు సంస్థ చేసే విచారణకు పూర్తిగా సహకరిస్తాం
- ప్రభుత్వం ప్రకటన : జిఒ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాళేశ్వరంపై సిబిఐ విచారణకు లైన్ క్లియర్ అయింది. కాళేశ్వరం అవకతవకలపై సిబిఐ చేసే విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం జీవో విడుదల చేసింది. తెలంగాణలో సిబిఐకి ఎంట్రీ లేకుండా 2022లో గత ప్రభుత్వం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ ఆంక్షల నుంచి ప్రస్తుత ప్రభుత్వం మినహాయింపు తరువాయి 2లో

## ఎన్‌డిఎస్‌ఎ నివేదిక మేరకు సిబిఐ దర్యాప్తు

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ

- పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దన్న ఉన్నత న్యాయస్థానం
- కెసిఆర్, హరీష్‌రావుకు వెసులుబాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సిబిఐ దర్యాప్తు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక సిఫారసులకు అనుగుణంగా సిబిఐ దర్యాప్తు ఉండబోదని, అంతేకాకుండా రిపోర్టు సిఫారుసులను ఆధారంగా చేసుకుని పిటిషనర్లు కెసిఆర్, హరీష్‌రావుపై చర్యలు కూడా తీసుకోబోమని తెలియజేసింది. ప్రభుత్వ హామీలను రికార్డు చేసిన హైకోర్టు అందుకు అనుగుణంగా మధ్యంతర ఉత్వర్వులను వెలువరించింది. కమిషన్ రిపోర్టును బేస్ చేసుకుని పిటిషనర్లపై చర్యలు తీసుకోరాదని, కమిషన్ రిపోర్టు ఆధారంగా సిబిఐ దర్యాప్తు చేయరాదని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథార్టీ రిపోర్టు ఆధారంగా సిబిఐ దర్యాప్తు చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం. పర్యవేక్షణ తదితరాలపై తరువాయి 2లో

## ప్రాంతీయ పార్టీల పాలిట బిజెపి భస్మాసుర హస్తం

దూరంగా ఉంటే మంచిది

డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రాంతీయ పార్టీల పాలిట బిజెపి భస్మాసుర హస్తమని, ఆ పార్టీకి ఎంత దూరంగా ఉంటే అంతా మంచిందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. ఇందుకు తెలంగాణలో బిజెపికి బిఆర్ఎస్ దగ్గర కావడం వల్లే ఆ పార్టీలో చీలికలు వచ్చాయని తరువాయి 2లో

## ఆదాయ నష్టంపై కేంద్రాన్ని నిలదీయనున్న రాష్ట్రాలు

- శ్లాబుల మార్పుపై నేడు–రేపు జిఎస్‌టి కీలక భేటీ
- రోజువారీ ఆహార, వినియోగ వస్తువులపై తగ్గనున్న పన్నుభారం




**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను శ్లాబుల ప్రక్షాళనపై జిఎస్‌టి కౌన్సిల్ కీలక సమావేశాలు బుధ,గురు వారాలలో న్యూఢిల్లీలో జరుగుతాయి. ఇప్పటివరకూ ఉన్న నాలుగు శ్లాబులను రెండు శ్లాబులకే కుదించడంవల్ల పన్నులభారం తగ్గి సామాన్య ప్రజలకు మేలు జరుగుతుంది.ఎలక్ట్రానిక్ వాహనాల(ఇవి)పై ఐదూశాతం పన్ను విధించాలనే అంశాన్ని కూడా ఈ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చే అవకాశం ఉంది. జిఎస్‌టి ప్రక్షాళన తర్వాత కలిగే ఆదాయ నష్టాన్ని భర్తీ చేయాలన్న డిమాండ్‌పై ఈ సమావేశంలో ప్రధానంగా ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు కేంద్రాన్ని నిలదీయనున్నాయి. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలలో వివిధ రాష్ట్రాలు, తరువాయి 12లో

## అవయవ మార్పిడీలతో ఈస్టర్న్ హబ్‌గా తెలంగాణ

- ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలకు ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మానుకోటలో మెడికల్, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం



ప్రజాపక్షం/మహబూబాబాద్

ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు (16) ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు నిర్మించి ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించడం కోసం నిబద్ధతతో ముందుకు సాగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలో మౌలిక వసతుల తరువాయి 2లో

## చైనా–రష్యా బంధం అగ్రదేశాల మైత్రికి ఉదాహరణ



పుతిన్‌తో చర్చల్లో జిన్‌పింగ్ ఉద్ఘాటన

**బీజింగ్:** చైనా–రష్యా మధ్య సంబంధాలు ప్రపంచంలో అగ్రదేశాల మైత్రికి ఒక ఉత్తమ ఉదాహరణ అని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. బీజింగ్‌లోని పీపుల్స్ గ్రేట్‌హాల్‌లో నాయకులిద్దరూ ముఖాముఖీ సమావేశం జరిపారు. చైనా,రష్యా దేశాలు రెండూ అమెరికా నుండి అనేక సవాళ్ళు ఎదుర్కొంటున్న తరుణంలో వారిమధ్య వరుస సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సమావేశంలో పుతిన్‌ను జిన్‌పింగ్ "ఓల్డ్ ఫ్రెండ్" గా అభివర్ణించారు. అదేవిధంగా జిన్‌పింగ్‌ను "ప్రియమైన మిత్రుడు"గా పుతిన్ సంబోధించారు. గడచిన మూడు సంవత్సరాలుగా రెండు దేశాల మధ్యా మైత్రీబంధం మరింత బలపడింది. మన రెండు దేశాల సంబంధాలు ప్రపంచంలో తరువాయి 12లో



## యమున ఉగ్రరూపం...


ఇళ్లల్లోకి వరద నీరు

**న్యూఢిల్లీ:** కొన్ని రోజులుగా ఉత్తరాదిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు, వరదల కారణంగా యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. హర్యానాలోని మయునానగర్‌లోని హత్నికుండ్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఢిల్లీలోని యమునా నది డేంజర్ మార్క్ దాటి ప్రవహిస్తోంది. ఇళ్లల్లోకి వరద నీరు తరువాయి 12లో



## ప్రజాస్వామ్య అంతమే బిజెపి లక్ష్యం 05

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)
(సిపిఐ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు – 6వ పేజీలో)



# ప్రపంచం
WORLD NEWS

## ఇండోనేషియాలో కుప్పకూలిన హెలికాప్టర్?

భారతీయుడు సహా 8మందికోసం అన్వేషణ

**జకర్తా:** ఒక భారతీయుడు సహా ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ఒక హెలికాప్టర్ కోసం ఇండోనేషియాలో అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఇండోనేషియా బోర్నియో ద్వీపంలో ఈ హెలికాప్టర్ జాడ తెలియకుండాపోయింది. సోమవారంనాడు హెలికాప్టర్‌కు ప్రధాన కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. అప్పటినుండి దానికోసం తీవ్ర గాలింపు కొనసాగుతోంది. ఒక పైలట్, ఇంజనీర్, మరో ఆరుగురు ప్రయాణికులు ఇందులో ప్రయాణిస్తుండగా, దక్షిణ కలిమంతన్ రాష్ట్రం వెంబెత్ మండిన్ డామర్ వాటర్‌ఫాల్ సమీపంలో ఉండగా హెలికాప్టర్ పైలట్‌తో అనుసంధానం తెగిపోయింది. ప్రయాణికులలో శాంతకుమార్ అనే భారత జాతీయుడు కూడా ఉన్నారు. రెండు హెలికాప్టర్లు ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. హెలికాప్టర్ కుప్పకూలిపోయి ఉంటుందని భావిస్తున్నారు.

## కొండచరియలు విరిగిపడి సూడాన్ గ్రామం సమాధి

1000 మంది మృతి



**ఖార్టూమ్:** దక్షిణ సూడాన్ మర్రా పర్వతప్రాంత గ్రామంపై కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ విషాద ఘటనలో తారాసిన్ అనే గ్రామం భూ సమాధైపోయింది. ఈ గ్రామంలో చివరకు ఒకే ఒక్క వ్యక్తి సజీవుడుగా మిగిలాడు. ఆదివారం జరిగిన ఈ విలయంలో దాదాపు 1000 మంది ప్రజలు మరణించి ఉంటారని ఐక్యరాజ్యసమితి భయాందోళన వ్యక్తం చేసింది. డార్ఫర్‌లో ఉన్న ఆర్మీ గవర్నర్ మిన్నీ మిన్నావీ ఈ ప్రమాదం గురించి ప్రపంచానికి తెలియజేస్తూ సూడాన్‌లో జరిగిన అతిపెద్ద మానవ విషాదంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ సహాయ సంస్థలు తక్షణం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతానికి చేరుకోవడం చాలా కష్టమైన పనైనందువల్ల మృతుల సంఖ్యను ఖచ్చితంగా అంచనావేయలేమని ఐక్యరాజ్యసమితి సూడాన్ మానవతా వ్యవహారాల డిప్యూటీ అధికారి ఆంటోయిన్ గెరార్డ్ చెప్పారు. తమవద్ద హెలికాప్టర్లు లేవని ఈ ప్రాంతానికి వెళ్ళాలంటే కేవలం వాహనాల్లోనే మానవతా సహాయాన్ని, ఇతర సామాగ్రిని తీసుకువెళ్ళాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. అనేక రోజులుగా ఈ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తూ ఉండటం కొండచరియలు బాగా నానిపోయి ఉండటం ఈ విలయానికి ప్రధాన కారణం. ఆఫ్రికా ఖండంలో, అరబ్ ప్రపంచంలో అతిపెద్ద దేశం సూడాన్‌లో గడచిన రెండు సంవత్సరాలుగా అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతోంది. ఆకలి, హత్యలు, అత్యాచారాలు, కరువుకాటకాలు దేశంలో రాజ్యమేలుతున్న తరుణంలో పులిమీద పుట్ర (ఆపదమీద మరో ఆపద)లా ఈ ఘోర ప్రకృతి విలయం సంభవించింది. కొండచరియలు విరిగిపడి సమాధైన తారాసిన్ గ్రామం ప్రస్తుతం లిబరేషన్ మూవ్‌మెంట్ సాయుధ బృందాల అధీనంలో ఉంది. గ్రామంలో వెయ్యిమంది మరణించినట్లు ఈ గ్రూపు తెలియజేసింది. తక్షణ అంతర్జాతీయ సహాయం అందజేయాలని ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సహాయ సంస్థలకు లిబరేషన్ మూమెంట్ గ్రూపు విజ్ఞప్తి చేసింది. సూడాన్ ప్రభుత్వంలోని సైనిక జనరల్,పారామిలిటరీ విభేదాలు రావడంతో 2023 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆర్మీకి, అందులోంచి చీలిపోయిన ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) వర్గాలమధ్య పశ్చిమ డార్ఫర్ ప్రాంతంలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఈ అంతర్యుద్ధంలో ఇప్పటివరకూ 1.50 లక్షలమంది ప్రజలు మరణించారని, మరో కోటీ 20 లక్షలాదిమంది ఇళ్ళు వదిలిపోయారని KLW అమెరికా అధికారులు అంచనా వేశారు. అనేకమంది మహిళలు, పిల్లలు అత్యాచారాలకు గురయ్యారు. దేశంలో కరువుకాటకాలు తాండవిస్తున్నాయి. మిశ్రమజాతులున్న ఈ ప్రాంతాన్ని అరబ్ పాలకులకు అనుబంధంగా మార్చాలని ఆర్‌ఎస్‌ఎఫ్, ఇతర ఉగ్రవాద సంస్థలు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

## చైనా, రష్యా, మంగోలియా పరస్పర సహకారం

త్రైపాక్షిక చర్చల్లో జిన్‌పింగ్ పిలుపు



**బీజింగ్:** చైనా, రష్యా, మంగోలియా దేశాలమధ్య పరస్పర ఉమ్మడి సహకారానికి జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. బీజింగ్‌లోని పీపుల్స్ గ్రేట్‌హాల్‌లో మంగళవారం ఉదయం రష్యా అధ్యక్షుడు పుతిన్, మంగోలియా అధ్యక్షుడు ఉఖ్నా ఖురేల్‌సుఖ్‌తో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉమ్మడిగా త్రైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుగు పొరుగు దేశాలమధ్య సంపూర్ణ రాజకీయ విశ్వాసం బలోపేతం కావాలని, అప్పుడే మన మూడు దేశాల మధ్యా పరస్పర ప్రయోజనాత్మకమైన సహకారం వేళ్ళూనుకుంటుందని పిలుపు ఇచ్చారు. మూడు దేశాలమధ్య సంభాషణ, పరస్పర విశ్వాసం, సహకారం వృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఒకరి సమస్యలు ఒకరు పంచుకుంటూ పరస్పర అభివృద్ధి, పునరుజ్జీవాలకు దోహదం చాల్సి ఉందన్నారు. మూడుదేశాలు బలమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేర్చే ఇంధన సహకార ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. పుతిన్ మాట్లాడుతూ, మూడు దేశాలు అభివృద్ధి దిశలో పూర్వాత్మక చర్యలు తీసుకోవాలన్నారు.

**వీసా లేకుండా రష్యన్‌లకు చైనా అనుమతి**

రష్యాతో సంబంధాల విస్తరణలో భాగంగా వీసా లేని పర్యటనకు చైనా అనుమతించింది. ఈనెల 15వ తేదీ నుండి వచ్చే ఏడాది సెప్టెంబరు 15వ తేదీ వరకూ ప్రయోగ ప్రాతిపదికపై రష్యన్ ప్రజలు చైనాలో పర్యటనలు చేయవచ్చు. వీసాలేకుండా అనుమతించే దేశాల జాబితాను విస్తరించడంలో భాగంగా చైనా ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణ పాస్‌పోర్టు హోల్డర్లు, పర్యాటకులు, వ్యాపార, వాణిజ్య అవసరాలకోసం వచ్చేవారు, కుటుంబం సహా పర్యటనలు చేసేవారికి, వరుసగా 30 రోజులు బస చేసేవారికి ఈ అనుమతులు ఇస్తున్నట్లు చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు. చైనా–రష్యా అధికార ప్రతినిధులమధ్య మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు అనుమతించినట్లు ఆయన మీడియాకు చెప్పారు. రెండు దేశాల ప్రజలమధ్య మెరుగైన సంబంధాలు కొనసాగేందుకు చైనా ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

# సమయం లేదు, సహకరించండి

ప్రపంచదేశాలకు తాలిబన్ ప్రభుత్వం విజ్ఞప్తి... 1400 దాటిన అఫ్ఘాన్ భూకంప మృతులు... ఐదు మిలియన్ డాలర్లు కేటాయించిన ఐరాస

**కాబూల్:** తూర్పు అఫ్ఘానిస్థాన్‌లో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 1400 దాటిందని తాలిబన్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. గాయపడినవారి సంఖ్య 3000 దాటిందని, కునార్, లాఘ్మన్ సహా అనేక రాష్ట్రాలలో ఆదివారం అర్థరాత్రి దాటిన తర్వాత వచ్చిన భూకంపం తీవ్ర విధ్వంసం సృష్టించిందని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజహిద్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేశారు. 8000 ఇళ్ళు నేలమట్టమైనట్లు ఇప్పటివరకూ గుర్తించారు. ఒకవైపు సమయం లేదని, మరోవైపు వనరుల సంక్షోభం వెంటాడుతోందని ఆయన పేర్కొన్నారు. మట్టి,బురద, శిథిలాలు, అందులో చిక్కుకున్న సజీవులు, వారికోసం అన్వేషణ, ప్రజల ఆర్తనాదాలు వంటివన్నీ భరింపశక్యంకాని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. సమయం లేనందువల్ల అంతర్జాతీయ ప్రపంచం స్పందించి ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేసమయంలో దాతలుగా ఉండే దేశాలు సహాయం చేయడం తగ్గించుకోవడంతో మానవతాసహాయంలో కూడా తీవ్ర కొరతలు ఎదురవుతున్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రపంచదేశాలకు ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారు. ఈ సహాయం దుర్వినియోగం అవుతోందని ఆయన ఆరోపించారు. అఫ్ఘానిస్థాన్‌లో 420కిపైగా ఉన్న ఆరోగ్య కేంద్రాలు నిధులకొరత వల్ల ఇప్పటికే మూతపడ్డాయని ఆ దేశంలో ఐక్యరాజ్యసమితి తరపున మానవతా వ్యవహారాలను సమన్వయం చేస్తున్న ఉపాధికారి కటే కారే చెప్పారు. ఇదిలా ఉండగా, శిథిలాల్లో చిక్కుకున్న సజీవులకోసం ముమ్మర గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం హెలికాప్టర్లను కూడా ఉపయోగిస్తున్నారు. అంతకుముందునుండీ కురిసిన వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో మారుమూల పర్వతప్రాంతాలకు భూమార్గం మూసుకుపోయింది. హెలికాప్టర్లనే ప్రభుత్వం ఉపయోగిస్తోంది. భూకంప తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.2 నమోదైంది. కునార్ రాష్ట్రంలోని నూర్గల్, సోకీ, వాట్పూర్, మనోగీ, ఛాపదార్ తదితర జిల్లాలలో వందలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయి. కాగా ఐక్యరాజ్యసమితి అఫ్ఘానిస్థాన్ భూకంప బాధితులకు అండగా నిలబడేందుకు తక్షణం 5 మిలియన్ డాలర్లు సహాయం ప్రకటించింది. తాలిబన్ ప్రభుత్వం కూడా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. 10.8 మిలియన్ పౌండ్లు అఫ్గనీస్‌ను కూడా నిధిగా సమకూర్చింది. ఐక్యరాజ్యసమితితోపాటు భారతదేశం, జపాన్ కూడా తక్షణం స్పందించాయి. ఐక్యరాజ్యసమితి, యూనిసెఫ్ హుటాహుటిన సహాయ చర్యలకు దిగాయి. అఫ్ఘానిస్థాన్‌కు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది.

## ఇండోనేషియా అల్లర్లలో 20 మంది గల్లంతు : ఆరుగురు మృతి

**జకర్తా:** ఇండోనేషియాలో జీవనవ్యయాల పెరుగుదల,నిరుద్యోగాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారడంతో గడచిన గురువారం (ఆగస్టు 25) నుండి ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా ఎనిమిది మంది మరణించారు. సోమవారంనాటికి 20 మంది జాడ తెలియకుండాపోయారని ఫిర్యాదులు అందినట్లు మానవహక్కుల సంఘం మంగళవారం ప్రకటించింది. గడచిన వారం రోజులుగా పోలీసులు 1,240 మంది ప్రదర్శకులను అరెస్టుచేసి జైలులో ఉంచారు. వీరిలో లోకతారు ఫౌండేషన్ డైరెక్టర్ డెల్‌పెడ్రో మర్హాయెన్‌కు కూడా అరెస్టు చేసినట్లు జకర్తా పోలీసు అధికార ప్రతినిధి శ్యామ్ ఇంద్రాది ధృవీకరించారు. ఈ హింసాత్మక అల్లర్లు జరగడానికి ప్రధాన సూత్రధారుల్లో మర్హాయెన్ కూడా ప్రధాన వ్యక్తిగా పోలీసులు సందేహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజా నిరసన ప్రదర్శనలను అణచివేసేందుకు వేలాదిమంది సైన్యాన్ని మోహరించడంపై దర్యాప్తు జరపాలని ఐక్యరాజ్యసమితి డిమాండ్ చేసింది. పార్లమెంటు వెలుపల, దేశవ్యాప్తంగా అనేక నగరాలలో నిరసన ప్రదర్శనలు ఘర్షణలు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలవద్ద భారీగా సైన్యాన్ని ప్రభుత్వం మోహరించింది.



ఒక టాక్సీడ్రైవర్‌ను పారామిలిటరీ పోలీసులు పాశవికంగా చంపడంతో ప్రజాగ్రహం పెల్లుబికి ఈ నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. తర్వాత అల్లర్లు, లూటీలకు పరిస్థితి దిగజారింది. దేశంలో దాదాపు 500 మంది చట్టసభల సభ్యులు నెలవారీ వేతనాలు భారీగా పెంచుకోవడమేకాకుండా, అదనపు ఇంటి అలవెన్సులు కూడా తీసుకుంటున్నారని, ప్రజలు దుర్భరపరిస్థితుల్లో జీవిస్తున్నారని విమర్శలు రావడంతో దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియంతో ఈ అలవెన్సులను రద్దు చేశారు. ప్రదర్శనలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. ఆ తర్వాత కూడా కొనసాగిన అల్లర్లు, నిరసన ప్రదర్శనలలో ఇప్పటివరకూ చేసిన తనిఖీల ప్రకారం 20 మంది జాడతెలియడంలేదని కమిషన్ ఫర్ డిజపియర్డ్ అండ్ విక్టిమ్స్ఆఫ్ వయెలెన్స్ (కోంట్రాస్) ప్రకటించింది. బాండంగ్ నగరంలో, జావా ద్వీపంలోని డెపోక్,సెంట్రల్ జకర్తా,ఈస్ట్ జకర్తా, నార్త్ జకర్తా ప్రాంతాలలో ఉన్న వీరి జాడ ఇప్పటివరకూ తెలియలేదని కోంట్రాస్ ప్రకటించింది. ఐతే పోలీసులు దీనిపై స్పందించకుండా మౌనం పాటిస్తున్నారు.

## భస్మాసుర హస్తం

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ పేర్కొన్నారు. కవిత సస్పెన్షన్, పార్టీ విభజనకు బిజెపినే కారణమని నారాయణ ఆరోపించారు. అన్నాడిఎంకె (తమిళనాడు), శివసేన – ఎన్‌సిపి (మహారాష్ట్ర) పార్టీల విషయంలో కూడా బిజెపి ఇదే తరహా ధోరణి ప్రదర్శించిందని గుర్తు చేశారు. బిజెపికి దగ్గరైన ప్రతీ పార్టీ చివరికి కనుమరుగైపోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేనకు కూడా ఇదే పరిస్థితి ఎదురుకానుందని ఆయన జోస్యం చెప్పారు.బిజెపి భస్మాసుర హస్తం చంద్రబాబుతో సహా అందరికీ వర్తిస్తుందని నారాయణ సోమవారం వీడియో సందేశంలో హెచ్చరించారు.

## సర్వే పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

అందిన ప్రాథమిక నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2.50లక్షల ఎకరాల పంటనష్టం వాట్లిందని అంచన కాగా, పూర్తి స్థాయి నివేదికలు రావాల్సి ఉందన్నారు.. ఇందుకు సంబంధించి మరో 5 రోజుల్లో సర్వే పూర్తి కానుందని, ఎంత మేర ఏ పంటలకు నష్టం వాట్లిందో తెలియనుందని వెల్లడించారు.

**రాష్ట్రం చేరుకుంటున్న యూరియా**

రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాయని కేంద్రం నుంచి రాష్ట్రానికి యూరియా సరఫరాకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం ఒక్కరోజే రాష్ట్రానికి 9 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, మంగళవారం మరో 5 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని వెల్లడించారు. ఈ యూరియా రైల్వే రేక్ పాయింట్లయిన సనత్ నగర్, వరంగల్, జడ్చర్ల, నాగిరెడ్డిపల్లి, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు చేరుకుంటుందని తెలిపారు. వచ్చే వారం రోజుల్లో కరాయికల్, గంగవరం, దామ్ర పోర్టుల ద్వారా మరో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. డిమాండ్ కు అనుగుణంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ ఎరువులను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత ఉండకుండా, అవసరమైన చోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

## మేం పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఎపి మాజీ ప్రభుత్వ సలహాదారులు కెవిపి.రామచంద్రరావు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు.

**రైతులకు ఉచిత విద్యుత్‌పై వైఎస్సార్ చెరగని ముద్ర**

రైతులకు ఉచితవిద్యుత్‌పై మాజీ సిఎం వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతుల విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతో పాటు, వారిపై కేసులు కొట్టి వేసి వైఎస్సార్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఉచిత విద్యుత్ ఎవరు ఇచ్చినా వైఎస్ఆర్ పేరే గుర్తుకు తెచ్చుకుంటారని చెప్పారు. 'భవిష్యత్తులోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్సార్ అమలు చేశారు. ఆరోగ్యశ్రీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదు. ఆయన స్ఫూర్తిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షలు ఉంటే రూ.10లక్షలు చేశాం. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతుల రుణమాఫీ అమలు చేశాం. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోవడంతో రాష్ట్రంలోని రైతులకు యూరియా సమస్య వచ్చింది. సుభాష్ పాలేకర్ చెప్పినట్లు సేంద్రియ వ్యవసాయం చేస్తే ఉపయోకరంగా ఉంటుంది. ఆ దిశగా రసాయన వ్యవసాయం నుంచి సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి'' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను పూర్తి చేస్తాం**

ఫ్లోరైడ్ వల్ల జీవించలేని పరిస్థితులు ఉన్న నల్లగొండ జిల్లాను మార్చాలని వైఎస్ఆర్ భావించారని, తాగు, సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు చేపట్టారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను పూర్తి చేస్తామని సిఎం ప్రకటించారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎస్ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులను పక్కకు పెట్టిందని, పదేళ్లు పనులు ఆగిపోవడంతో ఎస్ఎల్‌బిసి టన్నెల్లో ప్రమాదం జరిగిందని తెలిపారు.

**రైతులకు ఉచిత కరెంటు పేటెంట్ : వైఎస్**

మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆలోచనలను, కాంగ్రెస్ భావజాలాన్ని రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తూ ముందుకు పోతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ఉచిత కరెంటు పేటెంట్ వైయస్ అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి నడి వేసవిని లెక్క చేయకుండా తన సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్రంలోని తాడిత, పీడితులు, రైతుల సమస్యలను తెలుసుకుని అవగాహన చేసుకున్నారని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే మొదటి సంతకం ఉచిత విద్యుత్‌పై చేశారన్నారు. భారతదేశంలో ఎవరైనా ఉచిత విద్యుత్తు అందజేస్తున్నారంటే అది వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేటెంట్ అన్నారు. ప్రభుత్వం అంటే ఎలా ఉండాలో చూపించిన మహానేత వైఎస్, వారి భావాలు ఆలోచనలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులందరిపై ఉందన్నారు.

## కవిత సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో స్పందించనున్నారు. పార్టీ సస్పెండ్ వేటు వేసిన నేపథ్యంలో ఆమె తన ఎంఎల్‌సి పదవికి కూడా రాజీనామా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**కవిత వల్లనే కెసిఆర్‌కు మచ్చ: సత్యవతి రాథోడ్**

మూడు నెలలుగా కవిత తన తీరుతో పార్టీకి ఎంతో నష్టం చేశారని బిఆర్ఎస్ మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. కవితను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం అందరినీ ముఖ్యంగా, మహిళలను సంతోష పరిచిందన్నారు.

తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పార్టీ ఉంటె ఎంత, పోతే ఎంత అని కవిత మాట్లాడొచ్చా?, అందుకే పార్టీలో కవిత ఉంటె ఎంత లేకపోతే ఎంత? అని ఆమెకు కేడర్ బదులిచ్చిందని తెలిపారు. కవితనే కెసిఆర్‌కు మచ్చ తెచ్చిందని ప్రజలు భావించారని, అందుకే కెసిఆర్ తీసుకున్న నిర్ణయం గొప్పదన్నారు. కవిత కు నచ్చచెప్పాలని చూసినప్పటికీ ఆమె వినలేదని, అందుకే కెసిఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కవిత తన మాటలతో బిఆర్ఎస్ శ్రేణులను గాయపరిచిందన్నారు. హరీష్‌రావు,కెటిఆర్‌లు కెసిఆర్‌కు కుడి ఎడమ భుజాల్లాంటి వారని సత్యవతి రాథోడ్ అభివర్ణించారు.

మాజీ ఎంఎల్ఎ గొంగిడి సునీత మాట్లాడుతూ కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారని ఎద్దేవా చేశారు. కవిత భుజం మీద తుపాకీ పెట్టి ఎవరు కాలుస్తున్నారో .కాలగమనంలో అన్ని విషయాలూ బయటకు వస్తాయన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ అసెంబ్లీ హరీష్ రావు మాట్లాడిన తీరు బిఆర్ఎస్‌లో కొత్త ఉత్సాహాన్ని తెచ్చిందని, ఈ ఉత్సాహాన్ని నీరు గార్చేందుకు కవితతో కొందరు బిఆర్ఎస్‌కు వ్యతిరేక వ్యాఖ్యలు చేయించారని ఆరోపించారు. కవితపైన పార్టీ కార్యకర్తలు రగిలి పోయారన్నారు.

**కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: వివేక్**

కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కవిత పనుల వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని గుర్తించారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కె.పి.వివేకానంద తెలిపారు. కన్నబిడ్డ కంటే కష్టంలో పార్టీకి అండగా ఉన్నవారే ముఖ్యమని చాటారని, పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదన్న విషయం స్పష్టమైందని ఒక ప్రకటనలో పేర్కొన్నా రు.

**కాంగ్రెస్ ఉచ్చులో పడిన కవిత: పల్లా**

పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే కవితపై చర్యలు తీసుకున్నారని ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 60 లక్షల పార్టీ కార్యకర్తల మనోభావాల మేరకు నిర్ణయం తీసుకున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కన్నబిడ్డకంటే పార్టీ శ్రేయస్సే ముఖ్యమని కెసిఆర్ స్పష్టం చేశారని, కవిత కాంగ్రెస్ ఉచ్చులో పడి, ఆ పార్టీ చెప్పినట్టుగా నడుచుకుంటున్నారని, ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ కలహాలు సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటేనని ఆరోపించారు.

**కవిత పనుల వల్ల పార్టీకి నష్టం: రాజీవ్ సాగర్**

పార్టీకి నష్టం కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ తెలిపారు. గత కొద్దిరోజులుగా బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతు,కవిత చేస్తున్న పనుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఈస్టర్న్ హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నా రు. వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నర్సింగ్ కాలేజీల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి కల్పించడం కోసం ఇతర దేశాల భాషలపై నైపుణ్యత కల్పించడం కోసం వినూత్న కార్యక్రమం చేపడుతుందన్నారు. తద్వారా ఆర్థికంగా స్థిరపడతారని అన్నారు. ఎన్సిడినీ నియంత్రించాలని అందుకు వైద్యశాఖ కృషి చేయాలన్నారు. అవయవాల మార్పిడి ద్వారా ఈస్టర్న్ తెలంగాణ హబ్‌గా మారాలని సూచించారు. వైద్య రంగంలో నూతన టెక్నాలజీ వినియోగించి ముందుకు సాగాలన్నారు.

మహబూబాబాద్ పట్టణంలోని మెడికల్, నర్సింగ్ కాలేజీని ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్,దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో 186 కోట్ల వ్యయంతో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజ్, 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలికలు,బాలుర, హాస్టల్ ప్రారంభించి, మూడవ సంవత్సరం చదువుతున్న దమయంతి, స్వాతి, ప్రకాష్ పాండే, మైదేహి వర్మ, అనీషా, యతేశం, తదితర వైద్య విద్యార్థిని,విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యంకు కోసం ప్రత్యేక కార్యచరణ ద్వారా క్షేత్రస్థాయిలో ఆసుపత్రులు విద్యాసంస్థలు అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమంపై ముందుకు సాగుతుందని, జిల్లాకు (18) టన్నుల యూరియా రావడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి మరింత యూరియా కోటాను సాధించడం కోసం మంత్రివర్గం ఢిల్లీకి వెళ్లనుందని ఆయన చెప్పారు. రాష్ట్ర అటవీ,దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం బాగుగా ఉంటేనే ఏదైనా చేయగలమని అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని వైద్యశాఖ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గిరిజన ప్రాంతం కాబట్టి పూర్తిస్థాయిలో అధిక నిధులు కేటాయించి జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అందు లో భాగంగానే వైద్య,నర్సింగ్ కళాశాలు నిర్మించి మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గూడూరును ఆపరేట్ చేయాలని, నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జేపీ స్టేయూ, జూనియర్ కాలేజీలు, పాఠశాలలు, స్టేడియం, మహబూబాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముఖ్యమంత్రి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, డిఎంఈ డాక్టర్ కె. నరేంద్ర కుమార్, ఎన్ఎంసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విమల తమస్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ వెంకట్, ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సిబిఐ దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ ప్రాజెక్టు భద్రతా మండలి (ఎన్డీఎస్ఎ) రాష్ట్రానికి ఇచ్చిన మధ్యంతర, తుది నివేదికల ఆధారంగా సిబిఐ దర్యాప్తునకు అనుమతిచ్చింది. కమిషన్ రిపోర్టుపై మాజి సిఎం, బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు, మాజి మంత్రి టి.హరీష్‌రావు వేరువేరుగా వేసిన మధ్యంతర పిటిషన్లతోపాటు జివో 6 ద్వారా ఏర్పాటైన జస్టిస్ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేసిన ప్రధాన పిటిషన్లపై విచారణను అక్టోబర్ 7కి వాయిదా వేసింది. అప్పటిలోగా ప్రభుత్వం కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు ఇస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎ.కె. సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది.

కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తరువాత ఎలాంటి చర్యలు తీసుకోలేదని, సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నట్లు రాష్ట్ర సర్కార్ తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్లు కమిషన్ రిపోర్టును సవాలు చేశారని, ఇప్పుడు సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వ నోటిఫికేషన్ ఇచ్చిందని, ఈ పరిస్థితుల్లో పిటిషన్లు చర్యలు తీసుకోరాదని ఆందోళనతో వేసిన మధ్యంతర పిటిషన్లపై విచారణ అవసరం లేదని చెప్పారు.

అసెంబ్లీలో కమిషన్ రిపోర్టు పెట్టాక చర్యలు ఏమైనా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారా అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. అసెంబ్లీలో సమగ్రంగా చర్చ జరిగిందని, చర్యలు అంశంపై నిర్ణయం తీసుకోలేదని, కమిషన్ రిపోర్టును ఆధారంగా చేసుకుని చర్యలు తీసుకోదని ఎజి చెప్పారు. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని మాత్రమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సీబీఐ స్వతంత్రంగా దర్యాప్తు చేస్తుందని, ప్రభుత్వానికి సిబిఐ రిపోర్టు మాత్రమే ఇస్తుందని చెప్పారు. కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉండదని, ఎన్‌డిఎస్ఏ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా దర్యాప్తు ముందుకు వెళుతుందని తెలిపారు. మేడిగడ్డ బారేజి పిల్లర్లు కుంగుబాటుకు గుర్యాయని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభు త్వం సిబిఐ దర్యాప్తును కోరుతూ నోటిఫికేషన్ వెలువరించిందని తెలిపారు. జివో కాపీలను కోర్టుకు అందజేశారు. సీబీఐ దర్యాప్తునకు జారీ చేసిన ఆదేశాల్లో వ్యక్తిగతంగా ఎవరి పేర్లు లేవని, ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చడమే ప్రభుత్వం ముందున్న ఏకైక లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వొకేట్ నిరంజన్ రెడ్డి కూడా వాదించారు.

కెసిఆర్, హరీష్‌రావు తరపున సీనియర్ సుప్రీంకోర్టు అడ్వొకేట్లు దామా శేషాద్రినాయుడు, ఆర్యమ సుందరం వాదిస్తూ, ప్రభుత్వం ఇచ్చిన హామీని రికార్డు ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చెప్పిన దానికి భిన్నంగా చేస్తోందన్నారు. అసెంబ్లిలో కమిషన్ రిపోర్టు పెట్టి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో జరిగిన అవినీతి మూలాలన్నీ బయటపడ్డాయని, అవినీతిపరులపై చర్యలు తప్పవని నేరుగా సీఎం చెప్పారని, తీరా కమిషన్ రిపోర్టుపై ఏ చర్యలు తీసుకోకుండానే అసెంబ్లీ ముగిసిందని చెప్పారు. నిజంగానే కమిషన్ రిపోర్టులో అవినీతి ఎక్కడ ఉందో తేలిఉంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అడిగారు. అసెంబ్లీలో తీర్మానం కూడా చేయకుండానే సిబిఐ దర్యాప్తు చేయాలనే నిర్ణయాన్ని సీఎం ప్రకటించారని చెప్పారు. కమిషన్ రిపోర్టుపై చర్యలు తీసుకోకుండా, అసెంబ్లీ తీర్మానం చేయకుండా సిబిఐ దర్యాప్తునకు జివో ఇవ్వడం వెనుక అనేక అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. కమిషన్ రిపోర్టును పూర్తిగా పక్కకు పెట్టాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుని ఉంటే, ఆ రిపోర్టులోని అంశాలను సిబిఐ దర్యాప్తును కోరుతూ రాష్ట్రం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎందుకు పేర్కొన్నారని అడిగారు. ఒక దశలో వాదనలు తీవ్ర స్థాయికి చేరాయి.

ఇరుపక్షాల వాదనల తరువాత హైకోర్టు ధర్మాసనం.. 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన ఏర్పాటైన ఏక సభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. కమిషన్ నివేదిక ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేయరాదని కూడా ఆదేశించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథార్టీ రిపోర్టుల ఆధారంగానే సిబిఐ దర్యాప్తు ఉండాలంది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పిటిషనర్లు కెసిఆర్, హరీష్‌లపై చర్యలు తీసుకోరాదని రాష్ట్రానికి ఆదేశాలిచ్చింది. మెయిన్, మధ్యంతర పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటరు పిటిషన్లు దాఖలు చేయాలి. కౌంటర్లపై పిటిషనర్లు రిప్లై కౌంటర్లు వేయాలంది. విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.

## మార్గం సుగమం

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు జిఒలో పేర్కొన్నది. కాగా, రాష్ట్రంలో సిబిఐ విచారణకు ఎలాంటి అడ్డంకులు లేవని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా పారదర్శక విచారణ కోసం సిబిఐకి కేసు అప్పగించామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పలుశాఖల ప్రమేయం పై, అంతర్రాష్ట్ర అంశాల పైనా దర్యాప్తు చేయాలని సిబిఐని ప్రభుత్వం కోరింది. అంతేకాదు.. కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పైనా దర్యాప్తు చేయాలని కేంద్ర హోంశాఖకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా పంపిన లేఖలో పేర్కొంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పంట నష్టపరిహారానికి చర్యలు

కేంద్రం రూ.10వేల కోట్లు విడుదల చేయాలి : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్


ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో అతి భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు. కేంద్రం తక్షణ నష్ట పరిహారం కోసం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు శాస్త్రీయంగా గ్రామ స్థాయిలో సర్వే నిర్వహించి జరిగిన పంటల నష్టాన్ని లెక్కలు తీయాలని, పంటల నష్టం ఆస్తి, ప్రాణ, పశువుల నష్టాన్ని పరిశీలించటానికి కేంద్ర బృందాన్ని ప్రభుత్వం ఆహ్వానించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ, అతి భారీ వర్షాల వల్ల వరదల వల్ల పంటలు ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు రాష్ట్రంలో ఇతర జిల్లాల్లోని 82 మండలాలు 2.36 లక్షల ఎకరాల్లో ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసిందని, కాని దాదాపు 5 లక్షల పైలుకు ఎకరాలకు పంట నష్టం వాటిల్లిందని వారు వెల్లడించారు.

# ఉద్యమ నిర్మాణంలో సురవరం అగ్రగణ్యుడు

ప్రజా సమస్యల పట్ల ప్రజలతో మమేకమైన సుధాకర్‌రెడ్డి
నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాల తరలింపులో ఎనలేని కృషి
తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్: నిత్య అధ్యయన శీలి, ప్రజాపోరాట యోధ సురవరం సుధాకర్ రెడ్డి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టులంతా ఐక్యం కావాలని కోరుకుంటున్న తరుణంలో ఆ ప్రక్రియను ముందుండి నడిపించాల్సిన నాయకుడైన సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికంగా దూరం కావడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు దిగ్గజం, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం జరిగింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య, రిటైర్డ్ ఐజి కాంతయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త అప్పారావు, తెలంగాణ రచయిత సంఘం కార్యదర్శి శంకరం, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, శ్రామిక మహిళా ఫోరం అధ్యక్షురాలు పి.ప్రేం పావని పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా అధ్యక్షులు చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సురవరం సుధాకర్‌రెడ్డి అగ్రగణ్యుడన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజలతో మమేకమై అవిశ్రాంత ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి ఆడిటోరియం ప్రాంగణంలో సుధాకర్‌రెడ్డి పేరుతో స్మారక హాల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ ప్రభుత్వ ఫాసిస్టు ధోరణులను ముందే పసిగట్టిన మొట్ట మొదటి వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఫాసిస్టు విధానాలపై కమ్యూనిస్టు నాయకులను, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు వాటికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నిర్వహించారని తెలిపారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చివరి క్షణం వరకు ఉద్యమాలే తన ఊపిరిగా జీవించిన గొప్ప నాయకుడు సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. పార్లమెంట్ సభ్యులుగా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాల తరలింపు ద్వారా ఫ్లోరైడ్ సమస్య పరిష్కరించడానికి ఎనలేని కృషి చేశారన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి తనను విభేదించే వారిని కూడా సునాయాసంగా ఒప్పించే మనస్తత్వం గల గొప్ప నాయకుడన్నారు. బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి పట్ల పార్టీ, ప్రభుత్వం చూపిన ప్రేమ ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. తమ కోరిక మేరకు సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామంలో పాఠశాల చుట్టుపక్కల గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి, పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని నిధులు విడుదల చేయడం పట్ల విజయలక్ష్మి సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి తన తొలి రాజకీయ గురువు అని తెలిపారు. విద్యార్థి, యువజన నేతగా సురవరం ఇచ్చిన ఉపన్యాసాలు ఎంతో మందిని ఉద్యమం వైపు నడిపించాయన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ప్రజా సమస్యలను సభలో లేవనెత్తడం ద్వారా వాటి పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఎస్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ 1975 రాజకీయ శిక్షణ తరగతులలో సుధాకర్‌రెడ్డి ఇచ్చిన క్లాస్ తన జీవితంలో చెరగని ముద్ర వేసిందన్నారు. మృదువైన స్వభావం ఉన్న కమ్యూనిస్టు యోధుడు.. ఆత్మీయత ప్రతిరూపం ఓ అమృత హృదయుడు.. నిండు జీవితం గడిపిన ఎర్రని నాయకుడా... ఎర్రెర్రని వందనాలు అందుకో లాల్ సలామ్... అంటూ స్మృతి గీతంతో నివాళులు అర్పించారు. శంకరం మాట్లాడుతూ ఈ కల్లోల సమాజంలో మన కలలను చరితార్థం చేసిన మేఘం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. యూసుఫ్ మాట్లాడుతూ ప్రతి సమస్యపై సంబంధిత కార్మికులతో ముందు పోరాటాలు నిర్వహించిన తర్వాతే చర్చల ద్వారా వాటి పరిష్కారం చాలని, గొప్ప సూత్రాన్ని సూచించారని తెలిపారు. ప్రేమ్ పావని మాట్లాడుతూ మహిళా సాధికార చట్టం కోసం ఆయన అనునిత్యం ఆరాటించేవారని గుర్తు చేశారు. కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ హెచ్‌ఎంటివి ఏర్పాటు సమయంలో అనుమతులకు సంబంధించి సురవరం సుధాకర్‌రెడ్డి అందించిన సహకారం మరవలేనిదన్నారు. ఆయన పేరుతో ప్రతి ఏటా స్మారకోపన్యాసం, అవార్డు అందజేయడం సముచితంగా ఉంటుందన్నారు. మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఏ పని నైనా ప్రజాస్వామికంగానే కాకుండా మనస్ఫూర్తిగా చేసే గొప్ప నాయకుడని కొనియాడారు. ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థి, యువజన సంఘంలో పాటు పార్టీలో కలిసి ఉద్యమాలను చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం భారత దేశ విప్లవోద్యమానికి తీరని లోటని అన్నారు.



# 'ఇందిరమ్మ ఇళ్ల'కు 'సిమెంట్, స్టీలు' పరిశ్రమలు భాగస్వాములు కావాలి



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకం విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని సిమెంటు, స్టీలు పరిశ్రమలు మానవీయకోణంలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఏ మాత్రం నాణ్యతలో రాజీపడకుండా ఇందిరమ్మ ఇళ్లకు సిమెంటు, స్టీలు అందించాలన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంటు, స్టీలు పరిశ్రమల యజమానులు, అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వ పథకాలకు సిమెంటు కంపెనీలు అందిస్తున్న ధరను సమావేశంలో మంత్రులు సమీక్షించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్ద, చిన్న అనే అంతరం లేకుండా కంపెనీలన్నీ ఒకే ధరకు సిమెంటు, స్టీలు సరఫరా చేయాలని సూచించారు. రాష్ట్రంలో పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పరిశ్రమలు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నాయని, భవిష్యత్తులో సిమెంటు, స్టీలు ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఏర్పడుతుందని, రాష్ట్రంలో సిమెంటు, స్టీలు పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకు, నాణ్యతతో కూడిన సిమెంటు, స్టీలను సరఫరా చేయాలని కోరారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంటు, 27.75 లక్షల మెట్రిక్ టన్నుల స్టీలు అవసరమని వివరించారు. మంత్రుల సూచనపై సిమెంట్ స్టీలు కంపెనీ యజమానులు, ప్రతినిధులు స్పందిస్తూ ప్రభుత్వం మానవీయ కోణంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రోత్సహం అందించే అవకాశం కలగడం అదృష్టమన్నారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వీలైనంత త్వరగా స్టీలు, సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతినిధులు సమావేశమై ధరలు ఖరారు చేస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు.

# ఎఐఎస్‌ఎఫ్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం


సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీ ఉద్యమం
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఒకానొక దశలో విద్యార్థులు కలెక్టరేట్ గేట్లను తోసుకుని లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరు పక్షాల నడుమ తోపులాట చోటు చేసుకోగా విద్యార్థులు గేట్లు ఎక్కి నినాదాలు చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ జెండాలను ప్రదర్శించారు. ముందుగా ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్న వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ గేట్ గేటుముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాలుగు మాసాలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యారంగాన్ని విస్మరిస్తూ సవతి తల్లి ప్రేమను చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వివిధ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కళాశాలలు బకాయిల పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామంటూ అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి అవసరమైన భావిభారత పౌరుల చదువుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సరైన సంఖ్యలో లేకపోవడంతో ప్రభుత్వ చదువులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలోని మెస్ బిల్లు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందుకు రాకుంటే దశలవారీ పోరాటాలు చేసేందుకు వెనుకాడేదే లేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, జిల్లా అధ్యక్షులు ఎస్‌కే సాదిక్, జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, ఇనపెల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ వంశీ, సంజయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్‌కమల్, మహేష్, నవీన్, వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్‌కు వ్యూహ ల్యాబ్ చెక్

డిజిపి డాక్టర్ జితేందర్
దేశంలోనే మొట్టమొదటిసారిగా ఐఐఐటిలో ప్రారంభమైన ల్యాబ్




ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరాలకు వ్యూహ ల్యాబ్ ద్వారా చెక్ పెట్టనున్నామని ఇలాంటి ల్యాబ్ దేశానికే ఆదర్శంగా నిలవబోతుందని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'లో కొత్తగా ఏర్పాటు చేసిన 'వ్యూహ ల్యాబ్ సైబర్ ఇన్నోవేషన్ హబ్' మంగళవారం ఆయన ప్రారంభించారు. వ్యూహ ల్యాబ్ కోసం హైదరాబాద్ ఐఐఐటి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎంఒయుపై హైదరాబాద్ ఐఐఐటి, టిజిసిఎస్‌బి అధికారులు సంతకాలు పెట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిజిపి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న ప్రమాణాలలో ఒకటి అన్ని వాటిని ఎదుర్కొవడానికి సృజనాత్మకత, సహకారం, ముందుచూపు అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యూహ ల్యాబ్స్ రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశానికి కూడా ఒక మోడల్‌గా నిలుస్తాయని ఆయన అన్నారు. 2000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడిన ఈ హబ్, ఫైటర్ రంగానికి సంబంధించిన ప్రత్యేక పరికరాలు, మౌలిక సదుపాయాలతో అమర్చబడి, పోలిసింగ్ వ్యవస్థలో దేశంలోనే వినూత్న కేంద్రంగా నిలుస్తోందన్నారు. కొత్త కొత్త టెక్నాలజీ పద్ధతుల్లో వస్తున్న సైబర్ నేరాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం, వాటికి పరిష్కారా మార్గాలు అన్వేషించడం, నేరాలను అరికట్టడమే ఈ హబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా పరిశోధన, దర్యాప్తు అధికారులకు శిక్షణ, ఇన్నోవేషన్, సామర్థ్య నిర్మాణం వంటి విభాగాల్లో సంయుక్త కార్యక్రమాలు చేపట్టబడతాయన్నారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నిరోధకతను ఇన్నోవేషన్ ఆధారిత పరిష్కారాలు అవసరమని, తెలంగాణ సైబర్ క్రైమ్ వాటిని అమలు పరచడం లో ముందంజలో ఉందని, ఈ హబ్ సుస్థిరమైన విస్తరించదగిన డిజిటల్ భద్రతా పరికరాలను అభివృద్ధి చేయడం ద్వారా ఎకోసిస్టమ్‌ను అందిస్తుందని అన్నారు. ఐఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా మాట్లాడుతూ.. మాట్లాడుతూ సైబర్ సెమ్యూనిటీ అనేది కేవలం సాంకేతిక సమస్య కాకుండా సామాజిక సమస్య కూడా అని పేర్కొన్నారు. పరిశోధన ప్రతిభ, జ్ఞాన నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర కీలకం అని, వ్యూహ ల్యాబ్స్ సంస్థలను రక్షించడంలో ప్రభావవంతమైన పరిష్కారాలను వేగవంతం చేస్తుందని విశ్వాసం పక్షం చేశారు. ఈ కార్యక్రమంలో ఐల్యాబ్ క్యాపిటల్ ఛైర్మన్ శ్రీనిరాజు, టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్, ఐఐఐటి ప్రొఫెసర్ పి.జె.నారాయణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లిలో కత్తెర పోట్ల కలకలం





మహిళ మృతి, నలుగురికి గాయాలు

ప్రజాపక్షం/ధర్పల్లి : మండల కేంద్రంలో కత్తెర పోట్లు కలకలం రేపాయి. మంగళవారం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వడ్ల (కోటగిరి) గంగాదాసు అనే వ్యక్తి కాలనీలో మంగళవారం ఉదయం నలుగురిని దర్జీ కత్తెరతో పొడిచినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. మొదటగా కాలనీలో మచ్చ లక్ష్మీ ని కత్తెరతో పొడవగా ఆమె కూతురు గౌతమి అడ్డు రావటంతో ఎడమ చేతికి గాయమైంది. అక్కడ గొడవ జరుగుతుందని గమనించి పక్కింటివారు వెళ్లగా వారిలో శెట్‌పల్లి నాగరాజు, అతని భార్య శోభను కూడా కత్తెరతో పొడిచాడు. అక్కడి నుండి కాలనీలో కిరాణ షాపు నిర్వహిస్తున్న శెట్‌పల్లి భోజేశ్వర్ షాపు దగ్గరికి వెళ్లి అతన్ని కూడా కత్తెరతో పొడిచాడని, గాయపడ్డ నలుగురిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మచ్చ లక్ష్మీ ని తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. గంగాదాసును అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం క్రితమే భార్యతో విడాకులు తీసుకోగా అదే గ్రామంలో భార్య నివాసముంటుంది. భార్యకు సపోర్ట్ చేస్తున్నారనే కోపంతో చేసినట్లు తెలుస్తుంది.

# 5న విఆర్‌ఒలకు నియామక పత్రాల అందజేత : సిఎస్ రామకృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: నూతనంగా నియమితులైన 5000 మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లకు ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లోని మాదాపూర్, హైటెక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితర మంత్రులు హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు ఉన్నతాధికారులతో రామకృష్ణారావు మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి ఎంపికైన విఆర్‌ఒలు మధ్యాహ్నం రెండు గంటల లోపు హైటెక్స్‌కు చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి దాదాపు 120కి పైగా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి ఎండిని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో రోడ్డు భవనాలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కవిత సస్పెన్షన్.. కెసిఆర్ కొత్త నాటకం

గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్‌లో ఎంఎల్‌సి కవితను సస్పెండ్ చేయడం ద్వారా బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కుటుంబం కొత్త నాటకానికి తెర తీశారని టిపిసిసి అధ్యక్షులు ,ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కెసిఆర్ కుటుంబం దొంగల ముఠా అని, వాటాల పంపకాల తేడాతోనే కెసిఆర్ కుటుంబంలో అంతర్గత కుమ్ములాట జరుగుతుందన్నారు. కవిత రూపంలో కెసిఆర్‌ను రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కెసిఆర్ ఆజ్ఞ లేనిదే కుటుంబంలో చీమ కూడా కదలని పరిస్థితి అని, కవిత చెప్పిన మాటలు నిజమైతే ఆ రోజు హరీశ్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎంఎల్‌సి కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని, ఆమె అవసరం తమ పార్టీకి ఏమాత్రం లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కవితను బిఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడం పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, దానితో తమకు సంబంధం లేదన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు రావడం వల్లే ఇప్పుడు కవిత ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి బాగోతాన్ని కవిత పూర్తిగా బహిర్గతం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సిబిఐ విచారణను సాగదీస్తే బిజెపి, బిఆర్‌ఎస్ కుమ్మక్కు నిరూపితమౌతుంది.**

కాళేశ్వరంలో అవినీతి జరిగిందని నిర్ధారించిన జస్టిస్ ఘోష్ కమిటీ కెసిఆర్, హరీశ్ రావుతో సహా పలువురిని తప్పుపట్టిందని, ఇప్పుడు సిబిఐ విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని మహేష్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఒక వేళ సిబిఐ విచారణను వేగవంతంగా చేయకుండా సాగదీస్తే ఇప్పటికే పలుమార్లు అవగాహన కుదుర్చుకున్న బిజెపి, బిఆర్‌ఎస్ మరోసారి కూడబలుకున్నాయని నిరూపితమవుతుందని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుంటే బిఆర్‌ఎస్, బిజెపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కాళేశ్వరంలో కర్త, కర్మ, క్రియ అన్ని తానే అని చెప్పుకున్న కెసిఆర్ అవినీతికి కూడా బాధ్యత వహించాల్సిందేనన్నారు. కవిత మాటలతో కాళేశ్వరంలో అవినీతి జరిగిందని తేలిపోయిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావుతో పాటు కేటీఆర్, కవిత, అప్పటి కొంతమంది ఎంఎల్‌ఎల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిలో మామ కెసిఆర్ వాటా ఎంత? అల్లుడు హరీశ్‌రావు వాటా ఎంత? ఇతరుల వాటా ఎంత? అనేది సిబిఐ విచారణలో తేలుతుందన్నారు. బిఆర్‌ఎస్ మొదటి దఫా ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా హరీశ్ రావు తప్పు చేస్తే కెసిఆర్ బాధ్యతాయుతంగా హరీశ్‌రావుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, అప్పుడే కవిత ఎందుకు మాట్లాడలేదన్నారు.

# నేడు 'ఎఐ టూల్స్ అండ్ టెక్నిక్స్'పై జర్నలిస్టులకు శిక్షణ

మీడియా అకాడమీ కార్యాలయంలో 10 గంటలకు ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నాంపల్లి కార్యాలయంలోని ఆడిటోరియంలో జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) టూల్స్ అండ్ టెక్నిక్స్‌పై నేడు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. వర్క్‌షాప్‌లో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా జర్నలిజం రంగానికి సంబంధించిన ఆధునిక టూల్స్, టెక్నిక్స్, వృత్తిపరమైన నైపుణ్యాలపై నిపుణులు సవివరంగా శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్ మొదటగా హైదరాబాదుకు చెందిన జర్నలిస్టులకు నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న జర్నలిస్టులు మాత్రమే హాజరు కావాలని వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు.

# ఆ ఐదు బిల్లులు గవర్నర్ ఆమోదించేనా?

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల శాసనసభ, శాసన మండలిలో ఏకగ్రావంగా ఆమోదించిన ఐదు బిల్లులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వద్దకు చేరుకున్నాయి. అంత్యత కీలకమైన ఈ బిల్లులు గవర్నర్ ఆమోదించే ఆవకాశాలు కనిపించడం లేదని సమాచారం. ఈ బిల్లులపై న్యాయనిపుణుల సలహాలు తీసుకునేందునే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు ఈ ఐదు బిల్లులను న్యాయనిపుణులకు పంపేందుకు గవర్నర్ సిఫారస్ కూడా చేసినట్లు తెలిసింది. ఈ ఐదు బిల్లులలో అత్యంత కీలకమైనది పంచాయతీరాజ్ సవరణ బిల్లు ఈ బిల్లు కూడా గవర్నర్ ఆమోదించకుంటే పంచాయతీ ఎన్నికలపై ప్రభావ పడే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ శాసనసభ సమావేశాలు వాడీవేడిగా రెండు రోజులు కొనసాగిన విషయం తెలిసిందే. ప్రధానంగా కాళేశ్వరం నివేదికపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ క్రమంలోనే శాసనమండలితో పాటు శాసనసభలో ప్రభుత్వం మొత్తం ఐదు బిల్లులను ప్రవేశపెట్టింది. బీసీలకు స్థానిక సంస్థల్లో ఉన్న 50 శాతం నిబంధన ఎత్తివేస్తూ.. రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందింది. పురపాలక చట్ట సవరణ బిల్లుకు కూడా సభ ఏకగ్రీవంగా ఓటేశారు. ఇక అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్స్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ చేస్తూ మంత్రి సీతక్క ప్రవేశపెట్టి బిల్లులు ఉభయ సభలో ఆమోదం పొందాయి. మొత్తం ఆ ఐదు బిల్లులు రాజ్‌భవన్‌కు చేరాయి. అయితే, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వాటిని ఆమోదించే ముందు న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించినట్లుగా సమాచారం. గవర్నర్ ఐదు బిల్లులకు ఆమోదం తెలుపుతారా.. లేక తిరిగి వెనక్కి పంపుతారా అని ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి సర్కిల్-28**

**NIT No. 32/EE-28/SBZ/GHMC/2025-2026**

**పని పేరు:** నిర్వహణ పనులు ఇతర పనులు-04, **అంచనా విలువ:** రూ.113.50లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 03.09.2025న మ.12.30గం.ల నుండి 10.09.2025న మ.12.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం-28, జిహెచ్‌ఎంసి.**

DIPR R.O. No. : 7527-PP/CL/ADVT/1/2025-26, Date: 02-09-2025

తెలంగాణ ప్రభుత్వం
**ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం**

నం.18/EE PH/SRD/2025-26 తేదీ: 02.09.2025

హైదరాబాద్, సంగారెడ్డి డివిజన్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) కార్యాలయం నుండి రూ.0.6 కోట్ల వ్యయంతో సదాశివపేట మున్సిపాలిటీలో TUIFDC లోన్ అసిస్టెన్స్ కింద అభివృద్ధి పనుల కోసం NIT. నం. 05 /EEPH/SRD/SSPT/ TUFIDC/ సిద్ధాపూర్ జంక్షన్ /DB/T1/2025-26 (4వ పిలుపు) మరియు నం. 05/EE PH/SRD/SSPT/ TUFIDC/ వార్డ్ నం.19లోని కమ్యూనిటీ హాల్ బ్యాలెన్స్ పని /DB/T1/2025-26 (4వ పిలుపు) డెవలప్‌మెంట్ పనుల కోసం టెండర్ నోటీసు ఆహ్వానించడమైనది. టెండర్లు షెడ్యూళ్ళు: 04.09.2025 @ 11.00 AM నుండి 11.09.2025 @ 5.00 PM వరకు. వివరాల కోసం https://tender.telangana.gov.in ని సందర్శించండి

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH), ప్రజారోగ్యం, డివిజన్ సంగారెడ్డి**

DIPR R.O. No. : 7503-PP/CL/ADVT/1/2025-26, Date: 02-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు

## తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనంతో రాష్ట్రలో మరో రెండు రోజుల పాటు పలు జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం అదే ప్రాంతంలో ఒక అల్పపీడన ద్రోణి ఏర్పడి ప్రస్తుతం అదే ప్రాంతంలో కొనసాగుతోందన్నారు. బుధవారం ఉదయం నాటికి ఈ అల్పపీడనం మరింత బలపడి ఆతర్వాత 24 గంటలలో ఒరిస్సా తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. బుధువారం, గురువారం ఈ రెండు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు మరియు గంటకు 30 నుంచి 40 కి మీ వేగంతో ఈదురుగాలులు తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## నిర్మాణాలు కొనసాగించొచ్చు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఇజ్జత్‌నగర్‌లో నమిత్ హోమ్స్ నిర్మాణం చేసే 25 అంతస్తుల 360 లైఫ్ కట్టడాలకు హైకోర్టులో అడ్డంకి తొలగిపోయింది. బహుళ అంతస్తుల నిర్మాణాన్ని కొనసాగించేందుకు అనుమతిచ్చింది. జీహెచ్ఎంసీ అభ్యంతరాలను సరిచేయాలంది. నమిత హోమ్స్‌కు అనుమతులను తిరిగి ఇస్తూ గత జూన్ 11న జీహెచ్ఎంసీ నోటిఫికేషన్‌ను నిర్మాణ సంస్థ పార్టనర్ విజయ్‌కుమార్ హైకోర్టులో సవాల్ చేశారు. గత విచారణలో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి నిర్మాణాలను ఆపేయాలని ఆదేశించారు. ఆ మధ్యంతర ఉత్తర్వులను సవరిస్తూ జీహెచ్ఎంసీ అనుమతుల మేరకు నిర్మాణం చేపట్టాలని తాజాగా ఆదేశించి విచారణను వాయిదా వేశారు.

## విమాన ఇంధనంలో కల్తీపై ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విమాన ఇంధనాన్ని కల్తీ చేయడంపై హైకోర్టు మండిపడింది. గాలిలో ప్రయాణించే విమానంలోని కల్తీ ఇంధనం ఉంటే ప్రమాదం జరిగితే ప్రయాణీకుల ప్రాణాలు ఏం కావాలని ప్రశ్నించింది. కాంట్రాక్టు రద్దును సవాల్ చేయడాన్ని తప్పుపట్టింది. పిటిషనర్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్‌ను రద్దు అన్యాయమంటూ గుర్నాధం వేసిన పిటిషన్‌ను జస్టిస్ నగేశ్ భీమపాక కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. రూ.10 లక్షల జరిమానా విధించారు.

## ట్రాన్స్‌జెండర్ల రిజర్వేషన్లపై విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యా, ఉపాధి రంగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లను కల్పించాలనే పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. విద్యా, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్‌లు, ఆసరా పింఛన్లు కల్పించాలనే పిటిషన్‌ను హైదరాబాద్‌కు చెందిన వై.జయంతి వసంత మొగిలి 2023లో పిటిషన్ వేశారు. హైకోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయలేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయగా చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ విచారించింది. గత ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని సీఎస్‌తోపాటు సాంఘిక సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శులను ఆదేశించింద్ది, విచారణను వాయిదా వేసింది.

## పిపి భర్తీ చర్యలు చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం చేస్తామన్న ప్రభుత్వ హామీకి అనుగుణంగా నోటిఫికేషన్‌ను అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. ఏపీపీ పోస్టులను భర్తీ చేయకపోవడంపై బి.శ్రీనివాసులు పిటిషన్ వేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది.118 ఏపీపీ పోస్టుల నియామకానికి ఆర్థిక శాఖ ఆమోదం ఇచ్చిందని, నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. దీనిపై హైకోర్టు వెలువడబోయే నోటిఫకేషన్‌ను సమర్పించాలని ఆదేశించింది. విచారణను వారానికి వాయిదా వేసింది.

## సిఎం రేవంత్‌రెడ్డికి ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనుమతిలేకుండా ర్యాలీలో పాల్గొన్నారని ఎంపీగా ఉండగా రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసు విచారణ లో వ్యక్తిగత హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కేంద్ర వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలంటూ 2021లో కాంగ్రెస్ పార్టీ సచివాలయం నుంచి రాజ్‌భవన్‌వరకు ర్యాలీ నిర్వహించింది. దీనిపై నమోదైన కేసు నాంపల్లి కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ఆదేశాలను జారీ చేశారు. విచారణను అక్టోబరు 7కు వాయిదా వేశారు.

## కేటీఆర్‌కు ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమృత టెండర్ కేటాయింపులపై చేసిన విమర్శల నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల రామారావుకు హైకోర్టులో పిటిషన్ వేశారు. దనిని జస్టిస్ లక్ష్మణ్ మంగళవారం విచారించారు. కింది కోర్టులో వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శోధ కన్‌స్ట్రక్షన్‌పై ఆరోపణలు చేయడంపై యజమాని సూదిని సృజన్ ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ పిటిషన్ వేశారు. ఇందులో ప్రతివాదులైన ప్రభుత్వానికి, ఫిర్యాదుదారుకు నోటీసులను జారీ చేసిన న్యాయమూర్తి విచారణను అక్టోబరు 7కు వాయిదా వేశారు.

ఎస్.కె.జోషి పిటిషన్

## నేడు హైకోర్టు విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను సవాలు చేస్తూ నీటి పారుదల శాఖ గత ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి పిటిషన్ దాఖలు చేశారు. తనపై చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి. కమిషన్ నివేదికను రద్దు చేయాలి. సాక్షిగా పిలిచి స్టేట్‌మెంట్ తీసుకున్న కమిషన్ కావాలని కేసులో ఇరికించింది. ఆరోపణలు చేసే ముందు విచారణ కమిషన్ చట్టం ప్రకారం 8(బి), 8(సి) కింద నోటీసులు ఇవ్వలేదు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం... అని దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రతివాదులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషన్‌లను చేర్చారు. దీనిపై బుధవారం హైకర్టు విచారణ చేయనుంది.

## ఎస్‌బిఐపై ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రుణానికి సంబంధించి రైతులు మాధవర్‌రెడ్డి, ఎన్.బాల్‌రెడ్డిలకు అనుకూలంగా డెట్ రికవరీ ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను 7 ఏళ్లకు అప్పీల్ దాఖలు చేసిన ఎస్‌బీఐపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఎందుకు ఆలస్యంగా పిటిషన్ వేయాల్సివచ్చిందో బుధవారం చెప్పాలని ఎస్‌బిఐని జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన డివిజ న్ బెంచ్ ఆదేశించింది.

## 104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి: రామ రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:**104 ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి అనుబంధ సంస్థ జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న 104 ఉద్యోగులకు ఐదు నెలలు గడుస్తున్న జీతాలు లేవని ఆయన అన్నారు. 104 ఉద్యోగులు అష్టకష్టాలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కాంట్రాక్టు విధానం లో నియామకమైన అన్ని క్యాడర్స్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రానున్న 20 రోజుల్లో 104 ఉద్యోగులు అన్ని క్యాడర్స్ ఉద్యోగులతో కలిసి హైదరాబాద్ ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి

# తీసుకువెళ్ళేందుకు కృషి

ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు




**ప్రజాపక్షం/కొత్తూరు:** క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతివనంలో గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ 79వ యోనెక్స్‌సన్‌రైజ్ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు క్రీడా రంగాన్ని ఎంతో ప్రోత్సహిస్తున్నామని వివరించారు. బ్యాడ్మింటన్ గోపిచంద్ కన్హాశాంతివనంలో అకాడమీ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్న ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, అండమాన్ నికోబర్ దీవుల నుండి సుమారు 250మంది అగ్రశేణి క్రీడాకారులు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాలకు హైద్రాబాద్ వేధిక అవుతుందని, మున్ముందు మరింత క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి వచ్చే క్రీడాకారులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చేందుకు అకాడమీలు కృషి చేయాలని సూచించారు. విద్య, వైద్య రంగాలతోపాటు క్రీడాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఏ ప్రభుత్వంలో ఇవ్వని ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని పేర్కొన్నారు. కన్హాశాంతివనంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాడ్మింటన్ పుల్లెల గోపిచంద్ మాట్లాడుతూ ఈ అకాడమీ ద్వారా అగ్రశేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న వ్యక్తిత్వాన్ని మెరుగు పరచడంతోపాటు చైతన్యం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 79వ ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిఫ్‌లో ప్రతి క్రీడారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారుల్లో ఆత్మ విశ్వాసం ఉండాలని, అప్పుడే విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని, క్రీడలతోనే స్నేహ సంబంధం పెరుగుతుందని వివరించారు. సెప్టెంబర్3న జట్టు బహుతుల పంపిణీ ఉంటుందని, 5వ తేదిన ఫైనల్ బహుమతుల ప్రధానం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్హాశాంతివనం వ్యవస్థాపకులు దాజి, తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడా ప్రతినిధి సంస్థ నిర్వాహకురాలు సోని బాలాదేవి పాల్గొన్నారు.

ఎపి మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కేసులో

## రూ.1.1 కోట్ల ఆస్తులు జప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఆఫీస్ బేరర్ల అక్రమాలకు సంబంధించి కొనసాగుతున్న దర్యాప్తుకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) రూ. 1.1 కోట్ల విలువైన రెండు స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మంగళవారం జప్తు చేసింది. అటాచ్ చేయబడిన ఆస్తులు రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల గ్రామంలో ఉన్నాయి. ఈ ఆస్తులు ఎపి మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ యొక్క అప్పటి ఎండి, సిఇఒ అయిన రోహిత్ అసవా పేరు మీద ఉన్నాయి.ఎపి మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ రమేష్ కుమార్ బంగ్‌పై అప్పట్లో బంజారా హిల్స్‌లో నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఇడి దర్యాప్తు ప్రారంభించింది. అప్పటి ఎండి, సిఇఒ ఉమేష్ చంద్ అసవా, అప్పటి సీనియర్ వైస్ చైర్మన్ పురోషతందాస్ మంధాన, మరికొందరు అధికారిక పదవులను దుర్వినియోగం చేసి, వివిధ అనర్హులైన రుణగ్రహీతలకు వారి అక్రమ పూచీకత్తులు, ఉనికిలో లేని ఆస్తులపై రుణాలు పంపిణీ చేసిందని ఇడి గుర్తించింది. రుణాలు మంజూరు చేసినందుకు గాను రుణగ్రహీతల నుండి పెద్ద మొత్తంలో వీళ్ల కమీషన్లు తీసుకున్నారని దర్యాప్తులో తేలింది.



## ‘సిఎం ప్రజావాణి’కి బ్యాటరీ వెహికల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ముఖ్యమంత్రి ప్రజావాణి’కి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ‘బ్యాటరీ వాహనాన్ని’ మంజూరు చేసింది.ఈ వాహనాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై ధరఖాస్తులు అందజేసేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు ప్రధాన రహదారి మేన్ గేటు నుంచి పిటిషన్లు అందజేసే భవనం వరకు ‘బ్యాటరీ వాహనాన్ని’ ఉచితంగా ఉపయోగించనున్నారు.

## నటి రన్యారావుకు రూ.102 కోట్ల జరిమానా

**బెంగళూరు:** బంగారం అక్రమ రవాణా కేసులో నిందితురాలైన కన్నడ నటి రన్యారావుకు ది డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమెకు రూ.102.55 కోట్ల జరిమానా విధించింది. రన్యా సహా నలుగురు నిందితులకు మొత్తంగా రూ.270 కోట్ల పెనాల్టీ విధించింది. డీఆర్ఐ అధికారులు జైల్లోనే నోటీసులు అందజేశారు. ఒకవేళ ఆ మొత్తాన్ని చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు, ఇదే కేసు విషయంలో విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు విచారించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 11కి వాయిదా వేసింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలి వారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆమె నుంచి 14.3 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష పడింది.

## సీనియర్ సిటిజెన్లకు విమాన చార్జీల్లో రాయితీ

**న్యూఢిల్లీ:** విమానయాన సంస్థ ఎయిరిండియా సీనియర్ సిటిజెన్లకు ప్రయాణ చార్జీల్లో రాయితీలు ప్రకటించింది. 60ఏళ్లు, అంతకు పైబడిన వారు చేసే దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు తమ కొత్త స్కీమ్ కింద అంతర్జాతీయ ప్రయాణాలకు టికెట్ బేస్ ధరపై 10 శాతం తగ్గింపు ఇస్తామని వెల్లడించింది. ఎకానమీ నుంచి ఫస్ట్‌క్లాస్ వరకు అన్ని క్యాబిన్లకు ఇది వర్తిస్తుంది. ఒకసారికి ప్రయాణ తేదీని మార్చుకోవడానికి వీలుంది. అయితే అప్పుడు చార్జీల్లో వ్యత్యాసం ఉంటే చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు 10కేజీలు అదనంగా లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. లేకపోతే ఎకానమీ, ప్రీమియం ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించేవారు 23 కేజీల బరువున్న రెండు లగేజీలను తీసుకెళ్లొచ్చు. అదే సమయంలో బిజినెస్ క్లాస్‌లో వెళ్లేవారు 32 కేజీల బరువున్న రెండు లగేజీలను వెంట తీసుకెళ్లొచ్చు. ఇక దేశీయ విమాన ప్రయాణాల్లో విమాన టికెట్ బేస్ ధరలో 25 శాతం తగ్గింపు లభించనుంది. సీనియర్ సిటిజెన్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే...ఈ రాయితీని పొందొచ్చు.

తెలుగు వర్సిటీ పురస్కారాలతో

# సాహితీకారులకు కొత్త ఉత్సాహం

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలుగు జాతి కీర్తిని ఇనుమడింపజేసిన సాహిత్యకారులను గుర్తిస్తూ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ ప్రతి ఏటా తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ‘తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాలు – 2023’ ప్రధానోత్సవం మంగళవారం వర్సిటీలోని నందమూరి తారకరామారావు కళామందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన 24 మంది రచయితలు, కవులకు తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలతో పాటు నగదు బహుమతులను అందజేసి, ఘనంగా సత్కరించారు. వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. దశాబ్దలకాలంగా ఎంతో మంది మహనీయులు తెలుగు జాతి అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. సాహిత్యకారులకు ఈ పురస్కారాలు ఎంతో బలాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. వెల్దండ నిత్యానందరావు మాట్లాడుతూ ప్రతిభావంతులు, మేధావులకు పురస్కారాలు ఇవ్వడమే కాకుండా సాహితీ సాంస్కృతిక రంగాల్లో అభిరుచి, ఆసక్తి ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తున్నదన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ వివిధ యూనివర్సిటీలలో, విదేశాల్లో తెలుగు భాషా బోధనకు వర్సిటీ విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో విస్తరణ సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 9 నుండి కేంద్ర వార్షిక బడ్జెట్ తయారీ కసరత్తు ప్రారంభం

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వం చేపట్టే వార్షిక బడ్జెట్ తయారు చేసేందుకు అక్టోబరు తొమ్మిదో తేదీ నుండి సన్నాహాలు ప్రారంభమవుతాయి. దేశీయ వినియోగ డిమాండ్‌ను గణనీయంగా పెంచడం, ఉద్యోగాలసృష్టి, దేశ ఆర్థిక వ్యవస్థను ఎనిమిదీ శాతంపైగా స్థూలజాతీయోత్పత్తి వృద్ధి దిశగా నడిపించి స్థిరత్వం సాధించడం వంటి అనేక సమస్యలను పరిష్కరించడానికి సన్నాహాలు ప్రారంభిస్తారు. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థికవ్యవస్థ 6.3–6.8 శాతం మధ్యస్థాయిలో వృద్ధి చెందుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం అంచనావేస్తోంది. ఆర్థిక శాఖలో వ్యయాల విభాగం కార్యదర్శి అధ్యక్షతన ఈ బడ్జెట్ ముందరి సమావేశాలు అక్టోబరు 9 నుండీ ప్రారంభమవుతాయని ఆర్థిక వ్యవహారాల విభాగం 2026–27 కొత్త బడ్జెట్ సర్క్యులర్‌లో మంగళవారం తెలియజేసింది.

2026–27 సంత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన పార్లమెంటుకు సమర్పించే అవకాశాలు ఉంటాయి. ‘‘ఆర్థిక సలహాదారులు అవసరమైన అన్ని వివరాలను సమకూర్చాలని, సమావేశానికి పూర్తి భరోసా ఇవ్వాలని వచ్చేనెల మూడోతేదీ కంటే ముందుగానే ఇవన్నీ అందుబాటులో ఉండాలని సర్క్యులర్ పేర్కొంది. బడ్జెట్ ముందస్తు సమావేశాలన్నీ పూర్తయిన తర్వాత నమూనా, ముసాయిదాను ఖరారు చేస్తామని సర్క్యుర్ తెలియజేసింది. ఐతే సవరించిన అంచనాల సమావేశాలు మాత్రం ఈ ఏడాది నవంబరు రెండోవారం పూర్తయ్యేవరకూ కొనసాగుతాయి. అందరూ మంత్రులూ తమ తమ విభాగాలకు సంబంధించిన అమలు ఏజన్సీల ద్వారా వివరాలు సమర్పించాలి.

ప్రస్తుతం నామమాత్రపు అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటును 10.1 శాతంగా చూపిస్తున్నారు. స్థూల జాతీయోత్పత్తిలో ద్రవ్యలోటును 4.4 శాతంగా చూపిస్తున్నారు. వలసపాలకులనాటి విధానానికి విరుద్ధంగా ఫిబ్రవరినెలాఖరున కాకుండా ఫిబ్రవరి మొదటివారంలోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ సంప్రదాయానికి విరుద్ధంగా 2017లో ఫిబ్రవరి ఒకటో తేదీన ఆనాటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వార్షిక బడ్జెట్‌ను మొదటిసారి పార్లమెంటుకు సమర్పించారు.

అంగన్‌వాడీలను ప్రైమరీ స్కూల్స్‌తో అనుసంధానానికి

## ‘నేడు’ కేంద్రం ‘మార్గదర్శకాలు’ విడుదల

**న్యూఢిల్లీ :** సమీకృత నమూనాల ద్వారా ముఖ్యంగా అంగన్‌వాడీలు, పాఠశాలలను ఒకే పైకప్పు కిందకు తీసుకురావడం ద్వారా బాల్యదశ సంరక్షణ & విద్య (ఇసిసిఇ) పాత్రను హైలెట్ చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను బుధవారం విడుదల చేయనుంది. మంగళవారం ఈ విషయాన్ని ఓ అధికారిక ప్రకటన వెల్లడించింది. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పాఠశాల విద్య & అక్షరాస్యత డిపార్ట్‌మెంట్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలలతో అనుసంధానించడంపై మార్గదర్శకాలను బుధవారం నాడు విడుదల చేయనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రెండు మంత్రిత్వశాఖలకు చెందిన సీనియర్ అధికారులు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, అంగన్‌వాడీ వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మానవ మూలధన వికసిత్ భారత్‌కు పునాదిని సృష్టించాలనే మంత్రి దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఈ చొరవ ఒక ప్రధాన అడుగుగా భావిస్తున్నారు. బాల్యదశ సంరక్షణ & విద్య పాత్రను హైలెట్ చేసేందుకు, ప్రత్యేకించి అంగన్ వాడీలు, పాఠశాలలను ఒకే పై కప్పు కిందకు తీసుకురావాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మార్గదర్శకాలను రూపొందించింది. ఒక అధికారిక సమాచారం ప్రకారం...దేశ వ్యాప్తంగా 2.9లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికే పాఠశాలలతో కలిసి ఉన్నాయి.

## నకిలీ ఎసిబి అధికారులతో జాగ్రత్త

ఎసిబి డిజి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎసిబి అధికారుల పేరుతో ఫేక్ కాల్ చేసిన వ్యక్తి పై ఎసిబి అధికారుల ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. ఎసిబి పేరుతో ప్రభుత్వ అధికారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాలను ఎసిబి డిజి విజయ్ కుమార్ మంగళవారంఒక ప్రకటనలో వెల్లడించారు. ఎసిబి పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ నమ్మవద్దని డిజి ప్రభుత్వ ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వ అధికారులు ప్రైవేటు వ్యక్తలను డబ్బులు డిమాండ చేసినట్లయితే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎసిబి టోల్ ఫ్రీ 1064 కి సంప్రదించాలని తెలిపారు.

సెమీకండక్టర్స్ మార్కెట్‌లో భారీవాటా


# రాబోయేకాలంలో భారత్‌దే

సెమీకాన్ ఇండియా సదస్సులో మోదీ వెల్లడి






**న్యూఢిల్లీ:** సెమీకండక్టర్స్ చిప్ తయారీలో భారతదేశం ప్రపంచంలోనే పెద్ద మార్పు తీసుకువచ్చేరోజు ఇంకెంతోదూరం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాబోయేకాలంలో ప్రపంచ సెమీకండక్టర్స్ మార్కెట్‌లో భారీ వాటా భారత్‌కే దక్కుతుందన్నారు. దేశంలో పది సెమీకండక్టర్ ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉన్నాయని, ఈ పది ప్రాజెక్టులూ మొత్తం 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో సిద్ధమతువున్నాయని చెప్పారు. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన ‘సెమికాన్ ఇండియా–2025 సదస్సులో నరేంద్రమోదీ ప్రారంభోపన్యాసం చేశారు. సెమీకండక్టర్స్ తయారీ రంగంలో భారతదేశం తదుపరి దశలో ముందుకు దూసుకువెళుతుందని, ఒక ట్రిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ చిప్ మార్కెట్‌లో డిజైన్‌తో ముడిపడిన ప్రోత్సాహక పథకం పెద్ద మార్పు తెస్తుందని ఆ రోజు ఇంకెంతో దూరంలో లేదని అన్నారు. భారత్‌లోనే డిజైన్ చేసి, భారత్‌లోనే తయారు చేసిన చిప్‌లు ప్రపంచ విశ్వాసాన్ని చూరగొన్నాయని చెప్పేరోజు త్వరలో వస్తుందని ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుండి వచ్చిన సెమీ కండక్టర్ సెక్టర్ రంగ నిపుణుల సమక్షంలో చెప్పారు. దాదాపు యాభై దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఎంతో విభిన్నమైన కాంబినేషన్ డిజైన్‌ల ద్వారా, ‘‘భారతదేశాన్ని ప్రపంచం విశ్వసిస్తోంది, భారత్‌పైనే ప్రపంచం నమ్మకం పెట్టుకుంది,సెమీకండక్టర్ రంగ భవిష్యత్తును భారత్‌తో కలిసి నిర్మించడానికి ప్రపంచం సిద్దంగా ఉంది’’ అనే ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతుందని చెప్పారు. చమురును నల్లబంగారంగా తరచు అందరూ అభివర్ణిస్తూ ఉంటారనీ, కానీ ఈ సెమీకండక్టర్స్ ప్రపంచంలో చిప్స్ డిజిటల్ డైమండ్స్ అనీ ఆయన చెప్పారు. చమురు గత శతాబ్దంలో ప్రపంచాన్ని తీర్చిదిద్దితే, ఇప్పుడు ఒక చిన్న చిప్‌లోనే 21వ శతాబ్దపు శక్తిసామర్థ్యాలన్నీ కేంద్రీకృతమై ఉన్నాయన్నారు. పరిమాణంలో చాలా చిన్నగా ఉన్నప్పటికీ కూడా ప్రపంచ ప్రగతియావత్తూ దాని శక్తిసామర్థ్యాలపైనే ఆధారపడి ఉన్నాయని అన్నారు. ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ ఇప్పటికే 600 బిలియన్ డాలర్ల స్థాయికి చేరకుందని, రాబోయే సంవత్సరాలలో ఈ మార్కెట్ ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయిని దాటేస్తుందని అంచనావేస్తున్నారన్నారు. ఈ ఒక ట్రిలియన్ డాలర్ల సెమీకండక్టర్ మార్కెట్‌లో భారతదేశం రాబోయేకాలంలో గణనీయమైన వాటాను దక్కించుకుంటుందన్నారు. ఇన్వెస్టర్లతో మోదీ మాట్లాడుతూ, భారతదేశం దీర్ఘకాలిక ప్రయోజనాలకోసమే చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. డిజైన్ రెడీగా ఉంది, దాని తొడుగులు కూడా అందుబాటులోనే ఉన్నాయి, ఇక ఇప్పుడు భారీ ఎత్తున ఉత్పత్తిచేసి సరఫరాచేయడమే లక్ష్యంగా ఉందని చెప్పారు. భారతదేశ మొదటి సెమీకండక్టర్ ప్లాంటుకు గత ఏడాదిలోనే ఆమోదం తెలియజేశామన్నారు. ఇంకా అనేక ప్లాంట్ల ఏర్పాటుకు ఈ ఏడాదిలో ఆమోదాలు తెలియజేశామని చెప్పారు. మరో ఐదు ప్రాజెక్టులు అదనంగా రాబోతున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే వేదికగా ఏర్పడి ఈ ప్రాజెక్టులకు అనుమతులు, అవకాశాలు, సమస్యల పరిష్కారాలకు అతిసులువైన విధానాలను అమలు చేస్తున్నాయని చెప్పారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కార్టూనిస్టు హేమంత్‌కు సుప్రీం బెయిల్



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై అభ్యంతరకర కార్టూన్లు వేసిన కార్టూనిస్టు హేమంత్ మాల్వియాకు సుప్రీంకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తన కార్టూన్ పట్ల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో మాల్వియా క్షమాపణలు చెప్పినట్లు జస్టిస్ అరవింద్ కుమార ఎన్వీ అంజారి తెలిపారు. ఒకవేళ కార్టూనిస్టు దర్యాప్తునకు సహకరించకుంటే అప్పుడు బెయిల్ రద్దు చేసే స్వేచ్ఛను పోలీసులకు కోర్టు వదిలేసింది. మాల్వియా తరపున వందా గ్రోవర్ వాదించారు. క్షమాపణలు చెప్పామని, కానీ ఇప్పటి వరకు పిటిషనర్‌కు సమన్లు ఇవ్వ లేదన్నారు. అన్ని ఆధారాలు సేకరించిన తర్వాత సమన్లు ఇస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ తెలిపారు. ఓలాయర్, ఆర్‌ఎస్‌ఎస్ వర్కర్ వినయ్ జోషీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాల్వియాపై మే నెలలో కేసు నమోదు చేశారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినట్లు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అభ్యంతరకరమైన కార్టూన్లను సోషల్ మీడియాలో పోస్టుచేసి...అల్లర్లు సృష్టిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మేము గెలిచాం

## అనేక డిమాండ్లను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది

### మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత జరంగే ప్రకటన

**ముంబయి :**మరాఠా కోటాపై మహారాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ ఉప కమిటీ తన డిమాండ్లను చాలావరకు అంగీకరించిందని మరాఠా ఉద్యమ కోటా నేత మనోజ్ జరంగే ప్రకటించారు. ఇది తాము సాధించిన విజయమని చెప్పారు. అర్హత కలిగిన మరాఠాలకు కున్బి సామాజిక సర్టిఫికెట్లు జారీ సహా అనేక డిమాండ్లను అంగీకరించారన్నారు. కాగా, జరంగే నిరాహారదీక్ష మంగళవారం ఐదవ రోజుకు చేరుకుంది. కొన్ని డిమాండ్లు నెరవేర్చనున్నట్లు హామీ రావడంతో జరంగే మద్దతుదారులు వేడుకలు చేసుకున్నారు. కాగా, మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ ఉప కమిటీతో జరంగే సమావేశం తరువాత తాము విజయం సాధించామని ప్రకటించారు. విఖే పాటిల్ మధ్యాహ్నంకమిటీలోని ఇతర సభ్యులైన సవెంద్రసిన్ భోసలే, ఉదయ్ సమంత్, మానిక్రావ్ కోకెట్ కలిసి దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదానంలో జరంగేతో సమావేశమయ్యారు. కమిటీ ఖరారు చేసిన ముసాయిదా గురించి చర్చించారు. మరాఠా కోటా డిమాండ్లపై మహారాష్ట్ర ప్రభుత్వం జిఆర్‌ఎస్ (ప్రభుత్వ తీర్మానాలు) జారీ చేస్తే తాము రాత్రి 9 గంటలకు ముంబయి నుండి బయలుదేరుతామని జరంగే ప్రకటించారు. హైదరాబాద్ గెజిట్‌ను అమలు చేయాలని జరంగే చేసిన డిమాండ్లను సబ్ కమిటీ అంగీకరించింది. సరైన విచారణ నిర్వహించిన తరువాత కున్బీ రికార్డులతో ఉన్న మరాఠాలకు కుల ధృవీకరణ పత్రాలు జారీ అవుతాయని హామీనిచ్చింది. జరాంగే తన మద్దతుదారుల ఎదుట కమిటీ ముసాయిదాను చదివి వినిపించారు. ఇది హైదరాబాద్ గెజిట్, జిఆర్ అమలును వెంటనే జారీ చేయనున్నట్లు అంగీకరించిందని చెప్పారు. సతారా గెజిట్ అమలును కూడా ఒక నెల వ్యవధిలో జరుగుతుందని ఆయన అన్నారు. కమిటీ ఇచ్చిన హామీ ప్రకారం, ఇంతకు ముందు మరాఠా నిరసనకారులపై దాఖలు చేసిన కేసులు సెప్టెంబర్ చివరి నాటికి ఉపసంహరించబడతాయని ఆయన అన్నారు. ఇప్పటివరకు జరిగిన నిరసనల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు విద్యా అర్హతల ప్రకారం ఆర్థిక సహాయం, ప్రభుత్వ ఉద్యోగాలు వారంలోనే ఇచ్చే నిర్ణయం జరిగిందని జరంగే తెలిపారు. ఇప్పటివరకు రూ .15 కోట్ల కోట్ల సహాయం (మరణించిన నిరసనకారుల బంధువులకు) ఇవ్వబడిందని, మిగిలినవి ఒక వారం వ్యవధిలో ఇవ్వబడుతుందని కమిటీ జరాంగేతో తెలిపింది. 'సేజ్ సోయారే' (రక్త బంధువులు)



నోటిఫికేషన్‌కు 8లక్షల అభ్యంతరాలు వచ్చాయని, వాటిని పరిశీలించడానికి ప్రభుత్వానికి సమయం అవసరమని విఖే పాటిల్ చెప్పారు. కున్బిస్, మరాఠాలు ఒకే సామాజికవర్గమని జిఆర్ జారీ చేయడానికి ప్రభుత్వం చట్టపరమైన ఎంపికలను అన్వేషిస్తోందని, ఈ ప్రక్రియకు రెండు నెలలు పడుతుందని మంత్రి చెప్పారు. జరంగే తమ విజయం గురించి ప్రకటించిన తరువాత ఆజాద్ మైదాన్, చుట్టుపక్కల మరాఠా కోటా నిరసనకారులు వేడుకలు చేసుకున్నారు. ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి) సమూహం కింద ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో మరాఠా సమాజానికి 10 శాతం కోటా డిమాండ్ కోసం జరంగే ఆగస్టు 29నుండి నిరాహారదీక్షను ప్రారంభించారు.

### బుధవారం ఉదయం ఖాళీ చేయాలి : హైకోర్టు

కాగా, మంగళవారం ఉదయం బొంబయి హైకోర్టు జరంగే, నిరసనకారులు ఆజాద్ మైదాన్‌ను మధ్యాహ్నం 3 గంటలకు ఖాళీ చేయమని ఆదేశించింది. వారు అనుమతి లేకుండా నిరసనను చేస్తున్నారని పేర్కొంది. అయితే బుధవారం ఉదయం వరకు తననిరాహారదీక్ష కొనసాగించేందుకు జరంగే చేసిన అభ్యర్థనను ఆతరువాత అంగీకరించింది. బుధవారం ఉదయం నాటికి వారిని ఖాళీ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు హెచ్చరించడంతో మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ నేతృత్వంలోని క్యాబినెట్ ఉప కమిటీ మధ్యాహ్నం నిరసన వేదిక వద్ద జరంగేతో సమావేశమైంది. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది నిరసనకారులతో కలిసి జరంగే గత ఐదు రోజుల నుంచి నిరాహారదీక్ష చేపడుతున్నారు. వందలాది మంది నిరసనకారులు దక్షిణ ముంబయిలోని వీధుల్లోకి వెళ్లి సిఎస్‌ఎంటి ప్రాంగణాన్ని దిగ్బంధించారు. దీంతో లక్షలాది మంది ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. హైకోర్టు నిరసనకారులను తీవ్రంగా మందలించింది.

## యుపీలో విద్యార్థుల ఆందోళన...లాఠీచార్జి

**లక్నో:** బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్ బారాబంకిలో గల రామ్ స్వరూప్ విశ్వవిద్యాలయంలో గుర్తింపు లేకుండా కోర్సులు నడుపుతుండడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పోలీసులు విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడంతో 24మంది గాయపడ్డారు. రామ్‌స్వరూప్ విశ్వవిద్యాలయంలో ఎటువంటి గుర్తింపు లేకుండా కోర్సులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ధర్నాకు దిగారు. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. కళాశాల గేటు మూసివేయడంతో సంస్థ యాజమాన్యంతో ఘర్షణ పడ్డారు. దీంతో పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేశారు. దీనికి నిరసనగా రాత్రివేళ విద్యార్థులు వీసీ నివాసం వద్ద ధర్నాకు దిగారు. బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి గుర్తింపు లేకపోయినా, ఎల్‌ఎల్‌బీ, బీబీఎ, ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీలో అక్రమంగా అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై కొన్ని రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీలతో విద్యార్థులను వెంబడించారు. దీనితో ఆగ్రహించిన కొంతమంది విద్యార్థులు గడియా పోలీస్ స్టేషన్‌పై రాళ్లు రువ్వారు. పోలీసులు సైతం విచక్షణారహితంగా వెంటాడి కొట్టారు. ఇందులో దాదాపు 24 మంది గాయపడ్డారు. వారిలో ఎనిమిది మంది ఆసుపత్రిలో చేరారు. పోలీసులు తెలి



పిన వివరాల ప్రకారం విశ్వవిద్యాలయ పరిపాలన, భద్రతా సిబ్బందికి చెందిన కొంతమంది విద్యార్థులు ఘర్షణ పడ్డారు. గేట్లు మూసివేయడం, తెరవడంపై ఇరువర్గాలు గొడవ ప్రారంభించడంతో క్యాంపస్‌లో గందరగోళం చెలరేగింది. దీంతో పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చిందని తెలిపారు. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నీర్జా జిందాల్ మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ కోర్సును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తించలేదనే విషయాన్ని కొంతమంది ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. 202223 సెషన్‌కు సంబంధించిన ఆమోద పత్రాన్ని కౌన్సిల్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. 2027 వరకు నాలుగు కౌన్సిల్‌లకు ఆమోద అనుబంధ రుసుమును విశ్వవిద్యాలయం చెల్లించిందని చెప్పారు. విద్యార్థులలో వ్యాపించిన గందరగోళాన్ని తొలగించడానికి, విశ్వవిద్యాలయం ఒక అఫిడవిట్ కూడా జారీ చేసిందన్నారు.

## రేప్ కేసులో ఆప్ ఎమ్మెల్యే అరెస్టు

### పోలీసులపై కాల్పులు జరిపి పరారీ



**చండీగఢ్:** పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రా అత్యాచార ఆరోపణలపై అరెస్టయ్యారు. అయితే, ఆయన అనూహ్యంగా పోలీసు కస్టడీ నుంచి పరారయ్యారు. హర్యానాలోని కర్నాల్‌లో పోలీసులపై కాల్పులు జరిపి ఆయన పారిపోయాడు. పటియాలలోని సనౌర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న హర్మీత్... తన సహచరులతో కలిసి పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక పోలీస్ అధికారిని గాయపరిచి, వాహనంతో ఢీకొట్టి తప్పించుకున్నాడు. ఎమ్మెల్యే హర్మీత్‌సింగ్ పఠాన్ మజ్రాను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఎమ్మెల్యేపై అత్యాచార కేసు జిరక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు నమోదైంది. హర్మీత్ విడాకులు తీసుకున్నట్లు తనకు తప్పుడు సమాచారం ఇచ్చి.. 2021లో పెళ్లి చేసుకున్నాడని ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. తనపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడి, అసభ్యకర సందేశాలు పంపినట్లు బాధితురాలు తెలిపింది. ఈఆరోపణలను హర్మీత్ ఖండించారు. ఇవి రాజకీయకుట్రలో భాగమని, ఆప్ ఢిల్లీ నాయకత్వం తనను లక్ష్యంగా చేసుకుందని ఫేస్‌బుక్ లైవ్‌లో ఆరోపించాడు. ఈ ఘటనలకు ముందు హర్మీత్ పంజాబ్‌లో వరదల నిర్వహణపై తనపార్టీ ప్రభుత్వాన్ని, ఢిల్లీ నాయకత్వాన్ని విమర్శించాడు. దీంతో ఆప్ నేతత్వంలోని పంజాబ్ సర్కార్ హర్మీత్ భద్రతా సిబ్బందిని ఉపసంహరించి...సనౌర్ నియోజకవర్గంలోని పోలీసుస్టేషన్‌కు అధికారులను బదిలీచేసింది. దీంతో ఈకేసు రాజకీయ వివాదంగా మారింది. హర్మీత్ తనఅరెస్ట్‌ను రాజకీయ కక్షసాధింపుగా చెబుతుండగా... పోలీసులు అతడిని పట్టుకునేందుకు హర్యానా పోలీసులతో కలిసి గాలిస్తున్నారు.

## ప్రజాస్వామ్య అంతమే బిజెపి లక్ష్యం

### వినాశకరఫాసిస్టు విధానాలను అడ్డుకోవాలి: అమర్‌జిత్ కౌర్

**కాల్బుర్గి:** ప్రజాస్వామ్యాన్ని అంతం చేసి మత రాజ్యం స్థాపించడం కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. బీజేపీఆర్‌ఎస్‌ఎస్ వినాశకరఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు సీపీఐ బలమైన శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. సీపీఐ కర్నాటక రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా 'ది హిందూ'తో అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య గణతంత్రాన్ని మతరాజ్యంగా మార్చే ప్రయత్నాన్ని మోదీప్రభుత్వం చేస్తోందని, దీనిని అడ్డుకోవాలన్నారు. ఈసీ, సీఈసీ నియామక విధానాన్ని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలను శాశించేందుకు గవర్నర్ల కార్యాలయాలను దుర్వినియోగిస్తుండటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పరిపాలనా విధానంలో మార్పు తేవడం ద్వారా రాజ్యాంగాన్ని నీరుగార్చే దిశగా మోదీ



సర్కారు అన్ని ప్రయత్నాలు చేస్తోందని అమర్‌జిత్ కౌర్ వ్యాఖ్యానించారు. సమాఖ్యవాదాన్ని వ్యూహాత్మకంగా నాశనం చేస్తుందని, ఇది ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్య సిద్ధాంతాలు మంటగలుస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. హిందూయిజం (హైందవ మతం) అన్నది సింధూ నాగరికత సహా అనేక మూలాల నుంచి వచ్చిందని గుర్తుచేశారు. సింధూ నగరిక వైవిధ్య భరితమన్నారు. అనేక సంస్కృతి, సంప్రదాయాలు, భాషలతో, సూఫీ గొప్ప వారసత్వంతో కూడుకొని ఉన్నదన్నారు. ఈ అంశాలన్నీ మరిచి హిందూయిజం, హిందూత్వం జపంతో ఏక శిలా వ్యవస్థ (మోనోలిథిక్ సిస్టమ్), సజాతీయ సమాజం (హోమోజీనస్ సొసైటీ) ఏర్పాటుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయి' అని అమర్‌జిత్ కౌర్ ఆరోపించారు. కార్మిక చట్టాలను కొత్త కోడ్‌లతో అనుసంధానం చేసేలా సవరణలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించి తాము అనుకున్నది సాధించేందుకు కొత్త మార్గాలను మోదీ ప్రభుత్వం కనుగొన్నదని దుయ్యబట్టారు. నేరుగా అమలు చేయలేనివన్నీ సవరణల నెపంతో కొత్త పద్ధతు ద్వారా పరోక్షంగా అమల్లోకి తెచ్చుకుంటోందని విమర్శించారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో జరగబోయే సీపీఐ జాతీయ మహాసభల్లో అన్ని అంశాలను చర్చిస్తామన్నారు. ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేశ్, మేధావి ఎంఎం కాల్బుర్గి హత్య కేసుల్లో వేగవంత విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ కోరబోతోందని చెప్పారు. గౌరీ లంకేశ్, కాబ్బుర్గితో పాటు సీపీఐ నాయకుడు గోవింద్ పన్సారే, హేతువాది నరేంద్ర ధబోల్కర్ హత్య కేసులకు సంబంధమున్నదని అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు.

## జిఎస్‌టి నిబంధనలు సులభతరం

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**చెన్నై :** తదుపరి తరం జిఎస్‌టి సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను సమూలంగా బహిరంగంగా, పారదర్శకంగా మారుస్తాయని, నిబంధనల భారం మరింత తగ్గుతుందని, చిన్న వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. తమిళనాడులోని చెన్నైలో మంగవారం జరిగిన సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రసంగించారు. నిబంధనలను సులభతరం చేయడానికి, సమ్మతి వ్యయాలను తగ్గించడానికి, స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవస్థాపకుల కోసం మరింత అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు ఇందుకు అనుగుణంగా బుధ, గురువారాలలో జరగనున్న కౌన్సిల్ సమావేశంతో తదుపరి తరం జిఎస్‌టి సంస్కరణల అమలు, రాబోయే నెలల్లో ఆర్థిక వ్యవస్థను పూర్తిస్థాయిలో బహిరంగంగా, పారదర్శకంగా మారుస్తుందన్నారు. భారతదేశం తన వికసిత్ భారత్ 2047 లక్ష్యం వైపు పురోగమిస్తున్నట్లయితే, బ్యాంకులు కేవలం రుణాలను విస్తరించడమే కాకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఊపందించాలని, ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో, అవసరాలకు అనుగుణంగా నిధులను అందించాన్నారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని వారిని లాంఛనప్రాయ బ్యాంకింగ్ పరిధిలోకి తీసుకురావాలి, అలాగే బ్యాంకింగ్ ఛానెల్స్ మద్దతు చాలా ముఖ్యమైన వివిధ అవసరాలను తీర్చాలి అని కోరారు.

## ఆమోదించిన బిల్లుల కాలపరిమితిపై

## రాష్ట్రపతి సూచన సహా రాజ్యాంగాన్ని అర్థం చేసుకుంటాం

### 'సుప్రీం'వెల్లడి

**న్యూఢిల్లీ :** గవర్నర్లు, రాష్ట్రపతి, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను పరిష్కరించేందుకు కాలపరిమితి విధించవచ్చా లేదా అనే దానిపై రాష్ట్రపతి సూచనను పరిశీలిస్తూ రాజ్యాంగాన్ని మాత్రమే అర్థం చేసుకుంటామని మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఈ సూచనను వ్యతిరేకిస్తున్న పార్టీల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రాజ్యాంగఉదాహరణలపై ఆధారపడాలని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా సూచించినప్పుడు ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. ఆ అంశాలను ఆయన వాదించలేదు కాబట్టి ఆయన సమాధానం ఫైల్ చేయాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్. నరసింహ, జస్టిస్ చందుర్కర్ ప్రాతినిథ్యం వహిస్తున్న రాజ్యాంగ ధర్మాసనం ఉద్దేశించి తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ 'ఒకవేళ వారు (తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు) ఆంధ్రప్రదేశ్ ఉదాహరణలపై ఆధారపడనట్లయితే దీనిపై మేం సమాధానం దాఖలు చేయాలని అనుకుంటున్నాం. కాబట్టి



రాజ్యాంగం ప్రారంభం నుంచి ఎలా ఆనందోత్సాహలతో సాగిందో మనం చూపించాల్సిన అవసరం ఉంది. ఆ మురికి మార్గంలో ప్రయాణించాలని అనుకుంటున్నారో లేదో చూద్దాం' అని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా చెప్పారు. కాగా ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ దీనిపై స్పందించారు.తుషార్‌మెహ్‌తాను ఉద్దేశించి 'ఆంధ్రప్రదేశ్ అయినా, తెలంగాణ అయినా, కర్ణాటక అయినా ఏదేని కావచ్చు. మేం వ్యక్తిగత విషయాలలోకి వెళ్లదలచుకోలేదు. రాజ్యాంగంలోని నిబంధనలను మాత్రమే అర్థం చేసుకంటాం. అంతకు మించి మరేమీ లేదు' అని బిఆర్.గవాయ్ అన్నారు. రాష్ట్రపతి సూచనపై అభిషేక్‌సింఘ్వి 6వ రోజున తన వాదనను తిరిగి ప్రారంభించారు. తప్పిపోవడం అంటే ఏమిటో ఆయన విపులీకరించారు. ప్రభుత్వం బిల్లును నిలిపివేయాని నిర్ణయించుకుని దానిని తిరిగి అసెంబ్లీకి పంపించకపోతే ఏమవుతుందని ప్రధానన్యాయమూర్తి బిఆర్. గవాయ్ అభిషేక్ సింఘ్విని అడిగారు. సింఘ్వి ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహించిన రాజ్యాంగ ధర్మాసనానికి బదులిస్తూ 'అలా జరిగితే ఆ పంపిన వారంతా ఇది అంతా అసెంబ్లీకి వెనకకు పంపించడం జరుగదు. ఆర్టికల్ 200లోని మొదటి నిబంధనను పాటించకపోతే 'బిల్లును అసెంబ్లీకి తిరిగి పంపాల్సిన అవసరం ఉంది)బిల్లు వర్తిస్తుంది' అని అభిషేక్ సింఘ్వి సమాధానం ఇచ్చారు. ఆగస్టు 28న గవర్నర్లు 'శాశ్వతత్వం' కోసం సమ్మతిని నిలిపివేయడానికి అనుమతిస్తే బిల్లు ల విధిని నిర్ణయించడంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 200లో ఉపయోగించిన 'సాధ్యమైనంత త్వరగా' అనే పదం ఎలాంటి ఆచరణాత్మక ప్రయోజనాన్ని అందించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినందుకు రాష్ట్రపతి, గవర్నర్ చర్యలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు రిట్ అధికార పరిధిని ఉపయోగించలేవని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించిన నేపథ్యంలో ఈ పరిశీలన వచ్చింది. ప్రతీరోజూ వచ్చే వ్యాధులకు న్యాయవ్యవస్థ ఒక మాత్ర కాదని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ సందర్భంగా వాదించాయి.

## ఢిల్లీ అల్లర్ల కేసులో

# ఉమర్, ఇమామ్‌కు నో బెయిల్

### మరో ఏడుగురికీ లభించని ఉపశమనం

### అన్ని అప్పీళ్లకు ఢిల్లీ హైకోర్టు తిరస్కృతి

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అల్లర్ల కేసులో హక్కుల కార్యకర్తలు ఉమర్ ఖాలిద్, షర్జిల్ ఇమామ్ బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. మరో ఏడుగురు సహ నిందితులకూ ఉపశమనం కల్పించడానికి నిరాకరించింది. 2020లో జరిగిన ఢిల్లీ అల్లర్లకు కుట్ర చేసినట్లు వీరందరిపై యూఏపీఏ కేసు నడుస్తోంది. ఈ కేసులో తీర్పును హైకోర్టు జులై 9న రిజర్వులో పెట్టింది. తాజా విచారణ క్రమంలో సంబంధిత అన్ని అప్పీళ్లు తిరస్కరించింది. ఖాలిద్, ఇమామ్, మహ్మద్ సలీం ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, అథర్ ఖాన్, మీరన్ హైదర్, అబ్దుల్ ఖాలిద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా, షాదాబ్ అహ్మద్ బెయిల్ పిటిషన్లు తిరస్కరిస్తూ జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ షాలిందర్ కౌర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో వాదనలు సోమవారం ముగిశాయి. ఇమామ్ తరపున న్యాయవాది వాదిస్తూ



అల్లర్లతోగానీ సహనిందితులతోగానీ షర్జిల్ ఇమామ్‌కు ఏ సంబంధమూ లేదన్నారు. ఆయన ప్రసంగాలు, వాట్సాప్ సందేశాల కారణంగా ఎన్నడూ అల్లర్లు జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీ పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దేశద్రోహులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు శిక్ష పడటమో లేక విడుదల కావడమో జరిగేంత వరకు జైల్లోనే ఉండాలన్నారు. అల్లర్లలో 100 మంది పోలీసులు, 41 మంది ఇతరులు గాయపడ్డారని, ఒక పోలీసు చనిపోయారని గుర్తుచేశారు. ఈ అల్లర్లు అప్పటికప్పుడు జరగలేదని, ఒక పథకం ప్రకారం జరిగాయని పాసిక్యూషన్ వాదించింది. బెయిల్ పిటిషన్లను తిరస్కరించాలని కోరింది. అల్లర్ల సూత్రధారులుగా ఖాలిద్, ఇమామ్ తదితరులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ), ఐపీసీ నిబంధనల కింద కేసు ఉంది. ఇమామ్, సైఫి, ఫాతిమా తదితరుల బెయిల్ పిటిషన్లు 2022 నుంచి హైకోర్టులో పెండింగ్ ఉన్నాయి. వేర్వేరు ధర్మాసనాలు వీటిని విచారించాయి. తాజా విచారణ క్రమంలో బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ పోలీసులు వ్యతిరేకించారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన మత హింస కేసు సాధారణం కాదని కుట్రపూరితమైనది అని వాదించారు. సీఏఏ-ఎన్‌ఆర్‌సీ, బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాఖ్, కశ్మీర్ వంటి అంశాల ప్రస్తావనలతో ఒక పద్ధతి ప్రకారం భయోత్పాతాన్ని సృష్టించేలా ఖాలిద్, ఇమామ్‌తో పాటు వారి సహనిందితులు ప్రసంగాలు చేసినట్లు ఆరోపించారు. నేరస్తులు శిక్షను తప్పించుకోలేరన్నారు. ట్రయల్ కోర్టు ప్రక్రియను ఆలస్యం చేసే ప్రాసిక్యూషన్ ప్రయత్నాలను ఖండించారు. వేగవంత విచారణ 'ఫ్రీ పాస్' కాదన్నారు. కాగా, సీఏఏ, ఎన్ఆర్‌సీ వ్యతిరేక ఆందోళనలప్పుడు ఢిల్లీలో అల్లర్లు జరిగాయి. యూఏపీఏ కేసు కారణంగా ఉమర్ ఖాలీద్ ఐదేళ్లుగా అత్యంత భద్రతగల తీహార్ జైల్లో ఉన్నారు. ఆయన 38వ పుట్టినరోజు అక్కడే జరిగింది.

## అక్రమ వలసదారులకు

# ప్రవేశం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులు భారత్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. గతంలో భారత్‌కు వచ్చి... గూఢచర్యం, అత్యాచారం, హత్య, ఉగ్రవాద చర్యలు, నిషేధిత సంస్థలలో సభ్యులుగా ఉండటం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి ఆరోపణలపై దోషులుగా తేలి... వారి దేశాలకు వెళ్లిపోయిన విదేశీయులపై ఈ చర్యలు తీసుకోవాలని సూచించింది. అటువంటి వారు తిరిగి భారత్‌లోకి ప్రవేశించకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. అలాంటి వారిని గుర్తిస్తే నిర్బంధించాలని పేర్కొంది. ఇటీవల ప్రవేశపెట్టిన ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం (2025) ప్రకారం దేశవ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులను గుర్తించి... వారిని అదుపులోకి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా నిర్బంధ శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ విషయంలో సరిహద్దు రక్షణ దళాలు, కోస్ట్ గార్డులు కూడా బాధ్యత తీసుకోవాలని హోంమంత్రిత్వ శాఖ ఆదేశించింది. సరిహద్దుల వద్ద భారత్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించే అక్రమ వలసదారులను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. భారత్‌లో ఉద్యోగం చేయడానికి చెల్లుబాటు అయ్యే వీసా ఉన్న విదేశీయులు ఇక్కడి పౌర అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, నీరు, పెట్రోలియం వంటి వాటికి సంబంధించిన ప్రైవేటు ఉద్యోగాల్లో చేరకూడదని షరతు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పర్వతారోహణ యాత్రలు సైతం చేపట్టొద్దని సూచించింది. అఫ్గానిస్థాన్, చైనా, పాకిస్థాన్‌లో జన్మించిన విదేశీయులకు అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, ఉత్తరాఖండ్, లదాఖ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రవేశం నిషిద్ధమని తెలిపింది.

## గ్యాంగ్ రేప్ కేసుల్లో జీవితఖైదు దోషులకు...

## జీవితాంతం జైలుశిక్ష ఒక 'చట్టబద్ధమైన హక్కు'

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** 'సామూహిక అత్యాచారం కేసుల్లో జీవితఖైదు విధించబడిన దోషులకు జీవితాంతం జైలుశిక్ష విధించడం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా చట్టబద్ధమైన హక్కు కూడా అని స్పష్టం చేస్తూ వారికి ఉపశమనం కోరే హక్కును సుప్రీంకోర్టు వివరించింది. జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పూర్వం ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి)లోని సెక్షన్ 376 డిఏ రాజ్యాంగ చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం విచారణ జరిపింది. 16ఏళ్ల వయసున్న బాలికపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడినందుకు విధించాల్సిన శిక్ష సెక్షన్ 376 డిఏ గురించి వివరిస్తుంది.ఈ కేసులో వాదించాలి అనుకునే దరఖాస్తుదారుడి తరపు న్యాయవాది మాట్లాడుతూ సెక్షన్‌లోని 'చేయాలి' అనే వ్యక్తీకరణకు జీవితఖైదు విధించడం తప్ప సెషన్స్ కోర్టుకు వేరే మార్గం లేదన్నారు. అంటే ఆ వ్యక్తి సహజ జీవితంలోని మిగిలిన కాలానికి జైలుశిక్ష విధించాలని కోరారు.ధర్మాసనం రెండు అంశాలను పరిశీలించింది. మొదటిది సెషన్స్ కోర్టు విచారణ విధించాల్సిన నిబంధన కింద సూచించబడిన శిక్ష, దీనిని హైకోర్టు, సుప్రీంకోర్టు ముందు సవాల్ చేయవచ్చు. 'ఈ విషయానికి సంబంధించిన మరొక అంశం ఏమిటంటే, నిందితుడికి అలాంటి శిక్ష విధించినప్పటికీ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 72లేదా ఆర్టికల్ 161 ప్రకారం భారత రాష్ట్రపతి లేదా గవర్నర్ ముందు ఉపశమనం కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భంలో అతనికి ఉపశమనం పొందే హక్కు ఉంది' అని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. అదనంగా, అటువంటి నిందితుడు శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు చట్టబద్ధమైన పరిష్కారం కూడా ఉందని సుప్రీంకోర్టు చెప్పింది.'కాబట్టి ఉపశమనం కోరే హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా చట్టబద్ధమైన హక్కు కూడా.అయితే ఉపశమనం విషయంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో విధానాన్ని కలిగి ఉంటుంది. ఇది సెక్షన్ 376డిఏ లేదా ఆ విషయానికి ఐపిసిలోని 376డిబి కింద విధించినప్పుడు కూడా వర్తిస్తుంది' అని ధర్మాసనం చెప్పింది. సెక్షన్ 376 డిబి 12సంవత్సరాల వయసులోపు బాలికపై సామూహిక అత్యాచారం చేసినపుడు విధించాల్సిన శిక్ష గురించి వివరిస్తుంది.



## బిజెపిది రాజకీయ యాత్ర: సిద్ధరామయ్య

**బెంగళూరు:** బిజెపి చేపట్టిన చలో ధర్మస్థల రాజకీయ యాత్ర అని, తద్వారా ఆ పార్టీకి ఎలాంటి లాభం లేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. కేవలం వారు రాజకీయలబ్ధి కోసమే యాత్ర చేశారన్నారు. మైసూరులో మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య ధర్మస్థల, చాముండి కొండలు, దసరా ఉత్సవాల విషయంలో బిజెపి బూటకపు నిరసన సాగిస్తోందన్నారు. హిందువులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ధర్మస్థల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. సిట్ ఏర్పాటు చేసినప్పుడు వ్యతిరేకించని బిజెపి ఇప్పుడు లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు. తానూ ఓ హిందువేనని, తమ పల్లెలో రామమందిరం నిర్మించలేదా అని అన్నారు.

ST. JOHN'S COLLEGE OF EDUCATION
Affiliated to Osmania University & Approved by NCTE
Opp: GAIL, Chengicherla(V), Cherlapally Phase-III
Medipally(M), Medchal-Malkajgiri(dist)92,TG. Ph: 9866519194, 9949490652
B.Ed. CATEGORY - B Admission Notification 2025-26
B.Ed: Intake - 50
Applications are invited from the eligible Candidates as per TGCHE/OU/NCTE Norms
Cat - B Seats: 12
Application fee Rs.200/-
Applications should reach the Office on or before 11-09-2025
Contact Office between 10am and 5pm
Sd/- Secretary

# మరాఠాలకు పాక్షిక విజయం

తమకు ఒబిసి ప్రతిపత్తి ఇచ్చి రిజర్వేషన్‌లు, ఇతర సౌకర్యాలకు అర్హత కల్పించాలని మనోజ్ జరంగే పాటిల్ నాయకత్వంలో రెండేళ్లుగా సాగుతున్న మరాఠాల ఆందోళన ముంబయిలో ఆదివారం పునఃప్రారంభమై పాక్షిక విజయంతో ముగిసింది. బిజెపి ప్రభుత్వం తలనొప్పిగా తయారైన ఆందోళనను ప్రస్తుతానికి వాగ్దానాలతో ముగింపజేసింది. చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఆజాద్ మైదాన్‌లో 5వేలమందితో ఒకరోజు (ఆదివారం) ఆందోళనకు ప్రభుత్వంనుంచి అనుమతి పొందిన మరాఠాలు మూడురోజులైనా ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయకపోగా, "మా కోర్కెలు ఆమోదించేవరకు నేను తిరిగి వెళ్లను. నాపై కాల్పులు జరిపి చంపినా సరే, నేను వెనక్కు వెళ్లను" అని ఎం.జె.పాటిల్ ప్రకటించటం, మరాఠాలు పదులవేల సంఖ్యలో చేరి దక్షిణ బొంబాయిలోని పరిసర ప్రాంతాలన్నీ ఆక్రమించటం ప్రజా కార్యకలాపాలకు ఇబ్బందిగా మారింది.

ఆందోళనకారులను ఖాళీ చేయించాలని బాంబే హైకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా అది సాధ్యం కాలేదు. ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, అది సామాన్య పౌరులకు ఇబ్బందులు ఏర్పడకుండా శాంతియుతంగా చేబట్టాలని కోర్టు పేర్కొన్నది. ఆందోళనకారులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని సోమవారం ఆదేశించింది.

మరాఠాలకు రిజర్వేషన్‌లకోసం దాదాపు 15 సంవత్సరాలుగా ఆందోళన సాగిస్తున్న మనోజ్ జరంగే పాటిల్ రెండేళ్లుగా ఆందోళన ఉధృతం చేశారు. అరడజను సార్లు నిరాహార దీక్ష చేబట్టాడు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపిని బహిష్కరించాలని మరాఠా కమ్యూనిటీకి పిలుపు ఇచ్చారు. పర్యవసానంగా అది పోటీ చేసిన 28 సీట్లలో 9 మాత్రమే గెలు పొందింది. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో మహాయుతి పోటీ చేసినందున వారు బహిష్కరణ పిలుపు ఇవ్వలేదు. ఫలితంగా బిజెపి పోటీచేసిన 149లో 132 సీట్లు గెలుచుకుంది. ఏక్‌నాథ్ షిండేను కాదని బిజెపి దేవేంద్ర ఫడ్నవీస్‌కు పట్టం కట్టింది. కొద్దినెలల్లో బ్రిహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రానుండగా, బిజెపిపై ఒత్తిడి తెచ్చి తమ కోర్కె సాధించుకునే ఉద్దేశంతో మరాఠా నేత బొంబాయి ఆజాద్ మైదాన్‌లో తిష్టవేశాడు. శివసేన(షిండె) అధికారికంగా కాకపోయినా, దాని ఎంపిలిద్దరు ఆ ఆందోళనలో పాల్గొంటున్నారు. శివసేన పరోక్ష మద్దతుకిది సూచన. శివసేన (యుబిటి), కాంగ్రెస్ ఈ ఆందోళనను బలపరుస్తున్నాయి. దీంతో ఈ ఆందోళనను పరిష్కరించాల్సిన భారం పూర్తిగా బిజెపిపై పడింది. ఇది కరవమంటే కప్పకు కోపం – విడవమంటే పాముకు కోపం లాంటి సున్నితమైన సమస్య.

ప్రజాపక్షం

03-09-2025, బుధవారం

ప్రభుత్వం ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా బలహీనతరగతుల విభాగం (ఎస్ఇడబ్ల్యుస్) కింద మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ ఇచ్చింది. అయితే ఒబిసి కేటగిరిలో ఉన్న కున్బీలతో మరాఠాలకు ఇచ్చి పుచ్చుకునే సామాజిక సంబంధాలు న్నందున తమకు కున్బీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎం.జె.పాటిల్ కోరుతున్నాడు. అప్పుడు మరాఠాలు ఆటోమేటిక్‌గా ఒబిసిలు అవుతారు. అయితే ఒబిసిలు ఆ డిమాండ్‌ను తిరస్కరిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో మరాఠాలు 32 శాతం, ఒబిసిలు 52శాతం. ఏక్‌నాథ్ షిండె ముఖ్యమంత్రిగా ఉండగా అర్హులైన మరాఠాలకు కున్బీ సర్టిఫికెట్లు ఇవ్వటం మొదలు పెట్టారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక ఆపు చేశారు. అయితే మొత్తం రిజర్వేషన్‌లు పెంచకుండా మరాఠాలను ఒబిసిల్లో చేర్చితే తాము నష్టపోతామని ఒబిసి కులాల నేతలు అభ్యంతరం చెబుతున్నారు.

మహారాష్ట్రలో ఒబిసి కేటగిరి కింద ఇప్పటికే 350 కులాలున్నాయి. మరాఠాలను కూడా చేర్చితే ఇప్పటికే ఒబిసి కేటగిరిలో ఉన్నవారికి అన్యాయం జరుగుతుంది. మరాఠాలు సాపేక్షికంగా అభివృద్ధి చెందిన తరగతి. సామాజికంగా, విద్యావిషయకంగా వెనుకబడిన తరగతులకు సామాజిక న్యాయం చేయటం కోసం కల్పించిన రిజర్వేషన్ ఫలాల్లో ఇతరులు భాగం కోరటం ఆ ఆశయాన్ని దెబ్బతీయటమే అవుతుంది. అట్టడుగు తరగతులు చైతన్యవంతమవుతున్నారు. వారు కులగణన చేసి జనాభా ప్రకారం తమ వాటా తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కులగణనను వ్యతిరేకిస్తూ వచ్చిన బిజెపి సైతం వచ్చే జనాభా లెక్కల సేకరణలో కులగణనను చేర్చక తప్పలేదు. రానున్న కాలంలో ఒబిసిలు రాజకీయ, ఆర్థిక న్యాయం కూడా కోరతారు. ఆందోళనలు, ఒత్తిళ్ల ప్రభావానికిలోను గాకుండా న్యాయబద్ధంగా ఒబిసి కులాల జనగణన జరగాలి, విద్య–ఉద్యోగాల్లోనేగాక రాజకీయ, ఆర్థిక కేటాయింపు ల్లో కూడా వారికి న్యాయం జరగాలి. మరాఠాల ఆందోళన ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగియటంతో ముంబయి ఊపిరి పీల్చుకుంది.

## 130వ రాజ్యాంగ సవరణ బిల్లు

# కేశవానంద భారతి తీర్పును తిరగదోడేందుకేనా?



రిటైర్డ్ జస్టిస్ కె.చంద్రు

'చరిత్ర నన్ను నిర్దోషిగా ప్రకటిస్తుంద'ని ఫిడెల్ క్యాస్ట్రో విప్లవానికి పూర్వం 1953లో క్యూబాలో బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించారనే ఆరోపణపై అరెస్టు అయిన సందర్భంలో అన్న మాటలు ప్రఖ్యాతి చెందాయి. ప్రపంచవ్యాప్తంగా నిర్బంధంలో ఉన్న లేదా పౌర హక్కులను కోల్పోయిన స్వాతంత్ర్య పోరాటయోధులు ఇలాంటి ప్రకటనలే చేసి ఉండవచ్చు. ఎలాంటి విచారణ లేదా తీర్పు లేకుండానే అరెస్టుల ద్వారా రాజ్యాంగ పదవుల నుంచి తొలగించడం ద్వారా స్వేచ్ఛపై జరిగే దాడులను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని అనిపిస్తోంది.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల దూకుడుగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో 30 రోజులకు మించి కస్టడీలో ఉన్నారనే ఏకైక కారణంతో ఎన్నికైన మంత్రులను (ప్రధానమంత్రిని కూడా) అనర్హులుగా ప్రకటించవచ్చనే నిబంధన ఉంది. 'సార్వత్రిక నైతికతను ఒక చట్టంలో పొందుపరచడంలో తప్పేముంది?' అని ఈ బిల్లు గురించి కేంద్ర హోం మంత్రి ప్రశ్నను వల్లె వేస్తున్నారు. 'బెయిల్ పొందడంలో విఫలమై, 30 రోజులకు పైగా కేంద్ర జైలులో ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలను చీఫ్ సెక్రెటరీలే కాదు, డిజిపిలు కూడా పాటించకూడదు' అని కూడా అంటున్నారు.

ప్రతిపాదిత కొత్త చట్టంలో దాగి ఉన్న పెద్ద లోపాన్ని గుర్తించనట్లయితే ఈ ప్రశ్న ఎవరికైనా ఆకర్షణీయంగా కనిపించవచ్చు. ఈ చట్టాన్ని తీసుకురావడానికి, ఆదరాబాదరాగా ఆమోదింపజేయడానికి ప్రయత్నించడం వెనుక అధికార పార్టీ అసలు ఉద్దేశ్యం ఏమిటి?

రాజ్యాంగ నైతికత కంటే, ఈ చట్టం వెనుక ఉన్న అసలైన ఉద్దేశ్యం పూర్తిగా వేరు అని అనిపిస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి నేతృత్వంలో ఒక మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటు లేదా రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులకే ఉంది. ఎన్నికల తర్వాత చట్టసభలో ఎక్కువ మంది సభ్యులు కలిగిన పార్టీకి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే ప్రత్యేక హక్కు ఉంటుంది. ఇందుకు రాష్ట్రపతి లేదా గవర్నర్ మెజారిటీ పార్టీ నాయకుడిని ఆహ్వానించాలి.

ఆర్టికల్ 75(3) ప్రకారం, మంత్రి మండలి సమిష్టిగా దిగువ సభకు బాధ్యత వహిస్తుంది. ఆర్టికల్ 75(5) ప్రకారం, ఏ వ్యక్తైనా మంత్రి పదవి స్వీకరించిన ఆరు నెలల్లోగా సభలో సభ్యుడు కానట్లయితే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోతాడు.

రాజ్యాంగం మంత్రులకు ప్రత్యేకమైన అర్హతలు లేదా అనర్హతలను నిర్దేశించలేదు. ఎందుకంటే చట్టసభ సభ్యుడికి వర్తించే అనర్హతలే మంత్రికి కూడా వర్తిస్తాయి. మామూలుగా చెప్పాలంటే సభలో సభ్యుడు కాకుండా ఎవరూ మంత్రి కాలేరు.

రాజ్యాంగ అనర్హతలను ఆర్టికల్ 102 (పార్లమెంటు సంబంధిత), ఆర్టికల్ 191 (రాష్ట్ర శాసనసభ సంబంధిత)లలో పొందుపరిచారు. ఈ అధికరణల ప్రకారం ఒక సభ్యుడు ఎటువంటి లాభదాయక పదవిలో ఉండకూడదు, మానసిక అనారోగ్యంతో ఉండకూడదు, రుణగ్రస్తుడు కాకూడదు, లేదా భారతదేశ పౌరుడు కాకుండా ఉండకూడదు. ఆసక్తికరంగా, ఆర్టికల్ 102(ఇ),191(ఇ) ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా ఏదైనా ఇతర అనర్హతలను కూడా నిర్దేశించవచ్చని పేర్కొనబడింది. ఇది విచిత్రమైంది. ఈ నిబంధన ద్వారా రాజ్యాంగం అసలు ఉద్దేశ్యం కాని వాటిని కూడా అనర్హతకు ఒక కారణంగా మార్చవచ్చు.

రాజ్యాంగం అసలు ఉద్దేశించని ఇలాంటి విషయాలను కూడా పార్లమెంటులో మాయ చేయవచ్చు. ఇందుకు కొన్ని ఇతర దేశాలను ఉదహరించవచ్చు. ఆ దేశాలలో ఇలాంటి చట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థల్లో మార్షల్ లా (సైనిక పాలన) ప్రబలడానికి మార్గం సుగమం చేశాయి. ఉదాహరణకు, పాకిస్తాన్‌లో సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పుడు, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులందరూ అసలు(పాత) రాజ్యాంగం ప్రకారం పదవీ ప్రమాణం చేయడంతో పాటు, సైనిక ప్రకటనకు విధేయత చూపే విధంగా కొత్త ప్రమాణం కూడా చేయాలని రాజ్యాంగాన్ని సవరించారు. చాలా మంది న్యాయమూర్తులు కొత్త ప్రమాణం చేయడానికి నిరాకరించిన కారణంగా పదవులను కోల్పోయారు. పరిపాలనా చట్టంలో దీన్ని 'ఓత్ పాలిటిక్స్' (ప్రమాణ రాజకీయాలు) అని పిలుస్తారు.

భారతదేశం కూడా దీనికి మినహాయింపు కాదు. 1963లో, వివిధ రాజ్యాంగ పదవులలో ఉన్నవారు చేసే ప్రమాణాలకు ఒక చిన్న సవరణ తీసుకువచ్చారు. దీని ద్వారా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యులు చేసే ప్రమాణాన్ని నిర్దేశించే షెడ్యూల్ 3 తో సహా, సంబంధిత నిబంధనలను సవరించారు. 16వ రాజ్యాంగ సవరణ తర్వాత, ప్రమాణంలో 'రాజ్యాంగానికి విధేయత చూపడంతో పాటు, భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుతాను' అనే వాక్యం చేర్చబడింది.

దక్షిణ భారత రాజకీయ పార్టీలను, ముఖ్యంగా ప్రత్యేక ద్రావిడ నాడును కోరుకుంటున్న డిఎంకెను నిలువరించడానికి ఈ సవరణ ఉద్దేశించబడింది. విషయం సుస్పష్టంగా ఉంది. కొత్త ప్రమాణం చేయాలంటే, వేర్పాటు ఆలోచనను వదులుకోవాలి. దీనితో డిఎంకె దాని ప్రత్యేక నాడు డిమాండ్‌ను వదులుకొని, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో ప్రవేశించే పార్టీగా మారింది. ఈ రాజ్యాంగాన్ని వక్రీకరించే, ప్రతిపక్షపార్టీలను అణచివేసే ఆట ఎనిమిది దశాబ్దాల క్రితమే ప్రారంభమై, నేటికీ కొనసాగుతోంది.

ఆర్టికల్ 102(ఇ),191(ఇ)లోని నిబంధనను ఉపయోగించుకొని, చట్టం ద్వారా పార్లమెంటు మరిన్ని అనర్హతలను నిర్దేశించగలదు. దీని ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 (ఆర్‌పి యాక్ట్) ను రూపొందించారు. ఈ చట్టంలోని చాప్టర్ 3 చట్ట సభ సభ్యుల అనర్హతలకు సంబంధించి వివరించింది. సెక్షన్ 8(1) భారతీయ శిక్షా స్మృతి నుంచి వరకట్నం నిషేధ చట్టం వరకు వివిధ చట్టాల కింద కోర్టు ద్వారా శిక్షించబడిన వారి గురించి చెబుతుంది.

సెక్షన్ 8(2) ప్రకారం ఎవరైనా ఆరు నెలల కాలానికి శిక్షించబడితే, ఆ వ్యక్తి అనర్హుడవుతాడు. ఆ అనర్హత జైలు నుంచి విడుదలైన తర్వాత ఆరు సంవత్సరాల వరకు కొనసాగుతుంది. సెక్షన్ 9 నుండి 10 ఎ వరకు ఉన్న ఇతర నిబంధనలు ఎన్నికలలో అవినీతి వంటి ఇతర అనర్హతలను తెలియజేస్తాయి.

సెక్షన్ 8(3): సెక్షన్ (1) లేదా సెక్షన్ (2) లో పేర్కొనబడిన నేరాలు కాకుండా, ఏ నేరంలో అయినా శిక్షించబడి, రెండు సంవత్సరాల కంటే తక్కువ కాని కాలానికి జైలు శిక్ష విధించబడిన వ్యక్తి ఆ శిక్ష విధించబడిన తేదీ నుండి అనర్హుడవుతాడు. అతడు విడుదలైన తర్వాత, ఆ అనర్హత ఆరు సంవత్సరాల పాటు కొనసాగుతుంది.

సెక్షన్ 8(4): సెక్షన్ (1), సెక్షన్ (2), సెక్షన్ (3) లోని ఏ నిబంధన ఉన్నప్పటికీ, శిక్ష విధించబడిన తేదీ నాటికి పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో సభ్యుడిగా ఉన్న వ్యక్తి విషయంలో ఆ అనర్హత మూడు నెలలు గడిచిన తర్వాతే అమలులోకి వస్తుంది. లేదా ఆ కాలంలో అప్పీల్ లేదా రివిజన్ కోసం దరఖాస్తు చేస్తే, ఆ అప్పీల్ లేదా దరఖాస్తును కోర్టు పరిష్కరించే వరకు అనర్హత అమలులోకి రాదు.


పైన పేర్కొన్న నిబంధన సారాంశం ఏమిటంటే, ఒక వ్యక్తిపై దర్యాప్తు, న్యాయస్థానం ముందు విచారణ, న్యాయాధికారి ఇచ్చిన తీర్పు, ఒక నిర్దిష్ట కాలానికి శిక్ష విధించిన తర్వాతే అనర్హత ప్రారంభమవుతుంది.

దీని అర్థం, ఒక వ్యక్తి శిక్ష విధించబడిన తర్వాత కూడా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి, శిక్షపై స్టే లేదా సస్పెన్షన్ పొందితే, అతను ఎన్నికైన పదవిలో పూర్తి కాలం కొనసాగవచ్చు.

అయితే, ఒకవేళ ఉన్నత న్యాయస్థానాలు శిక్షపై స్టే ఇస్తే లేదా శిక్షను సస్పెండ్ చేస్తే అనర్హత అమలులోకి రాదు. గుజరాత్ కోర్టులో శిక్ష విధించబడిన తర్వాత అనర్హుడైన రాహుల్ గాంధీ, శిక్షపై స్టే లభించిన తర్వాత తన స్థానాన్ని ఈ విధంగానే తిరిగి పొందగలిగారు.

కానీ, లిల్లీ థామస్ కేసులోని తీర్పు ప్రాముఖ్యత ఏమిటంటే, పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో ఎన్నికైన సభ్యుడి (మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రితో సహా) అనర్హతపై చట్టం చేయాలనుకున్నా, అది రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులను దాటకూడదు.

కనీసం అలాంటి శిక్షలలో అయినా పోలీసుల దర్యాప్తు మాత్రమే కాకుండా, న్యాయాధికారి విచారణ, వ్యక్తిని దోషిగా నిర్ధారించే తుది తీర్పు




కూడా ఉన్నాయి. ఇది కేవలం శిక్షతో ఆగదు, జైలు శిక్షతో కూడా ఉంటుంది. ఒక వ్యక్తిని నేరస్థుడిగా నిర్ధారించిన తర్వాతే, న్యాయాధికారి శిక్ష గురించి నిర్ణయిస్తారు. అయితే, నిందితుడికి సందేహ లబ్ధి ఎక్కువగా లభిస్తుంది.

న్యాయస్థానం శిక్ష విధించిన తర్వాతే సభ సభ్యుడికి అనర్హత అంశం ముందుకు వస్తుంది. అంతే తప్ప ఒక స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఒక వ్యక్తిని అరెస్టు చేసి, పోలీస్ కస్టడీలో ఉంచి, ఆ తర్వాత సెషన్స్ కోర్టు విచారించదగిన నేరం కాబట్టి, రిమాండ్ మేజిస్ట్రేట్ ఆ వ్యక్తిని పదిహేను రోజులకు మించకుండా జ్యుడీషియల్ కస్టడీలో ఉంచే సమయంలో కాదు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సారాంశం ఏమిటంటే, ఒక వ్యక్తికి ఏదైనా కారణం చేత బెయిల్ లభించకపోయినా, రిమాండ్ మేజిస్ట్రేట్ (విచారణ న్యాయమూర్తి కాకుండా) మరో పదిహేను రోజులు కస్టడీని పొడిగిస్తే,ఆ వ్యక్తి తన మంత్రి పదవిని కోల్పోతాడు.

ఈ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి హోం మంత్రి లక్ష్యంగా పెట్టుకున్న న్యాయ శాస్త్రం ఏమిటి? నిజంగా కోరుకుంటున్నది ఎన్నికల సంస్కరణేనా? అని మనం తీవ్రంగా ప్రశ్నించాలి.

నైతిక సమస్యలు కాకుండా, ప్రతిపాదిత బిల్లులోని నిబంధన రాజ్యాంగ బద్ధతను కూడా పరిశీలించాలి. ఒక వ్యక్తిని కార్యనిర్వాహక ఆదేశం ద్వారా, న్యాయాధికారి విచారణ, శిక్ష లేకుండానే నిర్బంధిస్తే, కేవలం 30 రోజులు జైలులో ఉన్నాడనే కారణంతో అనర్హుడిగా ప్రకటించడానికి ఏదైనా చట్ట నియమం ఉందా?

జాతీయ అత్యయిక స్థితి తర్వాత, కాంగ్రెస్ ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత, మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా కొత్తగా ఏర్పడిన జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జార్జ్ ఫెర్నాండెజ్‌ను పరిశ్రమల మంత్రిగా నియమించాలని భావించినప్పుడు, ఆయనపై బరోడా డైనమైట్ కేసు పెండింగ్‌లో ఉన్నందున అభ్యంతరం వ్యక్తమైంది.

ఒక తీవ్రమైన క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండగా ఆయనను మంత్రిగా నియమించడంపై ప్రశ్నిస్తూ దినపత్రికల సంపాదకులకు చాలామంది లేఖలు రాశారు. సి.జి.కె.రెడ్డి 'ది హిందూ'లో మై ఫుట్, రూల్ ఆఫ్ లా అంటూ ఒక సంపాదకీయం రాశారు. ఆ లేఖలు రాసిన వారిని రెడ్డి విమర్శిస్తూ, అత్యయిక స్థితిలో వేలాది మంది నిర్బంధంలో ఉన్నప్పుడు, చట్ట నియమం రద్దు చేయబడినప్పుడు వారు, వారి పెన్నులు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు.

'మరక అంటిన' మంత్రుల గురించి, ఎన్నికల అనర్హతలపై గతంలో చేసిన సిఫార్సులను మనం చూడాలి.

జస్టిస్ ఎ.పి.షా నేతృత్వంలోని లా కమిషన్ తన 244వ నివేదికలో, నేర



విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తులను అనర్హులుగా ప్రకటించే అంశాన్ని ప్రస్తావించింది. పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేసే దశలో అనర్హతకు గురి చేయవచ్చనే ప్రతిపాదనను అది పూర్తిగా తిరస్కరించింది. ఎందుకంటే ఆ దశలో నిందితుడి నేరంపై న్యాయస్థానం ప్రాథమిక నిర్ధారణ జరగదని పేర్కొంది. అంతేకాకుండా, తుది నివేదిక దాఖలు చేసే సమయంలో, సమర్పించిన విషయాలపై సాధికార న్యాయస్థానం తన అభిప్రాయాన్ని ఏర్పరుచుకోలేదని పేర్కొంది.

ఒక వ్యక్తికి చూడటానికి లేదా తెలుసుకోవడానికి అవకాశం లేని దాని ఆధారంగా అనర్హుడిగా ప్రకటించడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకమని కూడా పేర్కొంది. ఇది అనర్హత ప్రశ్నపై న్యాయపరమైన నిర్ధారణ అధికారాన్ని, కేసును విచారించే అధికారం కలిగిన పోలీసులకు అప్పగించడమే అవుతుందని కూడా తెలిపింది.

ఛార్జిషీటును ఒక అనర్హత కారకంగా పరిగణించవచ్చని లా కమిషన్ సూచించింది. భారతదేశంలో రాజకీయ నాయకులలో నేర ప్రవృత్తిపై ఆందోళన ఉన్నందున, దుర్వినియోగాన్ని నివారించడానికి చట్టపరమైన రక్షణలు ఉన్నంత వరకు ఛార్జిషీటు దశలోనే అనర్హత సమర్థనీయమని కూడా అభిప్రాయపడింది.

ప్రతిపాదిత(అమిత్ షా) బిల్లు, పోలీసులకు అనర్హత అధికారాన్ని ఇవ్వడం ద్వారా లా కమిషన్ నివేదికను పూర్తిగా నిరాకరిస్తున్నది.

బ్రిటిష్ కాలం నుండి అధికార పార్టీలు అనేక రాజ్యాంగ పదవుల కోసం 'ప్లెజర్ డాక్ట్రిన్' (సుప్రీంకోర్టు దీనిని 'హెన్రీ VIII క్లాజ్' అని పేర్కొంది) ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఇది ఒక ప్రత్యేక సందర్భంలో వర్తింపజేయబడినప్పటికీ, సాధారణంగా ఒక ప్రభుత్వ ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేసి 48 గంటల కంటే ఎక్కువ కస్టడీలో ఉంచితే వెన్వెంటనే(ఆటోమెటిక్‌గా) సస్పెండ్ చేయబడతాడు. అయితే, ప్రభుత్వ ఉద్యోగులకు ఒక రక్షణ ఉంది. క్రిమినల్ విచారణలో తదుపరి కార్యకలాపాల కోసం వేచి ఉండకుండా, సస్పెన్షన్‌ను రద్దు చేయడానికి వారు అప్పీలు, పునఃపరిశీలన అధికారులకు అప్పీల్ చేయవచ్చు.

నిజానికి, సాధికార అధికారికి సస్పెన్షన్‌ను రద్దు చేసే అధికారం ఎల్లప్పుడూ ఉంటుంది. ఇంకా, సస్పెన్షన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు, ఒక ప్రభుత్వ ఉద్యోగి జీవనం కోసం ఒక నిర్దిష్ట భత్యం పొందడానికి అర్హుడు. క్రిమినల్ విచారణలు అతనికి అనుకూలంగా ముగిసినప్పుడు, అతను ఉద్యోగం తిరిగి పొందడం, సర్వీస్ కొనసాగింపు, పాత వేతనాలు మొత్తం వంటివి పొందేందుకు అర్హుడు. కొన్నిసార్లు, అతను కోల్పోయిన పదోన్నతి కూడా తిరిగి లభిస్తుంది.

కానీ కొత్త బిల్లు అమలులోకి వస్తే, ఒక మంత్రిని అతనిని నామినేట్ చేసిన అధికార పార్టీ ప్రమేయం లేకుండానే మంత్రివర్గం నుంచి బయటకు పంపించవచ్చు. ఇంకా, క్రిమినల్ కేసులో నిర్దోషిగా తేలితే, ఆ వ్యక్తిని తిరిగి ఆ పదవిలో నియమిస్తారనే గ్యారంటీ లేదు.


అంతేకాకుండా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) వంటి కొన్ని చట్టాలలో, ఒక సంవత్సరంలోపు బెయిల్ పొందాలంటే, అతనిపై ప్రాథమిక కేసు లేదని నిరూపించుకోవాలి. భీమాకోరెగావ్ కేసు వంటి అనుభవాలు ఒక పార్లమెంటు సభ్యుడి పదవీ కాలం ఐదు సంవత్సరాలు అయినప్పటికీ, ఐదు సంవత్సరాల తర్వాత కూడా బెయిల్ పొందడం ఒక కష్టమైన పని అని మనకు నిరూపించాయి.

కొత్త బిల్లు ప్రధానమంత్రి పదవిని కూడా జవాబుదారీగా చేస్తుందని చెబుతున్నారు. దీనిని అధికార పార్టీ నిజాయితీని చాటుకోవడానికి ఒక మార్గంగా చూపిస్తున్నారు. ఇది చాలా స్పష్టంగా ఒక కంటి తుడుపు చర్య. ప్రధానమంత్రికి సిబిఐ, ఇడి వంటి దర్యాప్తు సంస్థలపై పూర్తి అధికారం ఉన్నప్పుడు, సిట్టింగ్ ప్రధానమంత్రిపై ఆ సంస్థలు ఎప్పుడైనా కేసు దాఖలు చేస్తాయని ఆశించడం ఆచరణ సాధ్యమా? దురదృష్టవశాత్తు భారతదేశంలో రాష్ట్రపతి ఒక రబ్బర్ స్టాంప్ వ్యవస్థగా ఉన్నారని కొందరు వ్యాఖ్యాతలు అంటుంటారు. అలాంటి సందర్భంలో, మంత్రి మండలి (ప్రధానమంత్రి అధినేతగా ఉండగా) సలహాపై ప్రాసిక్యూషన్ కోసం అనుమతి ఇవ్వడానికి రాష్ట్రపతికి సమర్థవంతమైన అధికారం ఉంటుందని ఆశించడం కూడా అసాధ్యం.

అయితే, ఈ సవరణ ప్రతిపాదనతో అధికార పార్టీ నిజమైన ఉద్దేశ్యం ఏమిటి? ఒక సంభావ్య అంచనా ఏమిటంటే, చాలా కాలంగా, ఈ ప్రభుత్వం (రాజ్యాంగ మౌలిక స్వభావ సిద్ధాంతాన్ని 7:6 స్వల్ప మెజారిటీతో వెలువరించిన) కేశవానంద భారతి తీర్పులో చిక్కుకుని ఉంది. ఈ తీర్పును పునఃపరిశీలన చేయాలని ఈ ప్రభుత్వం కోరుకుంటోందని అనేక సంకేతాలు సూచించాయి. ఒకవేళ అలాంటి సవరణ బిల్లు సుప్రీంకోర్టుకు చేరితే, బహుశా దశాబ్దాలలో మొదటిసారిగా మౌలిక స్వభావంలో 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' భాగమేనా అనే దానిపై చర్చను ప్రేరేపించడమే ఈ ప్రభుత్వం న్యాయస్థానంలో నొక్కి చెప్పే అంశం కావచ్చు.

ఈ ప్రమాదకరమైన బిల్లు చట్టంగా మారిన రోజున, దాని పదునుకు బలైనవారిని చరిత్ర తప్పక నిర్దోషులుగా ప్రకటించాలి. ఎందుకంటే కోర్టు లేదా రాజ్యాంగం అలా చెప్పగలవు అని మనం ఇకపై అంత గట్టిగా చెప్పలేము.

(లీఫ్‌లెట్ సౌజన్యంతో (ఐపిఎ సర్వీస్)




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21–25 సెప్టెంబర్, 1925

చండీఘడ్ (పంజాబ్)

## సిపిఐ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు

భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ఉజ్వల ప్రస్థానంలో ఎందరో ప్రసిద్ధులు దాని చైర్మన్‌లు, ప్రధాన కార్యదర్శులుగా త్యాగపూరితమైన సేవలు అందించారు. సిపిఐ 25వ కాంగ్రెస్, శతవార్షికోత్సవం (డిసెంబర్ 25) సందర్భంలో వారిని సూక్ష్మంగా స్మరించుకుందాం.

### ఎం.సింగారవేలు,

**సిపిఐ తొలి చైర్మన్**



ఒక రకంగా చూస్తే ఎం.సింగారవేలు చెట్టియార్ సిపిఐ తొలిచైర్మన్. 1925 డిసెంబర్ 25–29 తేదీల్లో కాన్పూర్‌లో సిపిఐ వ్యవస్థాపన మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. అప్పటి పార్టీ నిబంధనావళి ప్రకారం, మహాసభ చైర్మన్ సిఇసి (కేంద్ర కార్యవర్గం)కి, పార్టీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. దక్షిణ భారత్‌లో తొలి కమ్యూనిస్టుగా సింగారవేలు ప్రసిద్ధులు. ఆయన తమ ప్రారంభోపన్యాసంలో సోషలిజం, కమ్యూనిజం ప్రాథమిక సూత్రాలను, అలాగే సిపిఐ ధ్యేయాలు, లక్ష్యాలను వివరించారు.

సింగారవేలు 1860 ఫిబ్రవరి 18న మద్రాసులో జన్మించారు. మద్రాసు యూనివర్శిటీ నుంచి ఎఫ్ఎ, బి.ఎ. ఉత్తీర్ణత పొందారు. మద్రాసు హైకోర్టులో ప్రముఖ లాయర్‌గా పేరొందారు. 1902లో వ్యాపార పనుల మీద లండన్ వెళ్లారు. అక్కడ ప్రపంచ బౌద్ధుల మహాసభలో పాల్గొన్నారు. సింగారవేలు ప్రసిద్ధ సంఘ సంస్కర్త. తమిళుల ఆత్మగౌరవ ఉద్యమంలో, సోషలిస్టు ఆత్మగౌరవ ఉద్యమంలో భాగస్వామి అయినారు.

కాంగ్రెస్ నాయకులతో సంబంధాలు ఏర్పడ్డాయి. సుప్రసిద్ధ కవి సుబ్రమణ్య భారతి, కార్మిక నాయకుడు వి.చక్కరాయి చెట్టియార్, విఒ. చిదంబరం పిళ్ళే(విఒసి) తదితరులు ఆ నాయకుల్లో ఉన్నారు.

జౌళి, రైల్వే కార్మికుల ఉద్యమంలో పాల్గొన్నారు. మద్రాసు లేబర్ యూనియన్ ఏర్పాటులో, ఎంఎస్ఎం వర్కర్స్, ఎలక్ట్రిసిటీ, ట్రాంవే, పెట్రోలియం, ప్రింటింగ్, అల్యూమినియం, కోయంబత్తూరు వర్కర్స్, మధురై వర్కర్స్ వగైరా యూనియన్‌ల నిర్మాణంలో సహాయపడ్డారు.

1922లో కాంగ్రెస్ గయ (బీహార్) సభకు హాజరైనారు. అక్కడ ఎస్.ఎ.డాంగ్‌ను కలుసుకున్నారు. ఆయన చొరవతో భారతదేశంలో 1923లో తొలిసారి మే దినోత్సవం పాటించబడింది. మద్రాసు బీచ్‌లో జరిగిన రెండు సమావేశాల్లో ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సమావేశాల్లో లేబర్ కిసాన్ పార్టీ ఏర్పాటును ప్రకటించారు.

కాన్పూర్ కుట్ర కేసు (1924–28)లో అరెస్టు అయినారు.

కమ్యూనిస్టుపార్టీ నిర్మాణానికై దక్షిణ భారత్ వచ్చిన అమీర్ హైదర్ ఖాన్ మార్గదర్శకంలో 1932లో మద్రాసులో కమ్యూనిస్టు గ్రూపు ఏర్పడింది. దానిపేరు లేబర్ ప్రొటెక్షన్ లీగ్. దాన్ని కమ్యూనిస్టు పార్టీ సెంటర్ అని కూడా అనేవారు.

ఎస్.ఎ.డాంగే 1936 నవంబర్‌లో 'ఆత్మగౌరవ సోషలిస్టు మహాసభ' నిమిత్తం మద్రాసు వచ్చారు. ఆ సమావేశం నిర్వాహకుల్లో సింగారవేలు ప్రముఖులు. సిఎస్‌పి (కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ)లో ఎస్.వి.ఘాటేతో సింగారవేలు సహకరించారు. 1936లో మద్రాసు వచ్చిన ఎం.ఎన్.రాయ్ సింగారవేలు ఇంట్లో ఉన్నారు. సోషలిజం భావాలు వ్యాప్తిచేసిన 'జనశక్తి' పత్రికలో సింగారవేలు పనిచేశారు. మీరట్ కుట్ర కేసులో కూడా ఆయన నిందితుడు. అయితే అనారోగ్యం కారణంగా అరెస్టు చేయలేదు.

ఎం.సింగారవేలు 1946 ఫిబ్రవరి 11న మరణించారు.

### ఎస్.వి.ఘాటే

సిపిఐ తొలి ప్రధానకార్యదర్శి



ఎస్.వి.ఘాటే 1894 డిసెంబర్ 14న మంగళూరులో జన్మించారు. బొంబాయిలో బి.కాం చదివారు. ఎస్.ఎ.డాంగే నడుపుతున్న 'సోషలిస్టు' వారపత్రికతో ఏర్పడిన సంబంధంతో ఆయన కమ్యూనిస్టు అయినారు. వారిద్దరూ బాంబాయి కాంగ్రెస్‌లో పనిచేస్తూ రాడికల్ గ్రూపు ఏర్పాటు చేశారు. జోగ్లేకార్, మిరాజ్‌కార్, నింబ్‌కార్ తదితరులతో క్రియాశీలంగా పనిచేసిన ఈ గ్రూపు బొంబాయిలో, ఇతరచోట్ల కార్మికోద్యమాన్ని గాఢంగా ప్రభావితం చేసింది.

సిపిఐ పాత నిబంధనావళి ప్రకారం (ముగ్గురు ప్రధాన కార్యదర్శులకు అవకాశం ఉంది), పార్టీ వ్యవస్థాపన మహాసభలో ఎన్నుకోబడిన ఇరువురు ప్రధాన కార్యదర్శుల్లో ఘాటే ఒకరు. రెండవ ప్రధాన కార్యదర్శి జెపి బగేర్‌హట్ట. 1927లో బొంబాయిలో జరిగిన సిఇసి విస్తృత సమావేశంలో ఘాటే ఒక్కరే ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినారు. కాబట్టి ఆయన పార్టీ తొలి ప్రధాన కార్యదర్శి. గిర్నీ కాంగార్ యూనియన్ (జికెయు)లో, వర్కర్స్ అండ్ పెజెంట్ పార్టీ (డబ్ల్యుపిపి)లో ప్రముఖ నాయకుడిగా పనిచేశారు. మీరట్ కుట్ర కేసు (1929)లో అరెస్టు అయినారు. మద్రాసు ప్రెసిడెన్సీలో కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. 1943లో సిపిఐ ప్రథమ కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. దియోలీ క్యాంప్‌లో, వెల్లూరు జైల్లో నిర్బంధం అనుభవించారు. ప్రసిద్ధ "త్రీ పి"ల లేఖను రూపొందించిన డాంగే, అజయ్‌ఘోష్‌లతో ఘాటే ఉన్నారు.

పార్టీ కేంద్ర కంట్రోలు కమిషన్‌లో, సిపిఐ కోశాధికారిగా, సిఇసి సభ్యునిగా పనిచేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్ నిర్మాణ బాధ్యతలు నిర్వర్తించారు. 1970 నవంబర్ 28న న్యూఢిల్లీలో అసువులు బాశారు.

### డాక్టర్ జి.అధికారి

**శాస్త్రవేత్త – కమ్యూనిస్టు**



గంగాధర్ మోరేశ్వర్ అధికారి 1898 డిసెంబర్ 8న బొంబాయి సమీపంలోని పన్వేర్‌లో జన్మించారు. విల్సన్ కాలేజి, బొంబాయిలో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరులో విద్య నభ్యసించారు. IIఎస్‌సిలో రీసెర్చి స్కాలర్‌గా చేరారు. జర్మన్ భాష కూడా నేర్చుకున్నారు. జర్మనీలోని హంబోల్టెట్ యూనివర్శిటీనుండి ఫిజికల్ కెమిస్ట్రీలో డాక్టరేట్ పొందారు. ఐన్‌స్టీన్‌ను కలుసుకున్నారు, ఆయన ఉపన్యాసాలకు హాజరైనారు, ఆయన సంస్థలో పనిచేశారు.

జర్మనీ, ఇంగ్లండ్‌లలో వీరేంద్రనాథ్ చట్టోపాధ్యాయ, ఇతర విప్లవకారులను, కమ్యూనిస్టులను డాక్టర్ అధికారి కలుసుకున్నారు. 1928లో జర్మన్ కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించారు. సిపిజి ప్రధాన కార్యదర్శి ఎర్నెస్ట్ థేల్మాన్ సమావేశాలకు హాజరైనారు.

1928లో స్వదేశం తిరిగివచ్చిన డాక్టర్ అధికారి బొంబాయిలో డాంగే, తదితరులతో జికెయంలో, డబ్ల్యుపిపిలో పనిచేశారు. మీరట్ కుట్ర కేసులో అరెస్టు అయినారు. సిపిఐలో చేరారు. అధికారి విడుదలకు ఐన్‌స్టీన్ విజ్ఞప్తి చేశారు.

రహస్యంగా పనిచేస్తున్న సిపిఐ కేంద్ర కమిటీలో సభ్యునిగా ఉన్నారు. 1933లో సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జైలునుంచి తప్పించుకున్నారు. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. సుభాష్ చంద్రబోస్ దేశం నుండి రహస్యంగా తప్పించుకోవటానికి అధికారి తోడ్పడ్డారు. పార్టీ అనుసరించిన బిటిఆర్ లైనుకు బాధ్యత వహించారు.

1953–54లో మదురై పార్టీ కాంగ్రెస్‌లో, ఆ తదుపరి 1956లో పాల్ఘాట్ కాంగ్రెస్‌లో కేంద్రకమిటీకి ఎన్నుకోబడ్డారు. 1958లో అమృత్‌సర్ పార్టీ కాంగ్రెస్‌లో పార్టీ కాన్‌స్టిట్యూషన్ (నిబంధనావళి)పై నివేదిక ఇచ్చారు. ఎన్‌సికి, సిఇసికి ఎన్నికైనారు. 1964లో పార్టీలో చీలిక తర్వాత కార్యదర్శివర్గ సభ్యునిగా కూడా పనిచేశారు. సిపిఐ చరిత్రను కూర్చే బాధ్యత చేబట్టారు. ఐదు సంపుటాలు ఎడిట్ చేశారు. 1981 నవంబర్ 21న గుండెపోటుతో మరణించారు.

## తుది ఓటర్ల జాబితా విడుదల



**ప్రజాపక్షం/మద్దూర్/కొత్తపల్లి :** ఉమ్మడి మద్దూర్ మండలంలో గ్రామ పంచాయతిల వార్డ్ల వారిగా తుది ఓటర్ల జాబితాను మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎంపిడివోలు రహమతుద్దిన్, కృష్ణారావులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో రహమతుద్దిన్ మాట్లాడుతూ మద్దూర్ మండలంలో మొత్తం 26,370 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 12,900 మంది పురుషులు ,13,470 మంది మహిళలు ఉన్నారని చెప్పారు. 206 వార్డుల జాబితాలు ప్రచురించారు. అలాగే కొత్తపల్లి ఎంపిడివో కృష్ణారావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతిలకు గాను 130 పోలింగ్ స్టేషన్లలో 8159 పురుష ఓటర్లు ,8600 మహిళ ఓటర్లు ,ఒకరు థర్డ్ జెండర్ ఓటర్ ఉన్నారని అన్నారు. మొత్తం కలిపి 16,760 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌సిసి యూనిట్‌కు బీరువా వితరణ




**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని బాలుర పాఠశాల, ఎన్‌సిసి యూనిట్‌కు విశ్రాంత ఉపాధ్యాయిని అరుణ టీచర్ బీరువాను ప్రదానం చేశారు. ఎన్‌సిసి విద్యార్థులు మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులకు అవసరమైన బీరువా వితరణ చేసిన అరుణ టీచర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కేర్ ఆఫీసర్ లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులకు ఎన్‌సిసి వలన ఎలాంటి ప్రయోజనాలున్నాయో లక్ష్మ ణ్ తెలిపారు. అలాగే ఎన్‌సిసి యూనిట్‌కు బీరువాను బహూకరించిన అరుణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి సిబ్బంది ఎన్‌సిసి క్యాడెట్స్ కేర్ ఆఫీసర్ లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.



## బాంబు స్క్వాడ్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/ మద్దూర్:** మద్దూర్ పట్టణ కేంద్రంతో పాటు రేనివట్ల, నిడ్జింత గ్రామాలలో బాంబు స్క్వాడ్ బృందంతో పాటు డాగ్ స్క్వాడ్ పోలీసులు గణేష్ ఉత్సవాలలో ఉమ్మడి మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా గణేష్ మండపాల దగ్గర, ప్రార్థన మందిరాల వద్ద, ప్రధాన చౌరస్తాలలో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా అనుమానాస్పదంగా లేదా రెండు మూడు రోజులు ఒకేచోట వాహనాల నిలిపి ఉంచిన బ్యాగులు కనపడిన, ఎవరైన అనుమానస్పదంగా సంచరించిన అట్టి సమాచారం ఇవ్వాలని లేదా 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

## భాషా పండితుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** విద్యార్థులను మలచడంలో భాషా పండితుల పాత్ర చాలా కీలకమైనదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల భాషా పండితులకు మహబూబ్‌నగర్ ఫస్ట్ వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నప్పటి నుంచి అన్ని ల్యాంగ్వేజెస్‌లో మెరుగ్గా రాణించడానికి భాషా పండితులు నాకు సహకరించారని అందువల్లనే నేను ఈరోజు ఏ వేదిక మీదైనా అనర్గళంగా మాట్లాడగలనంటే అది మా భాషా పండితుల ఆశీర్వాదమే అని ఆయన చెప్పారు. మ్యాథ్స్, సైన్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో పట్టు సాధించేందుకు ల్యాంగ్వేజేస్ ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడుతూ బడుగుల జీవితాల్లో వెలుగులు నింపాలనుకున్న ఏకైక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అని, తలరాతను తరతరాలు మార్చాలనుకునే సంకల్పం ఎమ్మెల్యేని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, సిఎంఓ, బాలు యాదవ్, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఎంఇఓ తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలన ప్రక్రియ వేగవంతం

**ప్రజాపక్షం/అమరచింత :** ప్రజలకు మెరుగైన సేవలు అందించి , పరిపాలన ప్రక్రియలను వేగవంతం చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ మండల రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మంగళవారం అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను అదనపు జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్ రికార్డుల జాప్యానికి అధికారులపై ఆయన మండిపడ్డారు. భూ రికార్డుల కోసం ఎదురు చూస్తున్న పౌరుల ఆవశ్యకతలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అన్నిటిని తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాన్ని ఇబ్బందులు కలగకుండా పాదరక్షకమైన పరిపాలన అందించాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల సమీక్షతో పాటు రాష్ట్రంలోని ముఖ్యమైన సంక్షేమ పథకాలైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను కూడా అదనపు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమరచింత తహసీల్దార్ రవికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

**ప్రజాపక్షం/అడ్డాకుల:** దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండల కేంద్రంలో పంచాయితీరాజ్ , మున్సిపల్ చట్టల్లో సవరణ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, బిల్లులను ఉభయ సభలు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరి ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించడం జరిగింది. అనంతరం బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ శ్రీహరి మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ నమ్మకం అంటే కాంగ్రెస్ అంటే నమ్మకమని పంచాయితీ రాజ్ చట్ట సవరణ, బీసీ బిల్లు ఆమోదం సందర్భంగా అది మరోసారి నిరూపితమైందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285ఎ ని సవరించి, అసెంబ్లీ మండలంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా అడ్డాకుల మండల ప్రజల తరపున హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్ రెడ్డి సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత ఈ ప్రాంత అభివృద్ధి కోసం దివంగత మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలు, భావజాలం, కోసం అధికారంలో ఉన్నా లేకున్నా జగదీశ్వర్‌రెడ్డి పనిచేశారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచి రాష్ట్ర, జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతంలో సాగు, తాగు నీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం పార్టీకి చెందిన ఇతర నాయకులతో కలిసి కొల్లాపూరు నుంచి నారాయణపేట, అల్లంపూరు నుంచి హైదరాబాద్ ఈనెల 4న జిల్లా కేంద్రం, పద్మావతి కాలనీలోని గ్రీన్ బెల్టులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణరావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సంజీవ్ ముదిరాజు, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు, వినోద్‌కుమార్, చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, సిరాజ్ ఖాద్రి, రాజేందర్ రెడ్డి, గోపాల్ యాదవ్, జహీర్‌అఖ్తర్, లింగం నాయక్, అజ్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ కు సంబంధించిన బీటీ, మట్టి రోడ్లను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్డిఓ ఆఫీస్, పాత బస్టాండ్ మీదుగా పళ్ళా బ్రిడ్జ్, ఎంబీ చర్చి ఆర్ అండ్ బి రోడ్డు ను చూశారు. అటు నుంచి ఎక్లాస్ పూర్ మార్గంలోని లోకపల్లి లక్ష్మ మ్మ గుడికి వెళ్ళే మట్టి రోడ్డును పరిశీలించారు. ఇటివలే లోకపల్లి లక్ష్మ మ్మ జాతరకు ముందు ఆ రహదారిని మట్టి వేసి చదును చేయగా వారం క్రితం కురిసిన వర్గాలకు ఆ మట్టి రహదారి కొంచెం దెబ్బతిన్నదని, పై నుంచి వచ్చే వాన మీరు రహదారి పైకి చేరకుండా చిన్న కల్వర్టు మాదిరిగా పైపులు వేయాలంటే రహదారి పక్కన ఉన్న వెంచర్ యజమాన్ని నిరాకరిస్తున్నాడని పీఆర్‌ఈఈ హీర్యా నాయక్ కలెక్టర్ కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. జాతరకు ఎంత మంది భక్తులు వస్తారని ప్రశ్నించగా దాదాపు 50 నుంచి 60 వేల మంది వస్తారని లోకపల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇటీవలే జాతర జరిగిందని వారు చెప్పారు. అనంతరం కలెక్టర్ ఉట్కూరు మండలం వల్లంపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రహదారిని పరిశీలించారు. ఇటీవలే ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాన నీరు కల్వర్టు పైకి చేరి రాకపోకలు నిలిచి పోయాయని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్॥ చిట్టెం పర్ణికా రెడ్డి చొరవతో అవతలి వైపు నుంచి తాత్కాలిక దారిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆ కాలనీ వాసులు కలెక్టర్‌కు తెలిపారు. అయితే కల్వర్టు కింద నుంచి వాన నీరు ముందుకు పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్ళ పొదలు నన్నాయిని వాటిని తొలగింపజేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కల్వర్టు ఎత్తు పెంచి నిర్మించేందుకు ప్రతిపాదిస్తామని కాలనీ వాసులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ ఆర్ అండ్, బి, పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖ అధికారులతో విపత్తు నిర్వహణ నిధుల వినియోగం పై కలెక్టర్ చర్చించారు. విపత్తు నిర్వహణ నిధులకు సంబంధించి రోడ్లు, కల్వర్టులు, తెగిన చెరువులు, కుంటల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ. ఈ. వెంకటరమణ, డీఈ రాములు, నీటిపారుదల శాఖ ఈఈ బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, పి.ఆర్. ఆర్ అండ్ బి ఏ ఈ లు పాల్గొన్నారు.

## దళితులు ప్రతిఘటన ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** దళితులు ప్రతిఘటన ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మ ణాచారిభవనంలో దళితహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వస్తున్నటువంటి దళితవాయిస్ మాసపత్రికను విడుదల కార్యక్రమంలో ఎం.బాల్‌నర్సింహ్మా ముఖ్య అతిథిగా పాల్గొని స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటిన నేటికి దేశంలో దళితులపై దాడులు, కులవివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగుతున్నాయని దళితులపై జరుగుతున్న దాడులపై తక్షణమే ప్రతిఘటన పోరాటాలు ప్రారంభించాలని అన్నారు. దేశంలో సమానత్వం, సామాజిక హోదా, ఆత్మగౌరవం పొందాలంటే దళితులు వాటిని పోరాటాల ద్వారానే సాధించుకోవాలని ఎవరోవాటిని మనకు ఇస్తారనే భ్రమలను మానుకోవాలన్నారు. సామాజిక కవి ఎదిరేపల్లి కాశన్న మాట్లాడుతూ దళితవాయిస్ మానపత్రికలో దళితులలో సామాజిక చైతన్యం తీసుకువచ్చే విధంగా ఉండాలని దళిత ఉద్యమాలకు ఈపత్రిక ఒక దిక్సూచిగా మారాలని అన్నారు. కార్యక్రమంలో దళితహక్కుల పోరాటసమితి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ముభరత్, బండిలక్ష్మి పతి, బిఎంపి పార్టీ జిల్లా నాయకులు గడ్డంవిజయ్, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు చిన్న పొగశ్రీను, శివకృష్ణ, శివశంకర్, రాము, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే కవిత రోడ్డెక్కింది




బీఆర్‌ఎస్ నేతల తీరుపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** తనకు రావాల్సిన కమీషన్లు రాలేదని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రోడ్డు ఎక్కుతుంటే, సీబీఐ ఎంక్వైరీ జరిగితే తమ నాయకుడు చేసిన తప్పులు బయటపడతాయని బిఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం అవినీతి పంచాయితీ ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతల ఇంటి పంచాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక టీఎంసీ సామర్థ్యం పెంచే పేరుతో ఉన్న నిధులన్నీ అక్కడికే తరలించేసారని, ఇది తప్పని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిఆర్‌ఎస్ నాయకులు అప్పుడే ధర్నా చేసి ఉంటే 32 వేల కోట్లతోనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఉండేదని చెప్పారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం అనిరుధ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించారని ప్రస్తావించారు. అయితే జరిగిన అవినీతిని నిగ్గు తేల్చాలని సీబీఐ విచారణకు ఆదేశిస్తే తమ కమిషన్ల భాగోతం బయటపడుతుందన్నారు.బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రంలో ఉన్న ఎనిమిది మంది బిజెపి ఎంపీలను పట్టుకుని మోదీ వద్దకు వెళ్లి తమకు క్లీన్ చిట్ కోసం పైరవీలు చేసుకోండి. తప్ప ఇలా రోడ్ల మీదికి వచ్చి కూర్చోవద్దని అనిరుధ్‌రెడ్డి హితవు చెప్పారు. కాగా ఉమ్మడి రాష్ట్రం విడిపోయినా కూడా దివంగతనేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను, ఆయన ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పటికీ ఇరు రాష్ట్రాల ప్రజలు గుర్తుంచుకున్నారని కితాబిచ్చారు. వైయస్సార్‌కు ఆయన ఘన నివాళులు అర్పించారు.

# యూరియా కొరతతో రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/వీపనగండ్ల:**మండలంలోని రైతులకు అవసరమైన యూరియా లభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల క్రితం వరకు రైతు అగ్రో సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల ద్వారా యూరియా విక్రయాలు కొనసాగినా, ప్రస్తుతం అక్కడ నిల్వలు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విత్తన సీజన్‌లో పంటలకు ఎరువు అవసరమైన ఈ సమయంలో యూరియా దొరకక రైతులు తూముకుంట రైతు సేవ సహకార సంఘం వద్ద వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. ప్రతి రోజు తెల్లవారుజామునే వచ్చి క్యూల్లో నిలబడుతూ యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. మంగళవారం ఉదయం సోసైటీకి 750 బస్తాల యూరియా చేరగా, మొదటగా శుక్రవారం సోసైటీ వద్దకు వచ్చి పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ అందించిన రైతులకు మాత్మరే యూరియా అందించనున్నామని, తర్వాత మిగతా రైతులకు సరఫరా చేస్తామని సోసైటీ అధికారులు రైతులకు తేల్చి చెబుతున్నారు. అది కూడా ఎకరాకు ఒక ఏరియా బస్తా, 5 ఎకరాలకు మించి ఉన్న రైతులకు ఐదు బస్తాల యూరియా మాత్రమే అందిస్తామని సోసైటీ అధికారులు అంటున్నారు. యూరియా కొరతతో అందకపోతే పంట దిగుబడి ప్రభావితం అవుతుంది. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## స్మశానవాటికను పరిశీలించిన నాయకులు

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మండలంలోని దళితులు దళిత క్రైస్తువుల స్మశాన వాటికను మంగళవారం మండల బీజేపీ నాయకులు పరిశీలించారు. గత 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మూడెకరాల స్థలాన్ని దళితులు, దళిత క్రైస్తవుల సమాధుల కొరకు కేటాయించారు. ఈ స్థలం పూర్తిగా గుట్టలు, బండరాళ్లతో నిండి ఉంది. ఉన్న స్థలంలో సమాధులు పెట్టడానికి ఇబ్బందిగా ఉండటంతో వాళ్లు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఏదైనా పథకం కింద బండరాళ్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమ్ము భరత్ భూషణ్, బీజేపీ మండల అధ్యక్షులు చీర్ల నర్సింహ, శివశంకర్ రెడ్డి, రవికుమార్, పసుపుల రాజేష్, సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, పసుపుల బీసన్న, మాజీ ఎంపీటీసీ రమణ, పసుపుల అభి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి భరోసా



**ప్రజాపక్షం/కల్వకుర్తి రూరల్ :** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన లస్కర్‌శ్రీను ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న కాయితి ఆశాదీప్‌రెడ్డి మంగళవారం వారి కుటుంబానికి రూ.20వేల సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. లస్కర్‌శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బాలకృష్ణ, ఆనంద్, అశోక్, మల్లేష్‌గౌడ్, పాండు, జాంగిర్, జంగయ్య, కృష్ణయ్య, బాలస్వామి, ఆంజనేయులు, వెంకటయ్య, సుల్తాన్, జావిద్, శివ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన చేసి ప్రతి దరఖాస్తును శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చర్యలువేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గపరిధిలోని లింగాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. రైతు సదస్సులో వచ్చిన భూభారతి దరఖాస్తులను పరిశీలించారు. మండలంలో మొత్తం 652 దరఖాస్తులురాగా ఇప్పటివరకు కేవలం 82 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయని, మిగతా దరఖాస్తులు ఎందుకు పరిష్కారం కాలేదో అందుకుగల వివరాలను తహసీల్దార్‌తో అడిగి తెలుసుకున్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచినందుకు కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ చట్టం ద్వారా ప్రతి సామాన్య రైతులకు ప్రజలకు భూసమస్యల పరిష్కారంలో అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పండు నాయక్, డిటి కృష్ణాజి, ఆర్ఐ అనిల్, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

**ఇందిరమ్మ ఇంటిని త్వరగా నిర్మించుకునేలా అవగాహన కల్పించాలి :**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు త్వరగా, నాణ్యతతో ప్రభుత్వం రూపొందించిన నమూనాతో నిర్మించుకునేలా, ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని సందర్శింపచేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలకేంద్రంలో జరుగుతున్న ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, పనుల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ పండునాయక్, ఎంపిడిఓ ఇతర అధికారులు ఉన్నారు.

**గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

లింగాల మండల కేంద్రంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రులపట్ల నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. కేంద్రంలోని వైద్య సదుపాయాలను, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. నిత్యం వచ్చే గర్భిణీస్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రసవాలకు దగ్గర తేదిల్లో



ఉండే గర్భిణీలను కమ్యూనిటిహెల్త్ సెంటర్‌లో ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

**సిపిఓ భూపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం**

ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీవిరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. విధుల్లో చేరిన నాటినుంచి అహర్నిశలు కృషిచేసి ప్రజలకు సేవలందించే ప్రతి ఉద్యోగి కృషి అభినందనీయమని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి (సిపిఓ) ధ్యాప భూపాల్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయనచేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, సిపిఓ సుజాత, టిఎన్‌జివో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, డిఇఓ రమేష్‌కుమార్, అధికారులు విజయ్‌కుమార్, రాంలాల్ పాల్గొన్నారు.



## సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** నేడు మూసాపేట మండలం వేముల గ్రామంలో ఎస్.జి.డి.ఫార్మా కోజెంట్ టెక్నాలజీ రెండవ యూనిట్‌ను నేడు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్‌పి డి.జానకితో కలిసి పరిశీలించారు. హెలిపాడ్ ఏర్పాట్లు, మీటింగ్ ఏర్పాట్లు, సౌండ్ సిస్టం ఏర్పాట్లు ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశార. వైద్య ఆరోగ్య శాఖ అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంచాలని సూచించారు. హెలిపాడ్ ఏర్పాట్లు పై ఆర్‌బి అధికారులను సూచనలు చేశారు. ఎస్‌పి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డి, డిఎస్‌పి. వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** భారీ వర్షాలతో సతమతమవుతున్న అన్నదాతలు యూరియా కోసం రోడ్డెక్కి వెంటనే ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలకేంద్రంలోని బస్టాండు సమీపంలో ధర్నా చేపట్టారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు ఎరువుల దుకాణాలముందు పడిగాపులుకాసిన సకాలంలో యూరియాలేక పంటలుపూర్తిగా దెబ్బతిని దిగుబడులుకూడా వచ్చే అవకాశం లేదని రైతులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. ఒక పక్క భారీవర్షాలతో పంటలు పూర్తిగా నష్టపోవడంతో మరొపక్కవేరేదారిలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రోడ్డెక్కారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కె.శ్రీనివాస్ రైతులకు నచ్చజెప్పి దర్నా విరమింపచేసి ఎరువుల దుకాణదారులనుంచి కూపన్లు అందించినట్లు తెలిపింది.

## పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఓ సందర్శన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రఘుపతిపేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం డిఎంహెచ్‌ఓ రవికుమార్ సందర్శించారు. సిబ్బంది విధులు, సమయపాలనగురించి అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాల నమోదు తీరును అడిగి తెలుసుకొని వాటి నివారణ చర్యలు, వైద్యం వంటి విషయాల గురించి సుదీర్ఘంగా చర్చించి అన్నివేళలా సిద్దంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా ఉత్పన్నమయ్యే అంటువ్యాధుల కట్టడిపై తీసుకుంటున్న ప్రణాళికల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాల మందులను అందుబాటులో ఉండేటట్లుగా చూడాలని ఆదేశించారు. మొదటిసారిగా రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈఒ బాలునాయక్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో అండర్17 విభాగంలతో బాలురకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతుల సంపాదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ధర్మానాయక్, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్ నాయక్, పీడీలు శ్రీనివాస్ రెడ్డి, శోభారాణి, వెంకట్ రత్నం, షాహీద్, జోజి, అంజి, అనిల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం ఇవ్వండి

**ప్రజాపక్షం/దేవరకొండ:** నియోజకవర్గ అభివృద్ధికై సహకారం అందించాలని అభివృద్ధి పనుల కోసం మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్. దేవరకొండ నియోజకర్గం లోని పలు బీటి రోడ్లు, అంతర్గత రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల మంజూరు చేయాలని కోరతూ హైదరాబాద్ లోని మంత్రుల నివాస సముదాయంలో కలిశారు. దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి చేయూత సహకరించాలని మంత్రి కోమటిరెడ్డిని ఎంఎల్‌ఏ బాలునాయక్ కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎంఎల్‌ఏ వెంట దేవరకొండ మాజీ జెడ్పిటిసి మారుపాకుల అరుణసురేష్ గౌడ్, యువ నాయకులు శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.





## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కోదాడ జడ్చర్ల రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌తో కలిసి ఆయన రోడ్డు విస్తరణ కోసం చేసిన మార్కింగ్ పనులను పరిశీలించి పలువురు యజమానులను నష్ట పరిహారం అందిందా లేదా అని అడిగి తెలుసుకోని మాట్లాడారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టిన రోడ్డు విస్తరణలో నష్ట పరిహారం అందించిన యజమానులు తమ నిర్మాణాలను తొలగించి సహకరించాలని అన్నారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదుట అంబేద్కర్ భవనం కోసం గుర్తించి స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు వాటర్ ఫౌంటేన్ నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ నష్ట పరిహారం పొందిన భవనాల యజమానులు ఆర్ అండ్‌బీ నిబంధనల మేరకు భవనాలను తొలగించడంతోపాటు మున్సిపల్ శాఖ నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ వదిలి కొత్త నిర్మాణాలను చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు రూ.33కోట్ల మేరా లబ్ధిదారులకు నష్ట పరిహారం అందించామని, వారసత్వ వివాదాల కారణంగా మరో రూ.6కోట్ల మేరా చెల్లింపులు జరపాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్ఐ ఠాకూర్, సర్వేయర్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలందిస్తాం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** నీటిపారుదల శాఖ అధికారులకు మౌలిక సదుపాయల కల్పించి రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్రనీరుపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని రూ.54.03 కోట్ల రూపాయలతో రాజీవ్ నగర్ రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను, రూ. 5.10 కోట్ల రూపాయలతో నిర్మించే నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీస్ డివిజన్ 4 సమీకృత కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో 2.29 లక్షల ఎకరాలకు సాగునీరును పర్యవేక్షించే అధికారులకు కార్యాలయం నాలుగు అంతస్తులతో పన్నెండువేల చదరపు అడుగుల్లో నిర్మించడం జరుగుతుందని, వచ్చే జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను అదేశించారు. కోదాడ నియోజకవర్గంలో మోతె మండలంలో సాగునీరు అందించేందుకు త్వరలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిర్మించి 45000 ఎకరాలకు సాగునీరు అందిస్తామని దానికి ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారి సిఈ రమేష్‌బాబును అదేశించారు.జిల్లా ఎస్‌పి కె.నర్సింహ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ సిఈ రమేష్‌బాబు, ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజీద్అలీ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.



### బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి

గ్రామీణ ప్రాంతాలకు చెందిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్రనీరుపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిలుకూరు మండలం సీతరామపురం వద్ద 167 జాతీయ రహదారి నుండి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాల వరకు రూ.10 కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిలుకూరు మండల చరిత్రలో నిలబడే విధంగా 250 కోట్ల రూపాయలతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మించడం జరుగుతుందని, గతంలో పాఠశాల నిర్మాణానికి ఇన్‌చాఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగిందని, కాని రోడ్డు వసతి సరిగా లేకపోవడంతో నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని గమనించిన వెంటనే జాతీయ రహదారి నుండి పాఠశాల వరకు రూ.10 కోట్లు మంజూరు చేసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.



## విద్యార్థులో విద్యాసామర్థ్యాన్ని పెంచాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** విద్యార్థుల్లో విద్య సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. కిష్టాపురం,పలివెల,రావి గూడెంలో గల కస్తూర్బాగు పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల పరిసరాల పరిశుభ్రతను,ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. వర్షాకాలము తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ,ఉన్నత పాఠశాలలో ఎల్ఐపి కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వెంకటయ్య, పలివెల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీనివాసులు, రావి గూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెల్లం మోహన్ కస్తూరిబా గాంధీ విద్యాలయం ఎస్ఓ పుష్పలత ఉపాధ్యాయులు ఉన్నారు.

## భక్తులు సూచనలు పాటించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భక్తులు వినాయక నిమజ్జనాన్ని నిరాటంకంగా, ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు భక్తులు అధికారులు సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం జిల్లా భువనగిరి పట్టణ శివారులోని పెద్ద చెరువు వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పెద్ద చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. చెరువులో నీటిమట్టం పెరిగిన దృశ్య భక్తుల భద్రతకు ప్రాధాన్యతీ భారీ కేడింగ్ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువు వద్ద క్రేన్లు, లైటింగ్, శానిటేషన్, త్రాగునీరు వైద్య సదుపాయాలు టాయిలెట్లు అన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నిమర్జనానికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. పోలీసు, ట్రాఫిక్, రెవిన్యూ, మత్య శాఖ, అగ్నిమాపక శాఖ సంబంధిత అధికారులు వారికి కేటాయించిన విధుల్లో సమర్థవంతంగా పాల్గొంటారని అన్నారు. నిమజ్జనం అనంతరం బతుకమ్మ పండుగని దృష్టిలో పెట్టుకుని చెరువు వద్ద ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఎలాంటి ఏర్పాట్లు చేయక పోతే చాలా ఇబ్బందులు పడతారని తెలిసి ఈ సారి ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 255 రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలోని 255 సర్వే నెంబరులో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వాలని తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ మమతకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం సైన్యానికి కేటాయించిన జీవోను రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి అర్హులైన రైతులకు డిజిటల్ పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జీవనాధారమైన సాగు భూములపై సందిగ్ధం నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు హైకోర్టును సంప్రదించగా కోర్టు రెవెన్యూ అధికారులకు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఆదేశించింది. రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వే చేసి కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా రెవెన్యూ అధికారులు పట్టా పుస్తకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలువేరు అంజయ్య, నేనా వత్ నరసింహ, బాలకిషన్, అంజయ్య, చిలుకూరు అంజయ్య, నవీన్ బాధిత రైతులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి టిఎల్ఎం మేళాకు ఎంపిక



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల స్థాయిలో టిఎల్ఎం మేళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరులో మంగళవారం నిర్వహించారు. ఈ మేళాలో 29 ప్రాథమిక పాఠశాలల నుండి 90 ఎగ్జిబిట్లు ప్రదర్శించినట్లు ఎంఈఓ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఇచ్చి ప్రారంభించబడిన ఈ కార్యక్రమానికి జెడ్‌పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెవై దానయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేళాలో తక్కువ ధరతో బోధన ఉపకరణాలను తయారుచేసి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో ఏ విధంగా విద్యార్థులకు బోధించవచ్చునో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మేళాకు మొత్తం 69 మంది ఉపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, బాలబాబు, సునీత, శ్రీధర్, రవి చంద్ర రిసోర్స్ పర్సన్‌లు హాజరయ్యారు. మొదటి, రెండవ బహుమతులు సాధించిన పాఠశాలలకు ప్రశంసా పత్రం అందజేశారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/దేవరకొండ:** రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా దేవరకొండ డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణను చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఆర్డీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, ఇందిరమ్మ ఇండ్లు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, వీధి కుక్కపై అవగాహన అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో తుది ఓటర్ జాబితాను మంగళవారమే ప్రచురించాలని ఆదేశించారు. పోలింగ్‌కేంద్రాల జాబితాను సైతం ప్రచురించాలని తెలిపారు. ఎక్కడైనా తాత్కాలిక పోలింగ్ కేంద్రాల అవసరం ఉంటే వెంటనే ప్రతిపాదించాలని అన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్లు, పోలింగ్ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పై సమీక్షిస్తూ తహాశీల్దార్‌లు, ఎంపిడివోలు గ్రామాల నుండి దరఖాస్తులను స్వీకరించడమే కాకుండా, త్వరగా పరిశీలించి ఆర్డివోకు పంపించాలన్నారు. ఆర్డివో వీటన్నింటిని పూర్తిస్థాయిలో విచారించి డిఆర్‌వో లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. ఎప్రిల్ 01, 2017 నుండి కుటుంబ పెద్ద మరణించి ఉంటే కుటుంబం ఈపథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు. ఈ పథకం కింద ఒకేసారి రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. వీధి కుక్కలపై అవగాహనను కొనసాగించాలని, ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా మునిసిపల్, గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవరకొండ ఆర్డివో రమణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య, జెడ్పిసిఈవో శ్రీనివాస్‌రావు, ఎంపిడివోలు, తహాశీల్దార్లు హాజరయ్యారు. అనంతరం ఆర్డివో కార్యాలయం ఆవరణలో వీధి కుక్కలపై ప్రజలకి అవగాహనకై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌ను కలెక్టర్ పరిశీలించారు.



## ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేవారికి మెరుగైన వైద్యం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రభుత్వ ఆస్పత్రిలకు వచ్చేవారికి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో పల్లె దవాఖానను కలెక్టర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి విధులకు ఎంత మంది సిబ్బంది హాజరు అయ్యారని, ఎంత మంది సిబ్బంది హాజరు కాలేదని అటెండెన్స్ రిజిస్టర్ చెక్ చేశారు. రోజు ఆసుపత్రి ఓపికి ఎంత మంది పేషెంట్లు వస్తారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో ఈ దవాఖాన పరిధిలో ఎన్ని ఈడిడిలు ఉన్నాయి. అందులో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగాయి, ప్రైవేటులో ఎన్ని జరుగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీ అయినా బాలింతతో ఫోన్ లో మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రి కి ఎందుకు వెళ్ళారని, మన జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్‌కి వెళ్తే వేల డబ్బులు ఖర్చు అవుతాయ అన్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ తో మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి అయ్యాయని, నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేసరా అని, గ్రామం దోమలు ప్రభల కుండా ఫాగింగ్ చేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్ వాడి టీచర్ తో మాట్లాడుతూ రోజు ఎంత మంది పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వస్తున్నరని, ఎంత మంది గర్భిణిలు, బాలింతలు వస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. అందరికీ రోజు పాలు, గుడ్డు, భోజనం పెడుతున్నార అని అన్నారు. గ్రామంలో కొత్త గా ఓటర్లు ఎంత మంది అప్లై చేసుకున్నారు, మరణించిన వారి ఓట్లు తొలగించార అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొత్త ఓటర్ల జాబితా విడుదల చేశారని అడిగారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి




### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్


**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈ నెల 21న చండీగఢ్ రాష్ట్రంలో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ మహాసభలల్లో సిపిఐ పార్టీ కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు అవసరమైన యూరియాను అందజేయాలన్నారు. యూరియా కోసం రైతులు సహకార సంఘాల ఎదుట ఆందోళనలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తుందన్నారు. తెలంగాణలోని రైతాంగ హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. సహకార సంఘాల ద్వారా పూర్తిస్థాయిలో యూరియాను అందజేసి ఆదుకోవాలన్నారు. పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలను ఎత్తివేయాలన్నారు. అర్హులైనవారందరికీ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షలను అందజేయాలన్నారు. ఇటీవలె కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారంగా రూ. 25వేలను చెల్లించాలన్నారు. ప్రతి ఏటా భారీ వర్షాలతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టంపై వెంటనే అంచనా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా కమిటీ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు,జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## కాపర్‌వైరు దొంగతనం కేసులో నలుగురు నిందితులు అరెస్టు

### నిందితుల నుండి రూ.2.50లక్షల నగదు స్వాధీనం

### కేసు వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** మునగాల, నడిగూడెం మండలాల్లో నాగార్జునసాగర్ కెనాల్‌పై లిఫ్టుల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మరంలోని కాపర్ వైర్ దొంగతనం చేసిన నేరస్తులు మునగాల మండలం బరాఖత్‌గూడెం వద్ద పోలీసులకు చిక్కారు. మంగళవారం కోదాడ డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి నేరస్తుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు పట్టణానికి చెందిన పాలకుర్తి వెంకటరామయ్య, గుంటకళ్ల కాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాంక్ లు మునగాల, నడిగూడెం మండలాల పరిధిలో ఎన్ఎస్‌పి కెనాలపై ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్ దొంగతనం చేసినట్లుగా తెలిపారు. వీరి నుండి రూ.2.50 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు వెంకట్రామయ్య గతంలో కాపర్‌వైర్ దొంగతనాలు చేసిన కేసులో నిందితుడని దొంగతనం చేసిన కాపర్‌వైర్‌ను ఒంగోలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులను ఫ్యాక్టరీ ఏజెంట్లకు కిలో రూ.400 చొప్పున అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితులు అందరు స్నేహితులు, వీరంతా దురలవాట్లకు బానిస అయ్యారని, వీరందరికి నేరచరిత్ర ఉన్నదని తెలిపారు. వీరంతా కలిసి మొత్తం ఐదు క్వింటాళ్ల కాపర్‌వైరును దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిని అరెస్టు చేసిన వారిలో కీలకంగా వ్యవహరించిన మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఐడి పార్టీ రామారావు, కొండలు, అదే విధంగా సూర్యాపేట సిసిఎస్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, హరికృష్ణ, సిబ్బంది మల్లేష్, శివ, అనంద్, శ్రీను లను డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి అభినందించారు.



## వినాయక నిమజ్జనానికి యంత్రాంగం సిద్ధం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో ఈనెల 5, 6 తేదీలలో జరిగే గణేష్ నిమజ్జనానికి పటిష్టమైన ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గణేష్ నిమజ్జనం చేయు సద్దుల చెరువును పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డిఓ, డిఎస్‌పి, మున్సిపల్ కమీషనర్ అన్ని శాఖల వారీతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయించాలన్నారు. అలాగే మండల వ్యాప్తంగా, మున్సిపాలిటి పరిధిలో గల కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరిలో ఎక్కువ విగ్రహాలు వస్తే ప్రణాళికలు సిద్ధం చేసుకుని రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్, సెక్యూరిటి పరంగా ఇబ్బందులు రాకుండా విగ్రహాలు ఒకదాని వెనుక ఒకటి వరుస క్రమంలో వచ్చి నిమజ్జనం చేయించాలన్నారు. ఫిషరీస్, ఫైర్, ఇరిగేషన్ శాఖల వారు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి నిమజ్జనం జరిగే రెండు రోజులు 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని, డిఎం అండ్ హెచ్‌ఓ, జిజిహెచ్ సూపర్డెంట్ వారి టీంతో టౌన్, మండలాల్లో హెల్త్ క్యాంప్స్, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం చేయు ప్రదేశంలో క్రేన్స్ లొకేషన్, అప్లోడ్ పాయింట్, పూజా సామాగ్రి కలెక్షన్ పాయింట్ ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేయాలని, రూరల్ పరిధిలో, టౌన్ పరిధిలో పెద్దవిగ్రహాలు నిమజ్జనం జరిగే ప్రదేశాలలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైతే నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారో అక్కడ మాత్రమే నిమజ్జనం చేయాలని, వేరే చోట చేస్తే భద్రతపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని విగ్రహాలు సద్దుల చెరువు చేరుకోవడానికి, నిమజ్జనం తర్వాత వెళ్ళడానికి రోడ్డు మ్యాప్ కూడా సిద్ధం చేశామని చెప్పారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3200 విగ్రహాలు ఉన్నాయని, వీటిని నిమజ్జనం చేయుటకు గాను 1500 మంది పోలీసులను బందోబస్తు కొరకు వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు, మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, విగ్రహాలను త్రాగునీటికి ఉపయోగించే పాలేరు రిజర్వాయర్‌లో, సాగర్ కెనాల్‌లో నిమజ్జనం చేయరాదన్నారు. ఎక్కడైతే నిమజ్జనానికి ఏర్పాటు చేసామో అక్కడ మాత్రమే నిమజ్జనం చేయాలని వేరే ప్రదేశంలో, మూసీ రిజర్వాయర్‌లో కూడా నిమజ్జనం చేయరాదని అలా చేస్తే భద్రతపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని, నిమజ్జనం జరిగే 5, 6 తారీఖులలో ఉదయం తొందరగా విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొని వచ్చి సూర్యుడు అస్తమించే లోపు నిమజ్జనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, మత్స, ఇరిగేషన్, ఫైర్ శాఖల అధికారులు, సూర్యాపేట ఎమ్మార్వో తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## కప్పు కొడితే రూ. 39.55 కోట్లు

### మహిళల వన్డే వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ భారీగా పెంపు



ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ప్రైజ్‌మనీ బాగా పెరిగింది. ఈ టోర్నీ ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) తాజాగా ప్రకటించింది. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ.121 కోట్లుగా పేర్కొంది. ఇది పురుషుల వన్డే వరల్డ్ కప్ 2023 ప్రైజ్‌మనీ కంటే కూడా చాలా ఎక్కువ. ఎంత అంటే మహిళల ప్రపంచకప్ ప్రైజ్‌మనీ ఏకంగా 297 శాతం పెరిగింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 39.55 కోట్లు, రన్నరప్‌కు రూ. 19.77 కోట్లు, సెమీ ఫైనలిస్టులకు రూ.9.88 కోట్లు నగదు పురస్కారం లభించనుంది. పురుషుల వన్డే ప్రపంచకప్ 2023 ప్రైజ్‌మనీ కంటే కూడా ఇది చాలా ఎక్కువ. ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియాకు రూ.33.32 కోట్లు, రన్నరప్ భారత్‌కు 16.66 కోట్ల ప్రైజ్‌మనీ మాత్రమే లభించింది. సెమీఫైనల్ టీమ్స్‌కు రూ.6.66 కోట్లు ప్రైజ్‌మనీగా అందాయి. మహిళల వన్డే ప్రపంచకప్ ప్రైజ్‌మనీ బాగా పెరగడం వెనుక ఐసిసి చైర్మన్ జై షా ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు, పురుషుల మధ్య ఉన్న వ్యత్యాసం ఐసిసికి లేదనే విషయాన్ని జై షా ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు. అంతేకాకుండా మహిళల క్రికెట్‌కు మరింత ఆదరణ పెరగాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ 2024 కంటే ముందే పురుషులు, మహిళలకు సమాన వేతనాలు, ప్రైజ్‌మనీని అందజేయాలని ఐసిసి నిర్ణయించింది. కానీ ఇంత భారీ స్థాయిలో ప్రైజ్‌మనీ పెరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఇదే జై షా క్రెడిట్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు.2022లో మహిళల వన్డే ప్రపంచకప్ విజేతగా నిలిచిన జట్టు.. ఐసిసి ప్రైజ్‌మనీ కింద 31 కోట్లు కేటాయించింది. ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాకు రూ.12 కోట్లు, రన్నరప్ ఇంగ్లండ్‌కు రూ.5 కోట్లు మాత్రమే దక్కాయి. కానీ అనేకముగా వన్డే ప్రపంచకప్ ప్రైజ్‌మనీని ఐసిసి ఏకంగా 4 రెట్లు పెంచింది. విజేత జట్టుకే దాదాపు రూ. 40 కోట్లు ప్రైజ్‌మనీ దక్కనుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళల వన్డే ప్రపంచకప్ సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో మొత్తం 8జట్లు బరిలోకి దిగుతున్నాయి. సెప్టెంబర్ 30న గౌహతి వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ తలపడనుంది.



## 33 ఏళ్లకు తొలిమ్యాచ్!

### క్రికెట్ రికార్డుల్లో చేరిన 'మెకే' స్టేడియం

క్రికెట్‌లో ఆటగాళ్లకే కాదు కొన్ని మైదానాలకు కూడా చరిత్ర ఉంటుంది. తొలి మ్యాచ్ జరగడం నుంచి చిరస్మరణీయ విజయాలకు కేరాఫ్ అయిన స్టేడియాలు అభిమానులకు ఎప్పుడూ గుర్తిండిపోతాయి. అయితే.. సుదీర్ఘ విరామం తర్వాత ఒక మైదానంలో మొదటిసారి వన్డే మ్యాచ్ జరిగింది. అది కూడా 33 ఏళ్ల తర్వాత. ఇంకేముంది అరుదైన రికార్డు ఆ గ్రౌండ్‌లోకు సొంతమైంది. ఇంతకూ ఆ స్టేడియం ఎక్కడుందో తెలుసా.. ఆస్ట్రేలియాలో. వన్డే వరల్డ్ కప్ 1992 పోటీలకు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇచ్చింది. అప్పుడు 'ది గ్రేట్ బారియర్ రీఫ్' అరీనా లోని మెకే (Mackay) మైదానంలో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. అప్పటినుంచి ఇక్కడ వన్డే మ్యాచ్‌లు జరగలేదు. ఈ మధ్యే వన్డే సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఈ స్టేడియంలో ఎదురుపడ్డాయి. అంటే.. 33 ఏళ్ల విరామం తర్వాత ఈ గ్రౌండ్‌లో వన్డే మ్యాచ్ నిర్వహించారు. దాంతో.. క్రికెట్ చరిత్రలో అత్యంత ఎక్కువ రోజుల తర్వాత మ్యాచ్ జరిగిన స్టేడియంగా గుర్తింపు సాధించింది మెకే.

## కొత్త స్పాన్సర్ వేటలో బిసిసిఐ



ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025 పార్లమెంటులో ఇటీవలే ఆమోదం పొందింది. దీంతో టీమ్ ఇండియా స్పాన్సర్‌గా డ్రీమ్ 11 తప్పుకుంది. ఈ నేపథ్యంలో బిసిసిఐ నూతన స్పాన్సర్‌లను వెతుక్కునే పనిలో ఉంది. ఇందులో భాగంగానే మంగళవారం టీమిండియా స్పాన్సర్ షిప్ కోసం బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించింది. దీని కోసం పలు మార్గదర్శకాలనూ జారీ చేస్తూ, ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. అలాగే ఆయా కంపెనీలు పలు నియమ, నిబంధనలకు లోబడి ఉండాలని షరతులు విధించింది. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించొద్దని పేర్కొంది. స్పాన్సర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గాంబ్లింగ్‌తో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎ లాంటి సంబంధం కలిగి ఉండకూడదని తెలిపింది. ఆయా కంపెనీలు కేవలం భారత్‌లోనే కాదు.. ప్రపంచంలో కూడా ఇలాంటి సేవలు అందించకూడదని తేల్చింది. అలాగే ఆయా కంపెనీలకు బెట్టింగ్, బిడ్డింగ్ సంస్థల్లో పెట్టుబడులు కూడా ఉండకూడదని స్పష్టం చేసింది. కేవలం గేమింగ్ కాకుండా.. క్రిప్టో ట్రేడింగ్, క్రిప్టో ఎక్స్ఛేంజ్, క్రిప్టో టోకెన్‌కు సంబంధించిన వ్యాపార కార్యకలాపాల్లో కూడా ఆయా కంపెనీలు పాలు పంచుకోకూడదని బిసిసిఐ లక్ష్మణ రేఖ గీసింది. వీటితో పాటు నిషేధిత బ్రాండ్లకు సంబంధించిన కంపెనీలు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. టీమిండియా జెర్సీ స్పాన్సర్ షిప్‌నకు సంబంధించిన ఈ బిడ్డింగ్‌లో పాల్గొనాలనుకునే కంపెనీల వార్షిక టర్నోవర్ కనిష్టంగా రూ.300 కోట్ల రూపాయలైనా ఉండాలని బిసిసిఐ స్పష్టం చేసింది. అలాగే ఆయా కంపెనీలు తమ దరఖాస్తులను సమర్పించడానికి సెప్టెంబర్ 16 వరకు అవకాశాన్ని కల్పించింది. యుఎఇ వేదికగా ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచే ప్రారంభం కానుంది.

# మహిళ

## విడాకుల కేసుల్లో మహిళలకు ఊరట!

### షో కేస్



సుప్రీం కోర్టు తాజా తీర్పుతో, విడాకుల కేసుల్లో మహిళలకు ఊరట లభించనుంది. నిజానికి సుప్రీం కోర్టు భార్యాభర్తలిద్దరికీ ఒకే రకంగా వర్తిస్తుంది. అయితే, అత్యధిక శాతం కేసుల్లో మహిళలే సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రహస్యంగా రికార్డు చేసిన సంభాషణను సాక్ష్యంగా అంగీకరిస్తామని సుప్రీం కోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెల్లడించడం హర్షదాయకం. విడాకులుసహా వైవాహిక వివాదాలపై విచారణ జరుగుతున్నప్పుడు, జరిగిన నష్టాన్ని నిరూపించుకునే అవకాశం మహిళలకు చాలా తక్కువగా ఉండేవి. నాలుగు గోడల మధ్య చోటు చేసుకునే శారీరక, మానసిక హింసను కోర్టుల్లో నిరూపించడానికి సరైన అవకాశాలు ఉండేవికావు. రహస్యంగా రికార్డు చేసిన సంభాషణను ఇప్పటి వరకూ సాక్ష్యంగా పరిగణించవేవారు కారు. పైగా, వ్యక్తిగత గోప్యతకు విరుద్ధమంటూ కొత్త చిక్కులు వచ్చిపడే ప్రమాదం కూడా పొంచివుండేది. ఇలాంటి సమస్యలు పురుషులకు కూడా ఉండవచ్చుగానీ, సంఖ్యాపరంగా చూస్తే మహిళలే ప్రధాన బాధితులు. ఈ కారణంగానే, సుప్రీం కోర్టు తీర్పు మహిళలకు అనుకూలమని చెప్పవచ్చు. ఈ తీర్పు భారతీయ చట్టంలో జీవిత భాగస్వామి ప్రత్యేక హక్కు యొక్క వివరణను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. గోప్యతా హక్కు (ఆర్టికల్ 21), న్యాయమైన విచారణ హక్కు మధ్య సమతుల్యతను నొక్కి చెబుతుంది. భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872 లోని సెక్షన్ 122 కింద క్రోడీకరించిన జీవిత భాగస్వామి హక్కు, వివాహిత వ్యక్తుల మధ్య సంభాషణలను గోప్యతా అంశాలుగా పరిగణిస్తుంది. ఒక జీవిత భాగస్వామి మరొకరికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని లేదా వివాహం సమయంలో చేసిన ఏదైనా సంభాషణను బహిర్గతం చేయమని బలవంతం చేయకుండా చట్టం నిరోధిస్తుంది. మరొక జీవిత భాగస్వామి సమ్మతి ఉంటే తప్ప, వివరాలను వెల్లడించడాకి వీల్లేదు. అయితే, ఈ చట్టం సంపూర్ణమైనది కాదు. హింస, విడాకుల కేసుల వంటి నిర్దిష్ట పరిస్థితులలో, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌తో సహా ఆధారాల ద్వారా క్లెయిమ్‌లకు మద్దతు ఉన్న చోట ఈ చట్టపరంగా లభించిన హక్కులు చెల్లవు. సాక్ష్యాధార చట్టంలోని సెక్షన్ 122 యొక్క కోర్టు వివరణ గోప్యత అనేది సంపూర్ణ హక్కు కాదని గుర్తిస్తుంది. ప్రత్యేకించి అది వివాహ విషయాలలో న్యాయం సాధించడానికి ఆటంకం కలిగిస్తున్నప్పుడు, గోప్యత, న్యాయమైన విచారణ హక్కు మధ్య సమతుల్యతను కోర్టు గుర్తించింది. రహస్య రికార్డింగ్‌లు గోప్యతా హక్కులను ఉల్లంఘిస్తున్నప్పటికీ, న్యాయమైన విచారణకు అటువంటి సాక్ష్యాలను అంగీకరించాల్సి రావచ్చు.


బలవంతపు వివాహ బంధం మన సమాజంలో కొత్తకాదు. సర్దుకుపోవాలంటూ అమ్మాయిలకు నచ్చచెప్పే తల్లిదండ్రులకు కొదువ లేదు. పెద్దల సమక్షంలో పంచాయతీలు, తీర్పులు, కలిసి ఉండాలన్న ఉపదేశాలు ఎక్కువగా మహిళల బతుకులను ప్రమాదంలోకి నెడుతున్నాయి. పుట్టింటికి వచ్చిన కూతురును ఏదో ఒక రకంగా తిరిగి అత్తవారింటికి పంపి, చివరికి ఆమె మరణానికి కారణమవుతున్న తల్లిదండ్రులు ఎంతో మంది ఉన్నారు. ఏ రకంగా చూసినా, మన దేశంలో శతాబ్దాలుగా పెళ్లి, విడాకులు అనేవి సహనం, త్యాగం అనే భావనలకు ప్రతిరూపంగా చూస్తున్నారు. అయితే, ఈ ఆలోచనా విధానాన్ని వ్యతిరేకిస్తున్న 31 ఏళ్ల కేరళవాసి రాఫియా అఫీ 'డైవర్స్ క్యాంప్' అనే పేరుతో సహాయక కేంద్రాన్ని ప్రారంభించింది. విడాకులు తీసుకున్న, విడిపోయిన, విధవ అయిన లేదా వివాహ సంబంధాలలో బాధ అనుభవిస్తున్న మహిళలకు కోలుకునే అవకాశాన్ని కల్పించి, స్వేచ్ఛను అనుభవించే ఉపశమన స్థలంగా ఇది నిలుస్తోంది. ఈ క్యాంపులో 15 నుంచి 20 మంది మహిళలు పాల్గొంటున్నారు. వీరంతా సహజ వాతావరణంలో ప్రదర్శనలు, పాటలు,

### బలవంతపు వివాహ బంధాన్ని ప్రశ్నిస్తున్న 'డైవర్స్ క్యాంప్'



నృత్యాలు, హైకింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. భద్రత, మారుమూల ప్రాంతాలలో మహిళలకు మానసికంగా, ఆర్థికంగా ముందుకు నడిపించే లక్ష్యంతో వీరి కార్యక్రమాలు ఉంటాయి. తమ అనుభవాలను రహస్యంగా ఉంచుతూ, న్యాయ సహాయం తీసుకుంటూ, కొత్త స్నేహాలను ఏర్పరుచుకుంటున్నారు. ఈ తరహా క్యాంపులు వాటిలో పాల్గొన్న మహిళలకు జీవన మార్గాన్ని, నూతన ఆశను కల్పిస్తున్నాయి. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశంలో వివాహిత మహిళల్లో 32 శాతానికిపైగా గృహహింసను ఎదుర్కొంటున్నారు. ఇంకా ఎక్కువ మంది మహిళలు విడాకులను హేయంగా చూస్తూ, మరణానికైనా సిద్ధపడుతున్న దుస్థితి నెలకొని ఉంది. అలాంటి భావనను ఛేదించేందుకు, విడాకులకు గౌరవం ఇవ్వాలని, విడాకులు జీవితం చివరేగాదు నూతన ఆరంభం అని రాఫియా ఆఫీ తన చర్యలతో చూపిస్తున్నారు. అలాగే, దుబాయ్ లాంటి విదేశీ నగరాల్లో కూడా ఇవే కార్యాచరణలు ప్రారంభమయ్యాయి. పాల్గొన్న ఆడవారు ఈ కేంద్రం తమ జీవితాలను పూర్తిగా మార్చేసిందని, విడాకులు స్వేచ్ఛను ఇచ్చాయని చెప్తున్నారు. 'విడాకులు ముగింపు కాదు, కొత్త ఆరంభం' అని రాఫియా ఆఫీ తన సందేశంలో స్పష్టంగా చెప్తున్నారు.

### ప్రాణాలకు తెగించి సాయం..



జెమీ రూత్ క్లాసెన్... కోట్లాది మంది ప్రజలకు, ప్రత్యేకించి మహిళలకు స్ఫూర్తిప్రదాత. కేవలం 16 ఏళ్ల వయసులో ఆమె చూపిన తెగువ, ఒక ప్రాణాన్ని కాపాడిన వైనం ఆమెకు అక్షరాలా ఈ అర్హతను అందిస్తాయి. కెనడాలోని ఒంటారియో ఉన్న కాలింగ్‌వుడ్ వద్ద జార్జియన్ బేస్‌కు 2020 జులై 26న, హైస్కూల్ విద్యార్థిని జెమీ తన స్నేహితురాళ్లతో కలిసి వెళ్లింది. అక్కడ హఠాత్తుగా ఒక కయాక్ నీటిలో బోల్తా పడడాన్ని గమనించింది. 40 ఏళ్ల కయాకర్ క్రిస్టోఫర్ జి. రాబర్ట్‌సన్ సాయం కోసం కేకలు వేస్తుండగా, బీచ్‌లో ఉన్న ఎవరూ అతనిని రక్షించడానికి ప్రయత్నించలేదు. తాము కూడా మునిగిపోతామన్న భయంతో మిగతా వారు కదలకుండా ఉండిపోగా, జెమీ క్షణం కూడా ఆలస్యం చేయకుండా నీళ్లలోకి దూకింది. దాదాపు 600 అడుగుల దూరం ఈదుకుంటూ వెళ్లింది. కానీ, అప్పటికే రాబర్ట్‌సన్ నీటిలో మునిగిపోయాడు. నీటి అడుగున సుమారు 12 అడుగుల కింద ఉన్న అతనిని రక్షించడానికి జెమీ క్షణం కూడా ఆలస్యం చేయలేదు. నీటి అడుగుకు డైవ్ చేసింది. అతని చేతులు పట్టుకొని, ఈదడం ప్రారంభించింది. స్పృహ కోల్పోయి, ఊపిరిసరిగ్గా పీల్చుకోలేకపోతున్న రాబర్ట్‌సన్‌ను గట్టిగా పట్టుకొని, ఒడ్డుకు ఈదింది. అతి కష్టం మీద రాబర్ట్‌సన్‌ను జెమీ ఒడ్డుకు చేర్చింది. వెంటనే అక్కడ ఉన్న గార్డులు అతనిని ఆసుపత్రికి తరలించగా, అతను కోలుకున్నాడు. ప్రాణాలకు తెగించి జెమీ చేసిన సాహసం ముమ్మాటికీ యువతరానికి మార్గదర్శకం.

## 'ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి' తక్షణమే అమలు చేయాలి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** వ్యవసాయ కూలీ మహిళలందరికీ ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి పథకాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. మంగళవారం స్థానిక సిపిఐ గిరిప్రసాద్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడారు. గ్రామీణ పేద కూలీల కుటుంబాల భరోసా కోసం యుపిఎ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీ పోరాడి సాధించిన ఉపాధి హామీ పథకాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేద వ్యవసాయ కూలీ మహిళలందరికీ మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 2500, ఆత్మీయ భరోసా ద్వారా ఏడాదికి రూ. 12వేలు తక్షణమే అమలు చేయాలన్నారు. పింఛన్లను రెండు వేల నుంచి నాలుగువేలకు పెంచాలని, దివ్యాంగుల పింఛన్‌ను ఆరువేలకు పెంచాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు, పోడు సాగుదారులందరికీ పట్టాలు మంజూరు చేయాలన్నారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జిల్లాలోని వ్యవసాయ కూలీలు, మహిళా కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు బత్తిని సీతారాములు, సింగారపు సత్యనారాయణ, పిట్టల రాంబాబు, బోడా చీనా, మేళ్లచెరువు వీరబాబు, మదారి ఈశ్వరమ్మ, లచ్చిరాం, బట్టు బాబురావు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాడే వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి:** ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే సిపిఐ అభ్యర్థులను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. సిపిఐ ఎల్కతుర్తి మండల కౌన్సిల్ సమావేశం మంగళవారం మండల కేంద్రంలో నిమ్మల మనోహర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కర్రె భిక్షపతి హాజరై మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకగా సిపిఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, సిపిఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, సిపిఐ నాయకులు కర్రె లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్, కామర వెంకటరమణ, మర్రి విజయ్, మరిపెల్లి తిరుమల, తండముండయ్య, మోహన్ రెడ్డి, కృష్ణకర్,ఎడ్ల చిరంజీవి, మంతోటి మల్లయ్య, గొట్టేముక్కుల మనోహర్‌రావు, వేముల కుమారస్వామి, చంద్రమౌళి, పోచయ్య, తిరుమల, ఊట్కూరి బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

## ఆర్‌టిసిని ప్రభుత్వంలో.. విలీనం చేయాలి

టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇదూరు వెంకట్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇదూరు వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ 2వ మహాసభ ఘనంగా నిర్వహించారు. మహాసభలో ఇదూరు వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్మికులను ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్‌టిసి సంస్థనే కొనుగోలు చేయాలని, లేదా ఇప్పుడున్న బస్సులను యధావిధిగా కొనసాగించాలన్నారు. 2021–2024 పేస్కేల్‌ను ఆర్‌టిసి కార్మికులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. డిపోలలో కార్మికులకు పనివేళలో ఇష్టానుసారంగా డ్యూటీలు వేస్తూ వేధింపులకు గురిచేయకూడదని హెచ్చరించారు. అనంతరం ఆదిలాబాద్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ రిజియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా కళవేణి శంకర్, అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.పాషా, ఆదిలాబాద్ డిపో గౌరవ అధ్యక్షుడిగా ఎస్ విలాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, మహాసభ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, కార్యనిర్వాహకులు నవీన్, నాయకులు యూసుప్ ఫాషా, రమేష్, దివాకర్, అశోక్, చిలుక దేవిదాస్, గాజాంగుల రాజు, మెస్రం భాస్కర్, గేడం కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## మిలిటెంట్ పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మిలిటెంట్ పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. మంగళవారం మణుగూరు పట్టణంలోని కిన్నెర కల్యాణ మండపంలో సిపిఐ పినపాక నియోజకవర్గ సమావేశం నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డగా పినపాక నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో అన్ని మండలాల్లో పోటీ నిలిచి తమ సత్తా ఏంటో చాటాలని, పార్టీ బలోపేతం కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించి ఆయోధ్యకు అంకితం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నా లక్ష్మీకుమారి, రేసు ఎల్లయ్య, కమటం వెంకన్న, ముత్యా వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి, పట్టణ కార్యదర్శులు దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, అనంతనేని సురేష్, పద్మనాభరాజు, వంగర సతీష్, వాగబోయిన రమేష్, కొమరం హన్మంతరావు, పేరాల శ్రీను, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలు అందించాలి

కడారి రాములు

**ప్రజా పక్షం/వేములవాడ:** గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు అందించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి. రాములు డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ అర్బన్ మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ చీర్లవంచ గ్రామపంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది. సమావేశంలో కడారి రాములు మాట్లాడుతూ గ్రామపంచాయితీ కార్మికులకు 3నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిఒ 51 రద్దు చేసి, జిఒ 60ను అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాదభీమా సౌకర్యం 25 లక్షలు ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ నాయకులు కార్మికుల ధర్నాలలో పాల్గొని కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం జరిగిందని, ఆ దిశగా ఆలోచన చేయాలని కాంగ్రెస్ నాయకులను కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దుంద్రపెల్లి. రవీందర్, ఈసరి. దేవన్న, దుంద్రపెల్లి. లక్ష్మన్, గుడికందుల. రమేష్, కంసాని. రాయనర్సు, మాన్వాడ. పరమేష్, కురుమ. గుండయ్య, చిట్యాల. రాజయ్య, నేరెళ్ల. వెంకటేశం, కంసాని. నాగరాజు తదితర కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



## సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** అసంఘటిత, సంఘటిత రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏఐటియుసి ఖమ్మం జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి శింగు నర్సింహారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రపంచీకరణ , ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తారాస్థాయికి చేరుతున్న తరుణంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. పెట్టుబడిదారి సమాజం చేస్తున్న శ్రమదోపిడీ రూపం మారుస్తూ వస్తుందన్నారు. కార్మికుల శ్రమను దోచే పెట్టుబడిదారులు ప్రస్తుతం పాలకులను అడ్డుపెట్టుకుని పని గంటలు పెంచుతూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానాలను తీసుకువచ్చి సంఘటిత రంగంలో అసంఘటిత రంగాన్ని సృష్టిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, నేషనల్ హెల్త్ స్కీమ్ తదితర స్కీమ్ వర్కర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేసిన పనికి సరిపడ వేతనాలు చెల్లించకపోవడం, శ్రమ దోపిడీ చేయడం కారణంగానే కంపెనీ యాజమాన్యాలు వేల కోట్లకు పడగలెత్తుతున్నారని ఆయన ఆరోపించారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్ మాట్లాడుతూ బోనస్‌లు, రాయల్టీలు, డివిడెండ్స్ సంగతి తర్వాత ముందు నెల నెల జీతాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రతినెల వేతనాల కోసం ఆందోళన చేస్తుంటే పాలకులు మాత్రం తమకెమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ లేదంటున్న ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేర వేల కోట్ల రూపాయలు ఎలా ఖర్చుపెడుతున్నారని ఆరోపించారు. కార్మికులు, ఉద్యోగులు కూడా సమాజంలో భాగమేనన్నారు. మోడీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల ఎనిమిది గంటల పని విధానం పోయి పది గంటల పని విధానం వచ్చిందన్నారు. ఏఐటియుసి దీనిని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 282 జీవోను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్య నిర్వహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, పేరబోయిన మోహన్‌రావు, కార్యదర్శులు గుండపొంగు మల్లేష్, ఎండి జాకీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజలకు ఇబ్బందులు రాకుండా మరమ్మతులు : పద్మారెడ్డి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ ఐఐ సిటి కాలనీలో జరుగుతున్న సిసి రోడ్డు మరమ్మత్తు పనులను అధికారులతో కలిసి స్థానిక మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో తక్షణమే రోడ్డు మరమ్మతులను చేపట్టాలని సంబంధిత అధికారులకు సింగిరెడ్డి పద్మా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐసిటి కాలనీ అధ్యక్షులు పి.వసంత కుమార్ రెడ్డి, కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవాల్లో విద్యుత్ స్తంభం విరిగిపడి యువకుడి దుర్మరణం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మూడు వారాల క్రితం ఆరుగురి యువకులు మృతికి దారితీసిన రామంతాపూర్‌లో జరిగిన శ్రీ కృష్ణాష్టమి దుర్ఘటన మరచి పోకుండగానే తాజాగా వినాయక నిమజ్జనోత్సవాల్లో అవే విద్యుత్ ప్రసారిత వైర్లు మరో నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ఈ ఉదంతం నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్థరాత్రి దాటాకా చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం సోమవారం రాత్రి నాచారం నుండి కాప్రా చెరువుకు విఎస్‌టి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం నుండి టస్కర్ వాహనంలో వినాయకుడి ప్రతిమను తీసుకొని వెళుతుండగా నాచారం ప్రధాన రహదారిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్థంభానికి చిక్కుకున్న కేబుల్ వైర్లు తగిలి ఒక్కసారిగా దాన్ని ఢీకొంది. అప్పటికే తుప్పు పట్టి ఉన్న ఆ విద్యుత్ స్థంభం పక్కనే ఉన్న మరో విద్యుత్ స్థంభంపై పడి విద్యుత్ ప్రసారిత వైర్లతో సహా నేలకొరిగాయి. అదే సమయానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ నాచారం సమీపంలోని కార్తికేయనగర్‌లో నివసించే బగుడం సాత్విక్ (23) తన కార్యాలయం నుండి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ ప్రమాద వశాత్తు, నేలకొరిగిన విద్యుత్ ప్రసారిత వైర్లతో కూడిన విద్యుత్ స్థంభాలను ఢీకొన్నాడు. దీంతో అతడి తలపై గాయాలవటంతో పాటు విద్యుద్ఘాతానికి సైతం గురవటంతో స్థానికుల సమాచారం మేరకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కవిత విషయంలో కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఎమ్మెల్సీ కవిత విషయంలో బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని శాసనసభ బిఆర్‌ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను గత కొద్దిరోజులుగా అయోమయానికి గురిచేస్తూ ఎమ్మెల్సీ కవిత చేసే పనుల వలన పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. పార్టీకి నష్టం కలిగించే వ్యక్తి ఎవరినైనా ఉపేక్షించేది లేదని బిఆర్‌ఎస్ అధినేత కవిత విషయంలో చేయడం సమంజసమని అన్నారు. బిఆర్‌ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ అని, అరవై లక్షలమంది సైనికులు, నాయకులు, కార్యకర్తలు ఉన్న సైన్యమని వివరించారు. పార్టీ విషయంలో తప్పుచేస్తే కుటుంబ సభ్యులనైనా సహించమని కెసిఆర్ గతంలోనే చెప్పిన మాటలను వివేక్ గుర్తుచేశారు. కన్న కూతురు కంటే బడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమని అన్నారు. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందని పేర్కొన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారని, ఈ రోజు పార్టీకోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కెసిఆర్ అని అన్నారు.



## వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం కుట్ర : ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తమ పాలనా వైఫల్యాలను కప్పి పుచ్చుకొనేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలకు పాల్పడుతోందంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్రంగా దుయ్య బట్టారు. కాళేశ్వరంపై విచారణ పేరిట మాజీ సిఎం కెసిఆర్‌పై సిబిఐ అక్రమ కేసును ఖండిస్తూ ఉప్పల్ ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న బిఆర్‌ఎస్ ప్రతినిధులు, శ్రేణులు పిసి ఘోష్ కమిటి నివేదిక తప్పుల తడక అని, రేవంత్ రెడ్డి డౌన్‌డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాళేశ్వరం బ్యారేజ్‌లపై విచారణ సాకుతో తెలంగాణా అస్తిత్వంపై దాడి చేసేందుకు ఎపి సిఎం చంద్రబాబునాయుడు, ప్రధాని మోడిలతో కుమ్ముక్కైన సిఎం రేవంత్ రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణా రాష్ట్రసాధన కోసం ప్రాణాల కు తెగించి పోరాటం చేసిన కెసిఆర్‌పై అంభాండాలు మోపితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

**ప్రజాపక్షం/మర్పల్లి :** ముఖ్యమంత్రి సహయ నిధి నిరుపేదలకు వరమని మర్పల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి మంగళవారం అన్నారు. తెలంగాణ శాసన సభ సభ్యులు గడ్డం ప్రసాద్ అదేశాల మేరకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మర్పల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్ , అనారోగ్యంతో బాధపడుతున్నా వారికి ఆసుపత్రిలో మేరుగైప వైద్య ఖర్యుల కోసం మండల పరిధిలో ఉన్న ఆయా గ్రామాలలో ఉన్న లబ్దిదారులకు 22 చెక్కులకు గాను 11 లక్షల 44 వేల 4 వందల రూ.లు గల చెక్కులను అందజేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజాశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్బంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటి ఉపధ్యక్షులు మల్లేష్ యాదవ్, పిఎసిఎఎస్ ఉపాధ్యక్షులు ఫసియోద్దీన్, సినియర్ నాయకులు రాములు యాదవ్, ఖాలీమోద్దీన్, సుగ్రీవ్, నర్సింగ్ యాదవ్, సురేష్ యాదవ్, అబ్రహాం, ధారసింగ్, నాయకులు పాండు, సాయి, వినోద్, శివ నర్సింగ్ యాదవ్, తదితరులు ఉన్నారు.

# 'మాడల్' ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలివ్వాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** తెలంగాణ మాడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం జాతీయ కార్యదర్శి గుజ్జ కృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నందగోపాల్, వేముల రామకృష్ణ, రవి, నిఖిల్ సంయుక్త ఆధ్వర్యంలో మాడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చినట్టుగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సక్రమంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు అవినీతికి పాల్పడుతున్నాయని, ఏజెన్సీలను రద్దు చేసి, ప్రభుత్వమే డైరెక్టుగా జీతాలివ్వాలని కోరారు. ఆదర్శ పాఠశాలలను కేంద్రప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని విద్యాభివృద్ధికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. నీలం వెంకటేశ్ మాట్లాడుతూ అరకొర జీతాలతో బతకులీడస్తున్న ఉపాధ్యాయుల జీతాలు ఆపడం సరికాదన్నారు. మంత్రులు, ఎంఎల్ఎల జీతాలు ఆపి అయినా చిరు ఉద్యోగులకు జీతాలిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వందలాది మంది ఆదర్శ పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వాలు అండదండ

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండదండలందిస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. దీని కోసం మహిళలు తమకు నచ్చిన రంగంలో సరైన శిక్షణ పొంది నైపుణ్యత పెంపొందించుకోవాలన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని అక్షయ ఫౌండేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ టైలరిం గ్, బ్యుటిషియన్, ఫ్యాషన్ టెక్నాలజీ లాంటి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలను అభినందించారు. శిక్షణ పూర్తయ్యాక మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి సంఘాలలో చేరితే మెప్మా ద్వారా ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉంటా యన్నారు. ప్రభుత్వం మహిళా సంఘా లకు ఇటీవల విద్యార్థులకిస్తున్న యూనిఫారాల కుట్టు పనులను అప్పగించిన విషయాన్ని ప్రస్తావిం చారు. అనంతరం బాచుపల్లిలోని జడ్‌పి హైస్కూల్‌ను సందర్శించిన ఆయన పాఠశాల పక్కనే ఉన్న బండరాళ్లను తొలగించాలని, దీంతో పాటు పాఠశాలకు అవసరమైన అదనపు గదుల నిర్మాణం, ఇతర పనులకోసం ప్రతిపాదనలు పంపాలని వెంట ఉన్న డిఇఒ విజయకుమారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి, అక్షయ ఫౌండేషన్ చైర్మన్ ప్రశాంత్, ఎన్జీవో సలహాదారు అరుంధతి, అకాడమిక్ హెడ్ శ్రీదేవి, ప్రాజెక్టు కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రణీత్ ప్రణవ్ గ్రోవ్ వెంచర్‌లో వరుస ఘటనలు...

## భవన నిర్మాణ కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి చర్చి గాగిలాపూర్‌లో ప్రణీత్ కన్‌స్ట్రక్షన్ ప్రభుత్వ భూమిలో ఎఫ్టీఎల్‌లో విల్లాల నిర్మాణం గురించి కథనాలు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అదే వెంచర్లో ఒక బెంగాల్ వాసి బాపన్ దాస్ (23) వ్యక్తి మరణించాడు. గుట్టు చప్పుడు కాకుండా దహన సంస్కారాలు చేస్తున్నారని బిజెపి మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పోలీసులకు తెలుపడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ కనీస వసతులు లేకుండా సుమారు 400 మంది కార్మికులు పనిచేస్తున్నారనీ వారికి ఎలాంటి వసతులు, డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా నిర్వాహకులు కార్మికుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని వాపోయారు. మరణించిన వ్యక్తి వారం రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నా డాక్టర్ పర్యవేక్షణ లేదని దవాఖాన కు చూపించే వారు లేక చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తీవ్ర అనారోగ్యంతో మరణించారని, కేవలం కార్మికుల నుండి శ్రమ దోపిడీ తప్ప వారికి కనీస వసతులు కల్పించే బాధ్యత ప్రణీత్ సంస్థది కాదా? అని, బాధిత కుటుంబానికి కనీసం 30 లక్షలు పరిహారం ఇవ్వాలని కార్మిక చట్టం ప్రకారం నడుచుకోని ప్రణీత్ సంస్థమీద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరా రు. ఎఫ్టిఎల్, బఫర్, ప్రభుత్వ భూమి లో నిర్మించిన విల్లాల వెంటనే తొలగించి ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని దుండిగల్ మున్సిపల్ బిజెపి పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి డి.విగ్నేశ్వర్ చారి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి డి.సీతారాంరెడ్డి, వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## వినాయక పూజలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎస్‌పి

**ప్రజాపక్షం/వికారాబాద్:** వినాయక పూజ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గోని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , వికారాబాద్ జిల్లా పోలీస హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా ఎస్ పూజ అనంతరం వినాయక ఉత్సవాలు విజవంతంగా ,ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి కావడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లోతైన నదులు, చెరువుల్లోకి వెళ్లవద్దని సూచించారు. యువత మరింత అప్రమత్తంగా ఉండాలని అయన ప్రత్యేకంగా తెలిపారు. పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యుల మధ్య సోదర భావాన్ని ,ఐక్యతను పెంపొందించడంలో ఈ వేడుకలు ఎంతగానో సహాయపడ్డాయని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ సరోజా ఆర్ఐ అంజాత్‌పాషా తదితరులు పాల్గోన్నారు.



### ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు

## కనకమ్మకు భారతరత్న ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, కవయిత్రి, సంఘ సంస్కర్త పొణకా కనకమ్మకు 'భారతరత్న' బిరుదు ఇవ్వాలని పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బి.సురేంద్రనాథ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పొనఖా కనకమ్మకు భారత రత్న ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన చేసి, కేంద్రానికి సిఫారసు చేయడం హర్షణీయమన్నారు. వందేళ్ల క్రితమే కనకమ్మ తన ఆస్తులను దానం చేశారని, ఇప్పుడు ఆ ఆస్తులు రూ.2500 కోట్లు అని తెలిపారు. ప్రతి ఏటా పొణకా కనకమ్మ, కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి పేరిట అవార్డు ప్రదానోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో గ్లోబల్ రెడ్డి ఫెడరేషన్ వ్యవస్థాపకులు హెచ్.ఎన్.మంజునాథ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ ఎంఎల్‌ఎ వన్నాల శ్రీరాములు, గణేశం దయాకర్‌రెడ్డి, కొండా లక్ష్మీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కళారూపాలు

**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కళారూపాలు ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. వికారాబాద్ జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారధిలో పనిచేస్తున్న గారెపాక భిక్షపతి,చింతల స్వప్నలు రంగారెడ్డి జిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఇరువురుకి జిల్లా అదనపు కలెక్టర్ శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కళారూపాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంతోపాటు పరసరాల పరిశుభ్రాత ,ప్రజల వ్యక్తిగత ఆరోగ్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంటువ్యాధుల తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకోవాడానికి కళారూపాలు ఎంతగానో దోహద పడ్డాయన్నారు. బదిలీపై వెళ్తు న్నా కళాకారులు అయా జిల్లాలో తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తు ,సంస్కృతి కార్యక్రమాల్ల తమ నైపూణ్యాన్ని పెంచుకుంటూ ప్రజల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తు అధికారుల మన్నలను పొందాలని అదనపు కలెక్టర్ లింగ్యానాక్ సూచించారు.



## ఆట పాటలతో గణేష్ నిమజ్జనం

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలో నవోదయ పాఠశాలలో గణేష్ నిమజ్జనం చిన్నారుల ఆట పాటలతో కోలాటం, నృత్యం చేస్తూ ఎంతో ఘనంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం నిర్వహించారు. 7 రోజులుగా కొలువుదిరిన గణపయ్య పూజాలందుకోని నాగ్వారం వాగులో నిమజ్జనం చేయడం జరిగిందని కరస్పాండెంట్ బ్రహ్మం, ప్రధానోపాద్యాయులు కళావతి, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ పాఠశాల ఉపాద్యాయ బృందం విద్యార్థులు పాల్గోన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్

### ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజల సంక్షేమంకోసం ఎన్నో పథకాలను



ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అని జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని, ఓటమెరుగని మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడని అన్నారు. అలాగే శామీర్‌పేటలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. మూడుచింతలపల్లిలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమం లో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



**ఘట్‌కేసర్‌లో:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుషాపూర్ గ్రామంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్‌లు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మాజీ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడుతూ రైతుల పక్షపాతిగా రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై మొదటి సంతకం చేశారని తన పాదయాత్రతో పేదల సమస్యలను తెలుసుకొని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి ఎందరో క్షతగాత్రుల ప్రాణాలను రక్షించడానికి 108 అంబులెన్స్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారని బడుగు బలహీన వర్గాలకు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ చిలుగురి మచ్చేందర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, బొక్క ప్రభాకర్ రెడ్డి, అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ తెలంగాణ రాష్ట్రఉపాధ్యక్షులు, ఎస్సీసెల్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.




**మేడ్చల్ మల్కాజిగిరిలో:** నేరేడ్‌మెట్ చౌరాస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆరోగ్య శ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పలు సంక్షేమ పథకాలు అమలు



పరచిన వైఎస్సార్ మహనీయుడన్నారు. ఈ కార్యక్రమ ం లో మాజీ కౌన్సిలర్ ప్రసాద్,చంద్రశేఖర్, శీను, జీవన్‌రెడ్డి, ప్రభ. సంతోష్, నర్సింగరావు, చెన్నారెడ్డి, మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దేముల్‌లో :** వైఎస్ఆర్ చేసిన సేవలు ప్రజలు మరువలేనివని, ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న మహానేత అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలు అందించిన వైఎస్ఆర్ పేద ప్రజల కోసం రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఫించన్‌లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మైనార్టీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కన్వీనర్ ఎండి రియాజ్, పిఏసిఎస్ డైరక్టర్ ఉప్పరి మల్లేశం, ఎఫ్ఏసిఎస్ డైరక్టర్ కోహిర్ రవిశంకర్, ఇందిరమ్మ కమిటి సభ్యులు శోభరాణి,మాజీ ఎంపిటిసి విద్యాసాగర్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ బుజ్జమ్మ, నాయకులు వెంకటయ్య, సయ్యద్ షబ్బీర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## గ్రామ పంచాయతీ ఓటర్ లిస్టు సిద్ధం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా పరిధిలోగల అన్ని గ్రామ పంచాయతీలలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పోలింగ్ స్టేషన్ల వివరాలు, గ్రామ పంచాయతీ ఓటర్ లిస్టులు సిద్ధం చేయడం జరిగిందని, ప్రజల నుండి, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించి అందజేస్తామని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తరువాత గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, తుది గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్ల వివరాల జాబితా పబ్లిష్ చేయడమైనదని, అదే విధంగా చనిపోయిన ఓటర్ల జాబితా, డబుల్ ఓటర్స్ జాబితా, డూప్లికేట్ ఓటర్స్ జాబితా తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత తహసీల్దార్లకు పంపామన్నారు. ఓటర్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అప్డేట్ చేయబడుతాయని తెలిపారు. 3000లకు పైన చనిపోయిన, డబుల్ ఓటర్ల వివరాల జాబితాను ఎంపిడిఒలు తయారు చేసి సంబంధిత తహసీల్దార్‌లకు ఇవ్వడం జరిగిందని, ఇవి ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

## ఓటర్ లిస్టు తుది జాబితా విడుదల

ఎంపిడిఒ రాధారాణి



**ప్రజాపక్షం/యాచారం :** మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పోలింగ్ స్టేషన్లు, తుది ఓటర్ లిస్టు జాబితాను విడుదల చేసినట్లు మండల అభివృద్ధి అధికారి రాధారాణి తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో తుది పోలింగ్ స్టేసన్‌ల వివరాలు, ఓటర్ జాబితా ప్రదర్శించారు.. ఈ సంధర్భంగా రాధారాణి మాట్లాడుతూ మండంలోని 24 గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ లిస్టు, పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రదర్శించామన్నారు. 2 వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సంధర్బంగా 2025 గ్రామ పంచాయతీలలో ఓటరు లిస్టులో ఎలాంటి తప్పులున్న వాటిని పంచాయతీ కార్యదర్శుల ద్వారా సరిచేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఓటర్ల జాబితా సమగ్రంగా ఉడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత, సూపరిండెంట్ శైలజా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బేబి పాండ్‌ల పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వినాయక నిమజ్జనం కోసం జిహెచ్ఎంసి అధికారులు సచివాలయం నగర్‌లో ఏర్పాటు చేసిన బేబి పాండ్‌ను మంగళవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈ బేబి పాండ్‌లో వినాయకుని మూడు అడుగులు మించకుండా బేబి పాండ్‌లో నిమజ్జనం చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ బేబి పాండ్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. నిమజ్జనం కోసం వచ్చే ప్రజలకు అలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఈఈ రమేష్ బాబు, డీఈ దామోదర్ రావు, ఏఈ కార్తీక్, శానిటేషన్ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యాదయ్య, సచివాలయ నగర్ కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజనేయులు, సూర్యనారాయణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని సాయి తిరుమల ఎంక్లేవ్‌లో ఉద్యవనం ద్వారా మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను ఆమె కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ధీరజ్ రంగారావు, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, సతీష్‌గౌడ్ ఉన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్ నందనవనంకు చెందిన రమేష్ కీళ్లనొప్పులకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్‌బినగర్ శాసన సభ్యులు దేవరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన సుధీర్‌రెడ్డి ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది. దినికి గాను వారికి 2లక్షల ఎల్‌ఓసి చెక్కు మంజూరు కావడంతో మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త ఛతిరి మధుసాగర్ ఉన్నారు.

## దక్షిణమధ్య రైల్వే జిఎంతో చేవెళ్ల ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ



**ప్రజాపక్షం/శంకర్ పల్లి :** శంకట్‌పల్లి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డిప్యూటీ జనరల్ మేనేజర్లు కె.ఉదయనాథ్, ఎం.శ్రీనివాస్, సిపిఆర్ఓ శ్రీధర్‌తో చర్చించారు. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌లో రెండవ ప్లాట్ ఫారంపై ప్రయాణికుల కోసం షెడ్డు, రైల్వే బోగీల హోల్టింగ్ సూచిక, లిఫ్టు స్టేషన్ ఆధునీకరణ, డెమో పాసింజర్ హైటెక్ సిటీలో నిలుపుదల, పలు ఎక్స్ ప్రెస్ రైలు (ముంబై, హుబ్లీ,బీజాపూర్)లను నిలపాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఫతేపూర్ లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యుబి నిర్మాణం చేయాలని ఎంపి కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు.

# పేదలకు నాణ్యమైన 'రేషన్' ఇవ్వాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్







**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదలకు నాణ్యమైన రేషన్ సరుకులు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే రేషన్ షాపుల విస్తరణ చేపట్టినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చౌకధర దుకాణాలను ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. 7వ వార్డులో రేషన్ దుకాణం లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక ఏళ్ల నుండి పడుతున్న ఇబ్బందిని తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు వివరించారు. వార్డులో నెలకొన్న సమస్యలను వార్డు ఇన్‌చార్జి కొప్పునూరి ప్రవీణ్ ద్వారా వివరించాలని మహిళలకు సూచించారు. ఈ వార్డును అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే రూ.4కోట్ల నిధులు ఇచ్చామని, మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేదల కష్టాలను తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు కృష్ణారెడ్డి, విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, కరుణాకర్, సుదర్శన్, కాలనీ వాసులు మంచిరేవుల అశోక్, కుమ్మరి శ్రీశైలం, కాంతయ్య, దాసరి నరేష్, విభూతి, వినోద్, డిసిఎం రాజు, మహిళలు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమానికి నిలువెత్తు రూపం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

ప్రజా సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలువెత్తు రూపమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ ముఖ్యకూడలిలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్ఆర్ అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు. కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహానీయుడి సేవలు చరిత్ర ఉన్నంత వరకు మరచిపోలేరన్నారు. 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన మహావ్యక్తి వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత వైఎస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, రఘు నాయక్, వివిధ మండలాల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింలు యాదవ్, అందె మోహన్ ముదిరాజ్, బచ్చలి నరేష్, క్యాసెట్ శ్రీను, చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ కారులకు సన్మానం



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** శ్రీ కృష్ణ దేవరాయ తెలుగుభాషా నిలయం స్థాపన దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో పౌర గ్రంథాలయాలు నాడు నేడు అనే అంశంపై రాష్ట్ర స్థాయి గ్రంథాలయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గ్రంథాలయోద్యమకారులు అనుముల శ్రీనివాస్ పాల్గొని ప్రస్తుత తరుణంలో ఊరూరా గ్రంథాలయాల స్థాపన దాని ఆవశ్యకతపై ప్రసంగించారు. ఈసందర్భంగా రెండు దశాబ్దాలుగా ఊరూరా గ్రంథాలయాలస్థాపనకు కృషి చేస్తున్న అనుముల శ్రీనివాస్‌కు ప్రొఫసర్ డా.ఎస్‌సుదర్శన్‌రావు, భాషా నిలయం సంయుక్త కార్యదర్శి నరసింహమూర్తి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాషా నిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు, ప్రొఫసర్ ఎన్.లక్ష్మణరావ్, డా. విశ్వమోహన్, డావివేక్ వర్ధన్, డా.చక్రవర్తి, టివి ప్రఫుళ్ళ చంద్ర, సామాజిక సేవకులు శివశెట్టి శివప్రసాద్, డా.మురళి ప్రసాద్, డా.చేగొని రవికుమార్, మాలోత్ సైదానాయక్ పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : సిపి కృష్ణయ్య

**ప్రజాపక్షం, సరూర్‌నగర్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్‌బినగర్ డివిజన్ ఏసిపి ఎ.కృష్ణయ్య కోరారు. గణనాధుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాక్షించారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వరకాలనీ రోడ్డు నంబర్ 5లో ప్రముఖ వ్యాపారవేత్త సోమ వెంకట్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి ఏసిపి ఎ.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాయత్రి కూచిపుడి అకాడమి వారు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. భక్తులందరూ భక్తి శ్రద్దలతో స్వామి వారికి పూజించాలన్నారు. మండల నిర్వాహకులు ఏసిపి కృష్ణయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తులసీ కృష్ణమూర్తి, రాజనాల వెంకటేశ్వర్‌రావు, గంటి శంకర్, గుంత ప్రవీణ్, గంటి వెంకట్ రావు, గంటి శంకర్, కె.బుద్దోజి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తే సిబిఐ కేసులా ?



ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** బీడు భూముల్లో నీళ్లు పారించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టడం సిగ్గుచేటని రేవంత్ సర్కార్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నిరసిస్తూ, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు బాలాపూర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సబితారెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాల బీడు భూమిలో నీళ్లు పారేలా చేసిన అపర భగీరథుడు కెసిఆర్ అని కొనియాడారు. కాళేశ్వరంపై కాంగ్రెస్, బిజెపిల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే వారికి సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అయచితం శ్రీధర్, వీరమల్ల రాంనర్సింహగౌడ్, చిలకమర్రి నరసింహ, మురుకుంట్ల అరవింద్ శర్మ, పెండ్యాల నాగేష్, బిఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, సునిత బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.



**షాద్‌నగర్:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఘోష్ నివేధికను పక్కన పెట్టి సిబిఐకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడంలో అంతర్యమేమిటో చెప్పాల మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ముఖ్యకూడలిలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ అపర భగీరథుడు కెసిఆర్‌కు ప్రజల్లో వస్తున్న మంచిపేరును కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేక కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ముందుకు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఏడారిగా ఉన్న తెలంగాణ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు ఇవ్వాలనే సంకల్పంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రగతి వైపు నడిపించిన కెసిఆర్‌పై నిందలు వేయడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న రాష్ట్ర ప్రజలు మాత్రం బిఆర్ఎస్ వైపు చూస్తున్నారని, ఇది జీర్ణించుకోలేక ఇలాంటి అసత్య ఆరోపణలు చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఈట గణేష్, విఠల్ ముదిరాజ్, వై.రవీందర్ యాదవ్, దేవేందర్ యాదవ్, లక్ష్మణ్ నాయక్, రవి యాదవ్, వెంకట్‌రెడ్డి, వి.నారాయణరెడ్డి, నటరాజన్, చందునాయక్, ఒగ్గు కిశోర్, రాజ్యలక్ష్మి, రాజావరప్రసాద్ పాల్గొన్నారు.

## వీధి విక్రేయదారులు గ్రీన్ స్ట్రీట్ వండర్‌జోన్‌లోనే వ్యాపారాలు కొనసాగించాలి

బిజెఎంసి కమిషనర్ శరత్ చంద్ర





**ప్రజాపక్షం/గండిపేట :** వీధి విక్రేయదారులు గ్రీన్ స్ట్రీట్ వండర్ జోన్‌లోనే వ్యాపారాలు కొనసాగించాలని నల్లగొండ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్(బిజేఎంసి) కమిషనర్ బి శరత్ చంద్ర వ్యాపారులను ఆదేశించారు. కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశముల మేరకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం బి. శరత్‌చంద్ర టౌన్ వెండింగ్ కమిటీ (టీవిసీ) సభ్యులతో బిజేఎంసి కౌన్సిల్ హాల్ లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ రెడ్ మరియు అబర్ జోన్ లో ఉండే వీధి విక్రయదారులు, గ్రీన్ స్ట్రీట్ వెండర్ జోన్ లో మాత్రమే తమ వ్యాపారులు చేసుకోవాలన్నారు. అదే విధంగా సీఐజీ సంఘాలను ఏర్పాట్లు చేసుకోవాలని, నెలవారీ టీవిసీ సమావేశం, ఆత్మ నిర్బర్ నిధి పథకంలో గుర్తించబడిన వీది విక్రేయదారులకు రుణ మంజూరు, రుణాలు చెల్లింపులపై సమీక్ష జరిపారు. డిజిటల్ ఆన్ బోర్డింగ్ శిక్షణ శిబిరం నిర్వహణ, వీది విక్రేయదారులను గుర్తించడం, వారి గుర్తింపు కార్డు జారీచేయడం, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తెరవడం, వీది విక్రేయదారుల గ్రూపుల ఏర్పాటు, బ్యాంకు ఖాతాలు తెరవడం, వీది విక్రేయదారుల స్వయం ఉపాధి కార్యక్రమాలుపై అధికారులతో సమీక్షించారు. పిఎంజేజేబివై, పిఎంఎస్ బిఐ పథకాల ద్వారా వీది విక్రేయదారుల భీమా, వీది విక్రేయదారుల ఆర్థిక మరియు అక్షరాస్యతపై సమీక్షించారు. కార్యక్రమంలో కన్వేయర్, టీఎంసీఎస్. శ్రీలత, కమిటీ సభ్యులు డీ. రాకేష్, టీపిఎస్ రాకేష్, డా.రాజ, మెడికల్ ఆఫీసర్ రాజు ఎస్ఐ కె.సత్యనారాయణరెడ్డి, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బిఐ మేనేజర్ నిఖీల్, వీధి విక్రయదారుల ప్రతినిధులు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి


సిపిఐ వినతి

**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** ప్రజలు వర్షకాలంలో రోగాలతో ఇబ్బంది పడుతున్నా అధికారులు పొంగిపొర్లుతున్నా డ్రైనేజీ పట్టించుకోకపోవడపై అబ్దులాపూర్‌మెట్ మండల సిపిఐ కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ అగ్రహం వ్యక్తం చేశారు. అబ్దులాపూర్‌మెట్ గ్రామంలో నిరుపేదలు నివాసం ఉంటున్నా జెఎన్ఆర్ఎం కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. తక్షణం సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సిపిఐఅధ్యర్యంలో వినతిప్రతం అందజేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాండుతూ..పైప్‌లైన్ వేసినప్పుడు అదికారులు సక్రమంగా వేయకపోవడంతో మురికి కూపంగా మారిందన్నారు. కాలనీలో నివాసం ఉంటున్నా ప్రజలు రోగాలపాలు అవుతున్నారని తెలిపారు. డ్రైనేజీ నీటితో రోడ్డుపై వెలుతున్నా వావానదారులకు సైతం ఇబ్బందిగా తయారు అయిదని తెలిపారు. తక్షణం సమస్య పరిష్కారం చేయాలని కోరారు. కార్యాక్రమంలో జెఎన్అర్ఎం కాలని సిపిఐ శాఖ కార్యదర్శి వడ్త్యా రమేష్ నాయక్, కె.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి







**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రజాసేవకు తమ రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి కొనియాడారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్ లోని బాలాపూర్ గ్రామంలో, అల్మాస్‌గుడ వైఎస్ఆర్ పార్కులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి హాజరై వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజల మనసుల్లో ఎప్పటికి చిరస్మరణీయులుగా నిలిచిపోయారన్నారు. ఆయన చేపట్టిన ప్రజాకర్షక పథకాలు రైతుల పేదల సంక్షేమం పట్ల వారు అందించిన ప్రోత్సాహం, ఆరోగ్య శ్రీ, 108 లాంటి పథకాలు ఆయనను శాశ్వతంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయేలా చేశాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మనోహర్, జైహింద్, మార్కెట్ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజలకు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని హస్తినాపురం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దెంది శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని జడ్పీ రోడ్డు డిఆర్‌డిఎల్ కాలనీ వద్ద వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సాయిరాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, బలరాం, బ్రహ్మారెడ్డి, అరవింద్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, దశరథ, శ్రీనివాస్, బ్రహ్మాచారి, శ్రీకాంత్‌రెడ్డి, సమీ, మధు, గోవర్ధన్, నల్ల కృష్ణ పాల్గొన్నారు.

**గండిపేట:** వట్టినాగులపల్లి గ్రామంలో ఉమ్మడి వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా నార్సింగి పురపాలక సంఘం వట్టి నాగులపల్లి గ్రామంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, దుల్సాన్ శిపాల్‌సింగ్, మాజీఎంపిటిసి గొల్ల నాగేష్ యాదవ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకల లక్ష్మణ్‌రెడ్డి, కుమ్మరి శేఖర్, బుడాల దర్శన్ ముదిరాజ్, బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్, కొండే సాయి కిరణ్ యాదవ్, మొద్దు రాకేష్ ముదిరాజ్, దీపక్‌చారి, పాల బాలకృష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు.






## 'పెద్ది' సక్సెస్ కోసం రెహ్మాన్ కసరత్తు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పాన్ ఇండియా సినిమా పెద్ది. బుచ్చి బాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు భారీగా నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టుని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.ఇప్పుడు ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న పెద్ది ఫస్ట్ సింగిల్ త్వరలో రాబోతున్నట్లు అనౌన్స్ చేశారు. రామ్ చరణ్, దర్శకుడు బుచ్చి బాబు సాన, ఏఆర్ రెహ్మాన్ స్టూడియోలో వున్న ఫోటోని షేర్ చేశారు.పెద్ది కోసం ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రెహ్మాన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ ని కంపోజ్ చేశారు. ఆడియన్స్, ఫ్యాన్స్ కు ఎప్పటికీ గుర్తుండిపోయే సాంగ్స్ ని రెడీ చేశారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రత్నవేలు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్ అందిస్తున్నారు. మార్చి 27, 2026న ఈ సినిమా రిలీజ్ కానుంది.

## పవన్ అభిమానా? మజాకా?

అప్పుడెప్పుడో ఇండియా క్రికెట్ టీమ్ గెలిస్తే నగ్నంగా తయారవుతా అన్నది ఒక హీరోయిన్. ఇలా కొంత మంది హీరోయిన్ లు తమ అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు. తెలుగులోనూ అలాంటి అభిమానులు లేకపోలేదు. క్రికెటర్లు అన్న, సినిమా హీరోలు అన్న పడి చచ్చే అమ్మాయిలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో అషురెడ్డి అనే తెలుగు నటి తన అభిమానాన్ని పవన్ కళ్యాణ్ కు చూపించాలనుకుంది. అంతే ఆలోచన వచ్చిందే తడవుగా తన ఒంటిపై పవన్ కళ్యాణ్ అనే పేరు రాయించుకుంది. ఒంటిమీద ఎక్కడో ఒక చోట రాసుకుంటే పెద్ద చర్చ అయ్యేది కాదేమో కానీ అషు రెడ్డి ఏకంగా అర్ధనగ్నంగా కనిపిస్తూ కనిపించని చోట పవన్ కళ్యాణ్ పేరు రాయించుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. ఈ ఫోటోను ఆమె మీడియాకు కూడా విడుదల చేసింది. తన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టా లో షేర్ చేసింది.



## 'ఓజీ' పోస్టర్ విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా, 'ఓజీ' చిత్ర బృందం అభిమానులకు డబుల్ బొనాంజా ఇచ్చింది. అద్భుతమైన కొత్త పోస్టర్ తో పాటు, OG LOVE OMI పేరుతో ఓ సంచలనాత్మక గ్లింప్స్ ను విడుదల చేసింది. పవన్ కళ్యాణ్ ను ఇంత శక్తివంతమైన, ఆకర్షణీయమైన శైలిలో చూపించినందుకు అభిమానులు, సినీ ప్రేమికులు.. దర్శకుడు సుజీత్ ,డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'ఓజీ' అనే టైటిల్ కి తగ్గట్టుగానే పోస్టర్ కూడా ఎంతో శక్తివంతంగా ఉంది. పవన్ కళ్యాణ్ అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ చిత్ర బృందం అనే గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. మొదటి నుండి 'ఓజీ'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌ను గంభీరమైన అవతారంలో చూపించిన హంగ్రీ చీతా గ్లింప్స్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు గ్లింప్స్ సినిమా యొక్క మరో విస్ఫోటన కోణాన్ని వెల్లడిస్తుంది. తాజా గ్లింప్స్ లో ఇమ్రాన్ హష్మీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పవన్ కళ్యాణ్ ని ఢీ కొట్టే బలమైన పాత్రలో ఆయన కనువిందు చేయనున్నారు.డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓజాస్ గంభీర్ అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీత సంచలనం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.పవన్ కళ్యాణ్, ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి నటిస్తున్నారు.



## అనుష్క కెరీర్‌లో మరో ఐకానిక్ మూవీ ఘాటి

**మీడియాతో చిట్ చాట్‌లో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి**



క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా ప్రతి సినిమా ఒక అడ్వెంచర్ లాంటిదే. ఘాటి విషయానికొస్తే డాక్టర్ చింతకింద శ్రీనివాసరావు గొప్ప రచయిత. ఆయన రచనలు అద్భుతంగా ఉంటాయి. మా కంపెనీలో 'అరేబియన్ కడలి' వెబ్ సిరీస్‌కి కథ మాటలు రాశారు. వేరే కథల గురించి చర్చించుకున్నప్పుడు ఘాటి ఆలోచన చెప్పారు. ఆంధ్ర ఒరిస్సా బోర్డర్‌లో శీలావతి గాంజా రకం పెరుగుతుంది. దాని కోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. వాటిని మోయడానికి కొంతమంది కూలీలు ఉంటారు. వారిని ఘాటీలని పిలుస్తారు. వాళ్ళ నేపథ్యం గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. 30పేజీల కథగా రాశారు. చాలా నచ్చింది. దాన్ని డెవలప్ చేయడం మొదలు పెట్టాను. లొకేషన్ కోసం తూర్పు కనుమలకు వెళ్లాను. అదంతా ఒక కొత్త ప్రపంచం. జీవన శైలి అంతా కొత్తగా ఉంది. ఒక కొత్త ప్రపంచం, కల్చర్‌ని చూపించే ఆస్కారం వుండటంతో ఘాటీ మొదలుపెట్టాం. నాయికి ప్రధానంగానే గానే పుట్టింది. వేదం తర్వాత స్వీటీతో మరో సినిమా చేయాలని ఆలోచన ఎప్పటి నుంచో ఉండేది. సరోజ చాలా గొప్ప పాత్ర. ఆ పాత్రని కొనసాగించాలని ఆలోచన కూడా జరిగింది. అయితే ఆర్గానిక్‌గా ఉండే ఒక కథ కోసం ఎదురుచూస్తున్నప్పుడు ఘాటి వచ్చింది. ఇందులో శీలావతి క్యారెక్టర్ అనుష్క గ్రేస్, యాటిట్యూడ్ సూపర్ స్టార్ డమ్‌కి పర్ఫెక్ట్ యాప్ట్. ఘాటి కథ పూర్తిగా ఫిక్షనల్. గంజాయి అనేది ఒక సోషల్ ఇష్యూ. ప్రభుత్వాలు ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అవన్నీ దాటి గంజాయి అనేది సమాజంలోకి వస్తుంది. సర్వైవల్ కోసం చేసినా పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఐడెంటిటీ, సర్వైవల్ థీమ్స్‌తో వస్తున్న సినిమా ఇది. సామాజిక సమస్యల మీద ప్రభుత్వాలే కాకుండా పౌరులందరూ పోరాడాలి. ఈ సినిమా కమర్షియల్ యాక్షన్ తో అనుష్క కోసం చేసిన ఒక బిగ్ స్కేల్ మూవీ. మనందరం ఎదుర్కొంటున్న ఒక సమస్య నిర్మూలనకి ఊతమిస్తుంది కానీ గ్లోరిఫై చేసేలా ఉండదు. ఇది చాలా కాంప్లెక్స్ స్టోరీ. చాలా తీవ్రమైన భావోద్వేగాలు ఉంటాయి. ఈ కథని చాలా అందంగా, సినిమాటిక్ గా అన్ని జాగ్రత్తలు తీసుకుని చెప్పడం జరిగింది.ఘాటి కథని యాక్షన్‌తో చెబితేనే ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఎందుకంటే అక్కడ ఉన్న పరిస్థితులు అలాంటివి. చాలా తీవ్రమైన పాత్రలు, చాలా తీవ్రమైన భావోద్వేగాలతో ఉంటాయి. యాక్షన్ సీక్వెన్స్‌లో ఆ ఎమోషన్ కనిపిస్తుంది. ఎమోషన్స్, పెర్ఫార్మెన్స్, లొకేషన్స్ పరంగా లార్జెస్ట్ కాన్వాస్ ఉన్న సినిమా ఇది. దేశిరాజు క్యారెక్టర్‌ని రాస్తున్నప్పుడే విక్రమ్ ప్రభుని ఊహించుకున్నాను. ఆయన ఫిల్మోగ్రఫీ అంతా చూశాను. ఈ క్యారెక్టర్‌కి ఆయన పర్ఫెక్ట్. దేశి రాజు చాలా స్వచ్ఛమైన క్యారెక్టర్. ఒక సమూహానికి నాయకుడు లాంటి పాత్ర. అద్భుతంగా నటించారు. ఇందులో కుందుల నాయుడు అనే క్యారెక్టర్ ఉంది. చైతన్య నాయుడు చేసిన 30 వెడ్స్ 20 వెబ్ సిరీస్ చూశాను. అలాంటి క్యారెక్టర్ ఒక విలన్ రోల్ చేస్తే కొత్తగా వుంటుంది. ఆయనకి కథ చెప్తున్నప్పుడే ఆ క్యారెక్టర్‌లో బిహేవ్ చేయడం మొదలుపెట్టారు. నేను కోరుకుంటున్నా క్యారెక్టర్ స్పార్క్ ఆయనలో కనిపించింది.అ లాగే కాష్టాలు నాయుడు క్యారెక్టర్‌లో రవీంద్ర విజయ్ కూడా అద్భుతంగా నటించారు. ఆ పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో రాజసుందరం మాస్టర్ కూడా ఒక క్యారెక్టర్ చేశారు. డీవోపీగా మనోజ్‌ని తీసుకోవడం జరిగింది. తూర్పు కనుమల్లోకి వెళ్లి చూసిన తర్వాత ఒక అద్భుతమైన ప్రకృతి సౌందర్యం కనిపించింది. ఆ బ్యూటీని క్యాప్చర్ చేయడం కీలకం. ఆ పర్వత శ్రేణుల మధ్య కథ చెప్తున్నాను కాబట్టి ఆ ఆత్మని స్క్రీన్ పైకి తీసుకురావాలి. ఆయన అద్భుతంగా ఆ పర్వత శ్రేణి ప్రకృతి సౌందర్యాన్ని క్యాప్చర్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ సాగర్ నాకు కీరవాణి గారి దగ్గర పరిచయం. నేను చేసిన చాలా యాడ్స్ కి మ్యూజిక్ చేశారు. ఆయన ప్రతిభ నాకు తెలుసు. ఈ సినిమాకి ఒక కొత్త ఫ్యుజన్ మ్యూజిక్ కావాలి. ఆ కొండలకి నిజంగా ఒక మ్యూజికల్ లాంగ్వేజ్ ఉంటే దాన్ని క్యాప్చర్ చేయగలగాలి. సాగర్ అప్రోచ్ చాలా ఇన్నోవేటివ్‌గా ఉంటుంది. ఎంతో కష్టపడి , ఇష్టపడి చేశాం. ఈనెల 5వ తేదీన విడుదల అవుతోంది. అందరు తప్పకుండ థియేటర్ కు వచ్చి చూడండి అని క్రిష్ కోరారు.

## 'మిరాయ్' ట్రైలర్ చూసిన రజనీకాంత్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ కీలక పాత్రలో నటించిన సినిమా 'మిరాయ్'. ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే రిలీజై మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ ట్రైలర్ ను సూపర్ స్టార్ రజనీకాంత్ చూసి చాలా బాగుందంటూ అప్రిషియేట్ చేశారు. గ్రాండ స్కేల్ లో మూవీ మేకింగ్ తో పాటు మనోజ్ క్యారెక్టర్ పవర్ ఫుల్ గా ఉందంటూ రజనీకాంత్ అభినందించారు. 'మిరాయ్' మూవీతో సూపర్ స్టార్ రజనీకాంత్ బ్లెస్సింగ్స్ తనకు దక్కడం పట్ల రాకింగ్ స్టార్ మంచు మనోజ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 'మిరాయ్' సినిమాతో మనోజ్ తన కెరీర్ లో మరో కొత్త ప్రయత్నం చేస్తున్నారు. తేజ సజ్జా హీరోగా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రితికా నాయక్, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. భారీ పాన్ ఇండియా చిత్రంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ మూవీ ఈ నెల 12న గ్రాండ్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## 'కొక్కొరొకో' షూటింగ్ షురూ



ప్రముఖ దర్శక, నిర్మాత రమేష్ వర్మ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు గానూ 'ఆర్‌వి ఫిల్మ్ హౌస్' అనే బ్యానర్‌ను స్థాపించారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ ప్రొడక్షన్ కంపెనీ మీద నిర్మిస్తున్న మొదటి ప్రాజెక్ట్ 'కొక్కొరొకో'ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముహూర్తపు షాట్‌కు నిర్మాత రేఖ వర్మ క్లాప్ కొట్టగా.. మరో నిర్మాత నిర్మాత కూరపాటి శిరీష కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రమేష్ వర్మ స్క్రిప్ట్‌ను దర్శకుడు శ్రీనివాస్ వసంతలకు అందజేశారు. ఈ మూవీతో శ్రీనివాస్ వసంతల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ స్క్రీన్ రైటర్ జి. సత్యమూర్తి కుమారుడు, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ సోదరుడు ప్రముఖ నేపథ్య గాయకుడు జివి సాగర్ ఈ మూవీకి సంభాషణలు రాసే బాధ్యతను స్వీకరించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆకాష్ ఆర్ జోషి, లండన్‌కు చెందిన ఒక యంగ్ అండ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ డైరెక్టర్‌గా సంకీర్తన్ పని చేయనున్నారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ బ్యానర్‌లో మొదటి చిత్రంగా తెలుగులో మంచి ఎమోషన్స్‌తో 'కొక్కొరొకో'ని రూపొందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

## హెల్త్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ,అధికారుల కమిటీతో తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం సమావేశం జరిగింది. సమావేశనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల హెల్త్ కార్డులు త్వరలో మంజూరు అవుతాయని, ఉద్యోగుల ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలు జరిగినట్లు వివరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపిందని, పెండింగ్ బిల్లులను నెలకు రూ.700 కోట్లు నుంచి రూ.750 కోట్లు ఇచ్చి వాటిని క్లియర్ చేస్తామని, నర్సింగ్ డైరెక్టరేట్‌ను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు వారు తెలిపారు. విజిలెన్స్ , ఎసిబి కేసులు ఎదుర్కొంటున్న ఉద్యోగులో రెండు సంవత్సరాలకు పైగా సస్పెన్షన్‌లో ఉన్నవారికి క్రమంగా పోస్టింగులను ఇవ్వనున్నట్లు వివరించారు. ఉద్యోగులు, ప్రభుత్వం వేర్వేరు కాదని, సుపరిపాలన కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దామని కేబినెట్ సబ్ కమిటీ సూచించినట్టు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు తెలిపారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచి

**ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాస్వామ్య సంస్థలను రక్షించుకునేందుకు రాజకీయ పార్టీల పరిధిని దాటి ఓటు వేసేందుకు ముందుకు రావాలి : ప్రొ॥కోదండరామ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాస్వామ్య సంస్థలను రక్షించుకునేందు కు రాజకీయ పార్టీల పరిధిని దాటి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఓటు వేసేందు కు ముందుకు రావాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ కోరారు. 'ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి'కి మద్దతుగా దేశ వ్యాప్తంగా విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, ప్రముఖ సామాజిక కార్యకర్తల నుంచి సేకరించిన సంతకాల పత్రాన్ని సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, సీనియర్ పాత్రికేయులు మల్లెపల్లి లక్ష్మయ్య, పాశం యాదగిరితో కలిసి కోదండరాం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదని, భారతదేశ భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ అని, ప్రజాస్వామ్య సంస్థల నిలకడపై జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. దేశంలో పౌరుల హక్కులు బలహీనమవుతున్న ఈ సమయంలో ఉప రాష్ట్రపతి ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచిగా నిలవాలని అన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం కోసం పని చేసే వారిని అర్బన్ నక్సలైట్లు అని అనడం దురదృష్టకరమని, ప్రజాస్వామ్యాన్ని కోరుకోవడం తప్పయితే, అంతకన్నా ప్రమాదకరమైనది ఇంకేమీ ఉండబోదన్నారు. కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సుదర్శన్ రెడ్డికి మద్దతు లభిస్తోందని, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ తదితరులు ఇప్పటికే తమ మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసే అర్హతలన్నీ 'సుదర్శన్ రెడ్డి కి ఉన్నాయని, ఆయన నిజమైన ప్రజల అభ్యర్థి అన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్న ఈ సమయం లో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయనను గెలిపించాలని కోరారు. పాశంయాదగిరి మాట్లాడుతూ రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న వ్యక్తి సుదర్శన్ రెడ్డి అని అన్నారు.

## అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలనే సిఎం రేవంత్‌రెడ్డి ఫిలాసఫీ



**కాంగ్రెస్ ఎంపి మల్లు రవి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలైట్ల సానుభూతి పరుడని, ఆయనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యాలను కాంగ్రెస్ ఎంపి మల్లు రవి ఆక్షేపించారు. మనుషులను చంపినంత మాత్రాన దేశంలో నక్సలిజం సమిసిపోదని కేంద్రం గుర్తుంచు కోవాలని సూచించారు. గాంధీభవన్‌లో మంగళవారం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు అందాలనేదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇందులో పేద ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాలనే సిద్ధాంతానికి మాత్రమే సిఎం అనుకూలం తప్ప తుపాకులు పట్టుకోవడానికి పూర్తి వ్యతిరేకమన్నారు. ఫిలాసఫీ ఉంది కాబట్టే రాజశేఖర్ రెడ్డి నక్సలైట్లతో చర్చలు జరిపారని గుర్తు చేశారు. బిజెపి ధనవంతులు, వ్యాపారుల పార్టీ అని అందుకే కేంద్ర మంత్రి బండి సంజయ్ అలా మాట్లాడుతున్నరని, నక్సలిజానికి, టెర్రరిజానికి తేడా తెలుసుకోవాలన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం వాళ్ళను వాళ్లే చంపుకునే వ్యవస్థపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి తన విధుల్లో భాగంగా ఇచ్చిన స్టేట్మెంట్‌ను 14 సార్లు రివ్యూ చేసి అది పర్ఫెక్ట్ జడ్జిమెంట్ అని అందరూ ఒప్పుకున్నారన్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, బండి సంజయ్‌లు ఎంత ఎక్కువ విమర్శలు చేస్తే సిఎంరేవంత్ రెడ్డిపై, జస్టిస్ సుదర్శన్ రెడ్డిలకు అంతా ఎక్కువ మద్దతు లభిస్తుందన్నారు.

## నిలదీయనున్న రాష్ట్రాలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థికమంత్రులు పాల్గొని తదుపరి సంస్కరణలు చేపట్టేందుకు ఉద్దేశించి మంత్రులబృందం చేసిన సిఫార్సులపై చర్చిస్తారు. ఈ సిఫార్సులు ఆమోదం పొందితే ఐదుశాతం, 18 శాతం అనే రెండు పన్ను శ్లాబులు చెలామణీలోకి వస్తాయి.ఇప్పటివరకూ ఉన్న 12 శాతం, 28 శాతం శ్లాబులు రద్దవుతాయి. కానీ ఎంపిక చేసిన కొన్ని ప్రత్యేక వస్తువులపై 40 శాతం సుంకాలభారం విధించేందుకు కూడా కేంద్రం ప్రతిపాదించింది. ఈ కేటగిరీలో సమాజానికి హానిచేసే పొగాకు, పాన్‌మసాలా, సిగరెట్లు సహా ధనికులు వాడే విలాస వస్తువులు ఉన్నాయి. ఇంతభారీగా 40 శాతం పన్ను వసూలు ఆదాయాన్ని రాష్ట్రాలకు కూడా పంచాలని ప్రతిపక్షతృణమూల్ కాంగ్రెస్ పాలిత పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. జిఎస్‌టి శ్లాబుల ప్రక్షాళన తర్వాత రాష్ట్రాలకు కలిగే ఆదాయ నష్టాల పరిహారం చెల్లించాలని హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ఎనిమిది రాష్ట్రాల పాలకులు డిమాండ్ చేస్తున్నారు. కొత్త సంస్కరణలవల్ల సామాన్య ప్రజలు రోజువారీగా ఉపయోగించే అనేక ఆహార వస్తువులు, ఇతర వినియోగ వస్తువులపై ఇప్పటివరకూ ఉన్న 12 శాతం జిఎస్‌టి శ్లాబుల కుదింపువల్ల ఐదుశాతానికి మారుతుంది. 12,28శాతం శ్లాబులను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు జిఎస్‌టి మంత్రుల బృందం తన సమ్మతి తెలియజేయడంతో ఈ బృందం ఇచ్చిన సిఫార్సులను రెండు రోజుల కీలక సమావేశాలలో జిఎస్‌టి మండలి పరిశీలిస్తుంది. జిఎస్‌టి వసూళ్ళలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని, సామాన్య ప్రజలపై పెనుభారాలు పడుతున్నాయని, రాష్ట్రాలకు నష్టం జరుగుతోందని కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆర్థికమంత్రులు తీవ్ర విమర్శలు చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోలేదు. పలు రాష్ట్రాలో అసెంబ్లీలకు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రజా వ్యతిరేత ఎదుర్కొంటున్న నరేంద్రమోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను ఆకట్టుకోవడానికి శ్లాబుల కుదింపు ప్రతిపాదన చేసింది. సామాన్య ప్రజలకు మేలు కలిగించే ఈ ప్రతిపాదనలను కొన్ని మార్పులతో దాదాపు అన్ని రాష్ట్రాలు స్వాగతించాయి. శ్లాబుల కుదింపులపై రెండు రోజుల చర్చల్లో సిఫార్సులు ఆమోదం పొందితే సామాన్య ప్రజలు నిత్యం ఉపయోగించే అనేక ఆహార,వినియోగ వస్తువులపై జిఎస్‌టి భారం గణనీయంగా తగ్గుతుంది.పాలు, నెయ్యి, గింజలు, ఇరవైలీటర్ల తాగునీటి డబ్బాలు, చిరుతిళ్ళు, కొన్ని రకాల చెప్పులు, దుస్తులు, ఔషధాలు, వైద్య ఉపకరణాలన్నింటిపై ఇప్పటివరకూ 12 శాతం జిఎస్‌టి విధించారు. ఇకమీదట ఈ వస్తువులన్నింటినీ ఐదుశాతం జిఎస్‌టి కేటగిరీకి మార్పుచేస్తారు. ఐదుశాతం జిఎస్‌టి పరిధిలోకి వెళ్ళడంవల్ల పెన్సిళ్ళు, సైకిళ్ళు, గొడుగులు, స్త్రీలు ఉపయోగించే జడపిన్నులు వంటి ఉత్పత్తుల ధరలు కూడా బాగా తగ్గుతాయి. కొన్ని కేటగిరీలకు చెందిన టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులన్నీ ఇప్పటివరకూ 28 శాతం జిఎస్‌టి శ్లాబు కేటగిరీలో ఉన్నాయి. ఇకమీదట ఇవన్నీ 18 శాతం శ్లాబు కేటగిరీలోకి వెళ్ళడంవల్ల వీటన్నింటి ధరలూ తగ్గుతాయి. ఆటోమొబైల్స్‌పై ప్రస్తుతం అత్యధికంగా 28 శాతం జిఎస్‌టి సహా పరిహార సుంకం కూడా వసూలు చేస్తున్నారు. ఎంట్రీ లెవెల్ కార్లకు 18 శాతం, ఎస్‌యువిలు, లగ్జరీ కార్లకు ప్రత్యేకంగా 40 శాతం పన్నురేటు వసూలు చేసే అవకాశం ఉంది. నాలుగు అంచెల జిఎస్‌టి శ్లాబుల వధానం 2017 జులై ఒకటో తేదీన అమలులోకి వచ్చింది.

## మైత్రికి ఉదాహరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన దేశాల మైత్రికి ఒక ఉదాహరణగా మారిందని, ఇరుగు–పొరుగు మధ్య శాశ్వత స్నేహం, సమగ్ర వ్యూహాత్మక సమన్వయం, పరస్పర ప్రయోజనకరమైన సహకారం కూడా ఈ మైత్రీ బంధంలో ఇమిడి ఉన్నాయని చెప్పారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు, చైనా 80వ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు నాలుగురోజుల పర్యటనకు వెళ్ళిన పుతిన్ మంగళవారం జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.ఉన్నతస్థాయిలో సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి, ఒకరి అభివృద్ధితో మరొకరి పునరుజ్జీవనానికి అవకాశం ఇచ్చేందుకు, ఇరు దేశాల ప్రయోజనాలు కాపాడుకుంటూ ఒకరి సమస్యలు మరొకరు పంచుకోవడానికి సకాలంలో సమన్వయపూర్వకంగా వ్యవహరించడానికి, మరింత అభివృద్ధి సాధించడంకోసం ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకువెళ్ళడానికి చైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని పుతిన్‌కు జిన్‌పింగ్ చెప్పారు. ఇరుదేశాలూ సహకారాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రపంచానికి ఆదర్శంగా ఉండే ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, సహకారాన్ని ఏకీకృతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా రెండో ప్రపంచయుద్ధ విజయాలను గుర్తుచేసుకున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో విజేతలైన చైనా,రష్యా దేశాలు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో తమ బాధ్యతలను ఎంతో సక్రమంగా నిర్వర్తిస్తున్నాయని జిన్‌పింగ్ అన్నారు. రెండవ ప్రపంచయుద్ధంనాటి విజయవంతమైన ఫలితాలను రక్షించడానికి, రెండవ ప్రపంచయుద్ధంపై సరైన చారిత్రక దృక్పధాన్ని కాపాడటానికి ఇరు దేశాలకున్న దృఢసంకల్పాన్నీ ఈ మైత్రీబంధం దోహదం చేస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. ప్రపంచపాలనకు సంబంధించి మరింత న్యాయమైన,హేతుబద్ధమైన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చైనా సిద్ధంగా ఉందని పుతిన్‌కు చెప్పారు.

### పంచశీల సూత్రాలకు పుతిన్ మద్దతు

తియాన్‌జిన్‌లో సోమవారం జరిగిన షాంఘై సహకార సంస్థ 25వ వార్షికోత్సవ సదస్సులో జీ జిన్‌పింగ్ ప్రతిపాదించిన పంచశీల సూత్రాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ మద్దతు ఇచ్చారు. ఘర్షణలు లేని సమాన ప్రపంచ పాలనకోసం ప్రతిపాదించిన ఈ పంచశీల సూత్రాలను జిజిఐ (గ్లోబల్ గవర్ననెన్స్ ఇనీషియేటివ్)గా జిన్‌పింగ్ నిర్వచించారు. ''మనందరం సార్వభౌమత్వ సమానత్వానికి,అంతర్జాతీయ నియమాలకు కట్టుబడి ఉండటం, ఒకే ప్రాపంచిక లక్ష్యంకోసం బహుళపాక్షికతకును పాటించడం,ప్రజలే కేంద్రంగా ప్రభుత్వ వైఖరిని తీసుకోవడం, ఆచరణాత్మకంగా సరైన చర్యలకు కట్టుబడటమే జిన్‌పింగ్ ప్రతిపాదించిన పంచశీల సూత్రాలు. మరింత న్యాయమైన, సమానమైన ప్రపంచ పాలనావ్యవస్థకోసం భావసారూప్యతగల దేశాలన్నీ కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ కోరారు.

## యమున ఉగ్రరూపం...

(మొదటి పేజీ తరువాయి)

చేరుతుండడంతో యమునా తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు వరద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం తెల్లవారుజామున యమునా నది 205.33 మీటర్ల డేంజర్ మార్క్ దాటడంతో దేశ రాజధానిలో భారీ వరదలు పోటెత్తే అవకాశం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఖాళీ చేసి... ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయ శిబిరాలకు చేరుకోవాలని సూచించింది. సోమవారం హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి మూడు లక్షలకు పైగా క్యూసెక్కులు విడుదల చేయడంతో నీటిమట్టం పెరిగింది. హత్నికుండ్ నుంచి విడుదలయ్యే నీటివల్ల సాధారణంగా 36 నుంచి 48 గంటల్లో నగరం మొత్తం వరదల్లో చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, పరిస్థితులను పర్యవేక్షించడానికి ఢిల్లీ యంత్రాంగం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా పేర్కొన్నారు. మరోవైపు మంగళవారం సాయంత్రానికి యమునా నది 206 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. దీంతో ఉద్యోగులు ఇంటి నుంచే పని చేశారు. పాఠశాలలు సైతం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాయి. భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో ఢిల్లీ రోడ్లు జలమయమయ్యాయి. ఢిల్లీజైపూర్ జాతీయ రహదారిపై 78 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు 3 గంటలకు పైగా ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి సంబంధించిన దశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్షాలు ఢిల్లీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాగా, భారీ వర్షాలు కురవడంతో భారత వాతావరణ శాఖ రాజధాని ప్రాంతంలోనూ, నోయిడా, హర్యానాలోని గురుగ్రామ్, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు రెడ్ అలర్టు జారీ చేసింది. అలాగే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. కాగా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ రాష్ట్రాలకు కూడా ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వర్షాల వల్ల హర్యానా రాజధాని చండీగఢ్‌లో విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో అన్ని స్కూళ్లకు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. అవసరమైతే... విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు తీసుకోవచ్చని విద్యాశాఖ సూచనలు జారీ చేసింది. గురుగ్రామ్‌లో వర్షం వల్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. అక్కడ అన్ని స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com